PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 150 | విజయవాడ, గురువారం 1 జనవరి 2026 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 1 January 2026 | Rs

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ వెలుగులు చిమ్ముతున్న బాణాసంచా

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు ప్రజాశక్తి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు

- సంపాదకులు

సిఐటియు అఖిల భారత మహాసభ ప్రారంభ సూచకంగా పతాకావిష్కరణ గావిస్తున్న కె హేమలత

ప్రారంభసభలో ప్రసంగిస్తున్న డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్, వేదికపై సిఐటియు, వివిధ ట్రేడ్ యూనియన్ల నాయకులు

ఐక్యతే ఆయుధంగా ఆధిపత్య వర్గాలపై పోరు

డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ పిలుపు

- సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు మన శత్రువులు
- శ్రామికులపై మోడీ ప్రభుత్వం తీవ్ర దాడి
- విశాఖపట్నంలో ఉత్తేజ భరితంగా ప్రారంభమైన సిఐటియు 18వ అఖిల భారత మహాసభ

కార్పొరేట్ ఆధిపత్య వర్గాల దోపిడీని కార్మికవర్గం ఐక్య పోరాటాల ద్వారా తిప్పికొట్టాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని అనతలవట్టం ఆనందన్ నగర్ (ఎయు కన్వెన్షన్ హాల్)లో ఐదు రోజుల పాటు జరిగే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 18వ అఖిల భారత మహాసభనుద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సామ్రాజ్యవాదం, పెట్టుబడి దారీ విధానానికి వ్యతిరేకంగా కార్మిక, కర్షక ఐక్యతతో బలమైన పోరాటాలు రావాలని కోరారు. అంతకుముందు అత్యంత ఉత్తేజపూరిత వాతావరణంలో సిఐటియు మహాసభ ప్రారంభమైంది. మహాసభ ప్రారంభ సూచికంగా సంఘం పతాకాన్ని సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత ఆవిష్కరించారు. మహాసభలో జాతీయ ట్రేడ్ యూనియన్ల నాయకులు సౌహార్ధ సందేశాలిచ్చారు. ఫిబ్రవరి12న అఖిలభారత సమ్మెను జయప్రదం చేయాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

(వార్త 7లో)

పండగ వాతావరణంలో 2 కొత్త జిల్లాల ఆవిర్భావం

ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం

పండగ వాతావరణంలో బుధవారం రెండు కొత్త జిల్లాల ఆవిర్భావం జరిగింది. అన్నమయ్య జిల్లా కేంద్రం మారింది. రంపచోడవరం, మార్కాపురం, మదనపల్లెల్లో కొత్త కలెక్టరేట్లు ప్రారంభమయ్యాయి. కొత్త జిల్లాల్లో కొత్త కలెక్టర్లు, కొత్త ఎస్‌పిలు కొలువుదీరారు. రంపచోడవరం కేంద్రంగా రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటైన పోలవరం జిల్లా కలెక్టర్‌ను జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్, అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు ప్రజాసంఘాలు, వివిధ పార్టీల ప్రతినిధులు, వివిధ గిరిజన సంఘాల పోరాట ఫలితంగా, ఏజెన్సీ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు చేసిందన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్ల లోని గిరిజనులు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు వెళ్లాలంటే సుమారు 250 కిలోమీటర్ల దూరం వ్యయ, ప్రయాసలకోర్చి ప్రయాణించాల్సి వచ్చేందని, ఇకనుండి ఈ ప్రాంతాల వారికి రంపచోడవరం కలెక్టరేట్ నుంచే ప్రభుత్వ సేవలు అందనున్నాయని తెలిపారు. గుర్తేడు మండలాన్ని ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిందన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మాట్లాడుతూ నూతన జిల్లా ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం రూ.5 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఎస్.బొజ్జిరెడ్డి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ శ్రీనివాస రావు, అల్లూరి జిల్లా జాయింట్ కలెక్టర్, పోలవరం ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ, రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరంలోని

మిగతా 2లో

పోలవరం కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ చిత్రంలో ఎమ్మెల్యే శిరీషాదేవి

లేబర్ కోడ్స్ డ్రాఫ్ట్ రూల్స్

- నోటిఫై చేసిన కేంద్రం 2

దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు

- డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహకాలు పెంపు
- గిగ్ వర్కర్ల సమ్మె పిలుపునకు ప్రతిఫలం 2

ఆ మరణాలకు బాధ్యత ప్రభుత్వానిదే : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ, ఆశ్రమ పాఠశాలల్లోని, వసతి గృహాల్లోని బాలబాలికల మరణాలపై హైకోర్టు తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. 2016 నుంచి ఇప్పటి వరకు 45 మంది బాలబాలికలు చనిపోయారని చెప్పింది. హాస్టల్స్‌లో ఉన్న బాలబాలికలను కాపాడే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొంది. ఏయే కారణాల వల్ల వారు మరణించారో వివరిస్తూ కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. బాలబాలికల రక్షణకు ప్రభుత్వ విధానం ఏమిటో చెప్పాలంది. హాస్టళ్లలో పిల్లలు జ్వరం, కడుపు నొప్పి, కంటి ఇన్‌ఫెక్షన్, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ వల్ల చనిపోతున్నారని అధికారులు చెబుతున్నారని, వాటిని ముందుగా నివారించేందుకు అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. ఈ విషయంలో అధికారులు తమ విధులను నిర్వహించడంలో విఫలమయ్యారని తప్పుబట్టింది. నెలవారీ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే వ్యవహారంపై వివరాలివ్వాలంది. మరణించిన వారి కుటుంబాలకు ఏమైనా పరిహారం చెల్లించారో లేదో చెప్పాలంది. హాస్టళ్లలో హెల్త్ వలంటీర్లను నియమించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఉత్తరాంధ్ర కమిటీ ఆఫ్ గిరిజన సంక్షేమ సంఘం ప్రతినిధి పలక రంజిత్ కుమార్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై విచారణను జనవరి 21కి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం ఆదేశించింది.

వొడాఫోన్ ఐడియాకు భారీ లబ్ధి!

- రూ.87,695 కోట్ల బకాయిలపై మారటోరియం, వడ్డీ రద్దు
- 2031 నుంచి పదేళ్ల వరకు వెసులుబాటు
- కేంద్ర కేబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ : ప్రయివేటురంగ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా (విఐ)కి మోడీ సర్కార్ భారీ లబ్ధి చేకూర్చింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాలకు (ఎజిఆర్) సంబంధించి రూ.87,695 కోట్ల బకాయిలకు మారటోరియం కల్పిస్తూ కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని ఆర్థిక సంవత్సరం 2031-32 నుంచి 2041 మార్చి మధ్య చెల్లించేలా వెసులుబాటు కల్పించింది. దీంతో ఈ మొత్తాన్ని విఐ ఇప్పటికిప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు. అదే విధంగా వడ్డీని రద్దు చేసింది. దీంతో వొడాఫోన్ ఐడియాకు ఆర్థికంగా భారీ మద్దతును అందించినట్లయ్యింది. టెలికం కంపెనీలు స్పెక్ట్రమ్ యూసేజ్ ఛార్జీలు, లైసెన్స్ ఫీజులకు సంబంధించి 2003-04 నుంచి 2018-19 మధ్య దాదాపు 15 ఏళ్లకు సంబంధించిన భారీగా ఎజిఆర్ బకాయిపడ్డాయి. మారటోరియం పీరియడ్ అంటే దాదాపు 25 ఏళ్ల వరకు బకాయిలపైనా వొడాఫోన్ ఐడియా వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదు. నిలుపుదల చేసిన బకాయిలను టెలికాం విభాగం తిరిగి మదింపు చేయనుంది. దీనిపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాలకు సంబం ధించిన ఎజిఆర్ బకాయిలు మాత్రం 2025-26 నుంచి 2030-31 మధ్య యథాతథంగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వొడాఫోన్ ఐడియాలో ప్రభుత్వానికి 49 శాతం వాటా ఉంది. 20 కోట్ల మంది వినియోగదారులున్నారు. బుధవారం బిఎస్ఇలో విఐ షేర్ విలువ 11.53 శాతం తగ్గి రూ.10.67 వద్ద ముగిసింది.

రెండు హైవే ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదం

వోడా ఫోన్‌కు ఉపశమనంతో పాటు బుధవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ నిర్ణయాలను న్యూఢిల్లీలోని మీడియా సెంటర్‌లో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు వివరించారు. దేశంలోని రెండు హైవేల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రూ.19,142 కోట్ల వ్యయంతో నాసిక్- సోలాపూర్-అక్కల్ కోట్ హై స్పీడ్ కారిడార్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. చెన్నై నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని రేణిగుంట, కర్నూలు, కడప మీదుగా ఈ హైవే వెళ్లనుంది. చెన్నై పోర్టు, హజీరా పోర్టుకు కనెక్టివిటీ పెరుగనుంది. కొప్పర్తి, ఓర్వకల్ పారిశ్రామిక ఇండస్ట్రియల్ కారిడార్లకు హై స్పీడ్ నెట్‌వర్క్ ఉపయోగపడనుంది. రెండేళ్లలో రోడ్డు నిర్మాణం పూర్తికానుంది. ఒడిశాలోని జాతీయ రహదారి 326 వెడల్పు, బలోపేతం కోసం రూ.1526 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారి 326 అభివృద్ధితో దక్షిణ ఒడిశా ముఖ్యంగా గజపతి, రాయగడ, కోరాపుట్ జిల్లాలకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి తెలిపారు. ఎంపిక చేసిన ఉక్కు ఉత్పత్తులపై మూడు సంవత్సరాలపాటు దిగుమతి సుంకం విధించాలని కేంద్రం నిర్ణయించింది. మొదటి సంవత్సరం 12 శాతం, రెండో ఏడు 11.5 శాతం, మూడో సంవత్సరం 11 శాతం సుంకాలు విధిస్తారు.

న్యూ ఇయర్ వేళ విశాఖలో డ్రగ్స్ కలకలం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ (విశాఖ)

న్యూ ఇయర్ వేళ విశాఖలో గంజాయి, డ్రగ్స్ కలకలం రేపింది. ఎంవిపి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ఎంవిపి పోలీసు స్టేషన్ పరిధిలో గల లాసన్స్ బే కాలనీ కెకెఆర్ గౌతమ్ స్కూల్ జంక్షన్ వద్ద ముగ్గురు వ్యక్తులు ఒక స్కూటర్‌పై గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. స్కూటర్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులను ఆపి వారి వాహనాన్ని, బ్యాగును తనిఖీలు చేయగా 5.350 కిలోల గంజాయి, 3.8 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్ ఉన్నట్లు గుర్తించారు. నిందితులు కాంగ్రేగుల జయవిన య్, కొంకి శ్యామ్, బీల సాయిలోహిత్‌లను అదుపులోకి తీసుకున్నారు. గంజాయిని అరుణ్ కుమార్ అనే వ్యక్తి నుండి, ఎండిఎంఎ డ్రగ్‌ను బెంగళూరులో ఉన్న తన బంధువు కాంగ్రేగుల హరీష్ నుండి జయ వినయ్ కొనుగోలు చేసి, విశాఖపట్నం, అనకాపల్లిలో విక్రయించేవారు. మిగిలిన ఇద్దరు ఈ నిషేధిత పదార్థాలను ప్యాకింగ్ చేసి అమ్మడంలో తనకు సహకరిస్తున్నార ని తెలిపారు. కొంకి శ్యామ్, బీలా సాయి లోహిత్ కూడా తమ ప్రమేయాన్ని, గంజాయి, ఎండిఎంఎ వినియోగాన్ని ఒప్పుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

గ్రీటింగ్స్ పేరుతో సైబర్ మోసం

- ఎపికె ఫైల్స్ ద్వారా నేరగాళ్ల ఎర

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

న్యూయర్ సందడి మొదలైంది. వీడియోలు, గ్రీటింగ్స్‌తో శుభాకాంక్షలు చెప్పేందుకు అంతా సిద్ధమయ్యారు. కొన్ని మెసేజ్ ఫార్వర్డ్స్ వల్ల సమస్యలు కొన్ని తెచ్చుకునే ప్రమాదం పొంచి ఉంది. న్యూయర్ గ్రీటింగ్స్, ఇయర్ ఎండింగ్ రివార్డుల పేర్లతో రకరకాల లింక్స్‌ను సైబర్ నేరగాళ్లు పార్వర్డ్స్ చేసే ప్రమాదం ఉంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతూ ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ ద్వారా గిఫ్ట్, గ్రీటింగ్స్ అంటూ ఎపికె ఫైల్స్ లింకులు పంపిస్తూ మొబైల్ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. ఒకవేళ అలాంటి లింక్స్‌పై క్లిక్ చేస్తే మీ మొబైల్‌లో మాల్‌వేర్ ఇన్‌స్టాల్ అయిపోతుంది. దీంతో మీ మొబైల్‌కు వచ్చే ఒటిపిలు, ఇతర వివరాలను సైబర్ నేరగాళ్లు దొంగలించే ప్రమాదం ఉంది. మీ అకౌంట్‌లోని నగదును దోచేస్తారు. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తయారు చేసుకోవచ్చని పంపే లింకులు క్లిక్ చేయరాదని సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నారు. 1930 హెల్ప్‌లైన్, నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా నిరంతరం సేవలు అందిస్తున్నామని కాకినాడ జిల్లా ఎస్‌పి బిందుమాధవ్ తెలిపారు. డిజిటల్ అరెస్టులు, ఒటిపి మోసాలు, పెట్టుబడి మోసాలు, ఆన్‌లైన్ లోన్ యాప్ మోసాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ కాకినాడ జిల్లాలో 2024లో సైబర్ క్రైమ్స్‌కు సంబంధించి 55 కేసుల్లో రూ.14.70.కోట్లను కొల్లగొట్టారు. 2025లో 62 కేసుల్లో రూ.12.96 కోట్లు సొమ్ము ఆన్‌లైన్‌లో దోచుకున్నారు. ఈ నేరాల్లో 2024లో బాధితులకు రూ.3.40 లక్షలు, 2025లో రూ.95.24 లక్షలు తిరిగి వచ్చాయి.

ఖజానా కడగండ్లు

- భారంగా ముగిసిన 2025
- బిల్లులు అడగొద్దంటూ ముఖంచాటు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కొత్త సంవత్సరం ముంగిట ఖజానా కడగండ్లు కన్నీరు తెప్పిస్తున్నాయి. లోటు భారం, రుణ భారం ఆందోళన కలిగిస్తున్నాయి. ఒక విధంగా 2025 ఆర్థిక సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వానికి ఇబ్బందికరంగానే మారినట్లు ఆర్థికశాఖ అధికారులే చెబుతున్నారు. పెరిగిన ఖర్చులు, తగ్గిన ఆదాయం, కేంద్రం నుంచి సహకార లేమి వంటి అంశాలు ఖజానాపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఇదే భారం వచ్చే మూడు నెలలపాటు కొనసాగి, 2026-27 ఆర్థిక సంవత్సరాన్ని కూడా వెంటాడుతాయని ఆర్థికశాఖ ఆందోళన వ్యక్తం చేస్తోంది. బిల్లుల కోసం తిరగొద్దంటూ నేరుగా కాంట్రాక్టర్లు, ఇతర సంస్థలకు ముఖం మీదే చెబుతున్నారని సమాచారం.

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే తొమ్మిది నెలలు గడిచిపోయాయి. నేటి నుంచి చివరి త్రైమాసికం కూడా ప్రారంభమవుతుంది. ఆ తరువాత ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుంది. కాని, ఆర్థిక సమస్యలు తగ్గుదలలో మాత్రం మార్పు కనిపించడం లేదని అధికారులు వాపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే లోటు దాదాపు 170 శాతం వరకు ఉన్నట్లు చెబుతున్నారు. అటు ద్రవ్య లోటు, ఇటు ఆదాయ లోటు కూడా గణనీయంగా పెరిగిపోతుండడం ఖజానాకు ఇబ్బందికరంగానే మారుతోందని చెబుతున్నారు. రుణం కూడా అదే స్థాయిలో చేయాల్సి రావడంతో లోటుపై ప్రభావం చూపిస్తోందంటున్నారు. బడ్జెట్ అంచనాల కన్నా రుణాలు పెరిగిపోతున్నాయి. నవంబరు నాటికే 96 శాతం వరకు రుణాలు తీసేసుకోగా, అది డిసెంబరు నాటికి 98 శాతానికి చేరినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు.

కేంద్రం సహకారం కరువు

బిజెపితో కూడిన కూటమి ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం కూడా ఖజానా కష్టాలకు కారణమవుతోంది. ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు హస్తిన చుట్టూ చక్కర్లు కొడుతున్నా ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు కేవలం పాతికశాతం నిధులొచ్చినట్లు ఒక అంచనా. రూ.32,284 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో అంచనా వేయగా, నవంబరు వరకు కేవలం 7,693 కోట్లు కేంద్రం నుంచి వచ్చాయి. డిసెంబరు లెక్కలు ఇంకా తేలాల్సి ఉందని అధికారులు అంటున్నారు. ఇదే సమయంలో పన్నుల ఆదాయం కూడా ఆశించిన స్థాయిలో పెరగడం లేదని తేలింది. మొత్తం పన్నులు, కేంద్రం నుంచి రావాల్సిన ఆదాయం రూ.2.17 లక్షల కోట్లుగా అంచనా వేయగా, ఇప్పటి వరకు రూ.1.20 లక్షల కోట్ల వరకు వచ్చినట్లు అంచనా వేస్తున్నారు. దీంతో కష్టాలు కొద్దిగానైనా గట్టెక్కాలంటే ఈ ఏడాది తొలి మూడు నెలలు అంటే ఈ ఆర్థిక సంవత్సరంలో చివరి త్రైమాసికంలో భారీ నిధులు సమకూరాల్సి ఉందని ఆర్థికశాఖ చెబుతోంది.

మూడు నుంచి గుంటూరులో ప్రపంచ తెలుగు మహాసభలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో జనవరి మూడు నుంచి ఐదవ తేదీ వరకూ గుంటూరులో మూడవ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహిస్తున్నట్టు పరిషత్ అధ్యక్షులు గజల్ శ్రీనివాస్, మహాసభల సమన్వయకర్త రామచంద్రరాజు తెలిపారు. నగరంలోని స్థానిక భారతీయ విద్యా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొలి రోజు ఉదయం తొమ్మిది గంటలకు అన్నమయ్య గళార్చనలతో మహాసభలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సభకు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పి.నరసింహ, కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, జి.కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు హాజరు అవుతారని తెలిపారు. మూడవ తేదీ సాయంత్రం 'ఆంధ్ర శ్రీ-పూర్ణకుంభ పురస్కారాల సభ'కు ముఖ్య అతిథిగా ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, పలువురు న్యాయమూర్తులు, పార్లమెంటు సభ్యులు హాజరు కానున్నారు. నాల్గవ తేదీ 'తెలుగు వెలుగుల సభ'కు మారిషస్ దేశ అధ్యక్షులు ధరమ్‌బీర్ గోకుల్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు రాష్ట్ర మంత్రులు పాల్గొననున్నారని తెలిపారు. అదే రోజు సాయంకాలం తెలుగు వైభవ సభలో వివిధ రంగాలకు చెందిన కవులు, కళాకారులు, నృత్యకారులకు పురస్కారాలను ప్రదానోత్సవం చేయనున్నట్లు చెప్పారు. ఐదవ తేదీ 'ఆంధ్ర మేవ జయతే' సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గోవా గవర్నర్ పి. అశోక్‌గజపతి రాజు హాజరు అవుతారని తెలిపారు. ఈ సభలో మూడవ ప్రపంచ తెలుగు మహాసభల పోస్టల్ కవర్‌ను సిఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరిస్తార ని చెప్పారు. ఐదవ తేదీ సాయంకాలం జరిగే 'మన తెలుగు భాష, అమృత భాష సభ'లో మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్యానాయుడు పాల్గొననున్నారని చెప్పారు. తరువాత సమాపనోత్సవ సభ జరుగుతుందని, ఈ సభలో మాజీ చీఫ్ జస్టిస్ ఎన్.వి.రమణ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా కవితా గోష్టులు, సాహితీ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో కాలిపోయిన ఆటో, డ్రైవర్

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ సజీవదహనం

ప్రజాశక్తి - రాచర్ల (మార్కాపురం జిల్లా)

మార్కాపురం జిల్లా రాచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో రంగారెడ్డిపల్లె అడ్డరోడ్డు వద్ద అమరావతి-అనంతపూర్ రాష్ట్ర రహదారిలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సజీవదహనమయ్యారు. పోలీసుల కథనం ప్రకారం... తుని నుంచి అనంతపురం వైపు జీడిపప్పు లోడుతో వెళ్తున్న ఆటో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల్లో చిక్కుకున్న ఆటో డ్రైవర్ ఎర్రిస్వామి (50) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ప్రయాణిస్తున్న ఆటో యజమాని కందిపల్లి జయరామిరెడ్డి (35) తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్ ద్వారా గిద్దలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆటోలో రేగిన మంటలు అదుపు చేశారు. రాచర్ల ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

అభివృద్ధి వైపు రాష్ట్రం

- టిడిపి ఎమ్మెల్యే నజీర్ అహ్మద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విధ్వంసం నుంచి విజన్ వైపు, అరాచకం నుంచి అభివృద్ధి వైపు రాష్ట్రం వెళ్తోందని టిడిపి ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 18 నెలల కూటమి పాలనలో పెట్టుబడులకు స్వర్గధామిగా రాష్ట్రం మారిందని తెలిపారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు పూర్తిగా సూపర్ హిట్ అయ్యాయని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా వేగంగా రాష్ట్రం అభివృద్ధి అవుతోందన్నారు. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సమయంలో అభివృద్ధి-సంక్షేమం రెండింటినీ సమతుల్యంగా నడిపిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు బలపరచాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పి అశోక్ బాబు మాట్లాడుతూ.. జగన్ తన పాలనలో ఆర్థిక విధ్వంసం సృష్టించి శాంతి భద్రతలనేవి లేకుండా చేశారని విమర్శించారు. సంక్షేమ పథకాలు అమలు చేశామని చెప్పడమే తప్ప చేసింది మాత్రం శూన్యమని పేర్కొన్నారు. రాష్ట్ర అప్పులపై జగన్.. ప్రజలను గందరగోళానికి గురిచేసేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. రూ.1.19 లక్షల కోట్ల రాష్ట్ర అప్పును రూ.2.93 లక్షల కోట్లుగా చూపించడం పూర్తిగా అబద్ధమన్నారు.

లేబర్ కోడ్స్ డ్రాఫ్ట్ రూల్స్ నోటిఫై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు సంబంధించి డ్రాఫ్ట్ రూల్స్‌ను నోటిఫై చేసింది. 2026 ఏప్రిల్ 1 నుంచి వీటిని దేశవ్యాప్తంగా అమల్లోకి తీసుకొచ్చే ఉద్దేశంతో ఈ రూల్స్‌ను ప్రచురించింది. ఇది ఉమ్మడి జాబితాలోకి వచ్చే అంశం కావడంతో ఆయా రాష్ట్రాలు కూడా ఈ నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉంటుంది. వేతనాలు, సామాజిక భద్రత, పారిశ్రామిక సంబంధాలు, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులకు సంబంధించిన కోడ్‌ల ముసాయిదా నిబంధనలపై అభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్, 2020కి 30 రోజులు, మిగిలిన మూడు కోడ్‌లకు 45 రోజులు గడువు ఇచ్చింది. గతంలో రాష్ట్రాలు డ్రాఫ్ట్ రూల్స్‌ను ప్రచురించినప్పటికీ.. కొన్ని నెలలు గడిచిపోయిన నేపథ్యంలో ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా మరోసారి ముసాయిదా రూల్స్‌ను ప్రచురించాల్సి ఉంటుంది. కొత్త లేబర్ కోడ్‌లను నోటిఫై చేసే వరకు పాత చట్టాలు అమల్లో ఉంటాయి. ఈ కోడ్‌లలో వేజ్, అలవెన్స్, గ్రాట్యుటీకి సంబంధించిన నిబంధనలు పొందుపరిచారు.

కొత్త లేబర్ కోడ్‌లలో 'వేజ్' నిర్వచనం..

కొత్త లేబర్ కోడ్‌లలో 'వేజ్' అనే పదానికి నిర్వచనం ఇచ్చారు. ఇందులో బేసిక్ పే, డియర్‌నెస్ అలవెన్స్, రిటైనింగ్ అలవెన్సు ఉంటాయి. మిగిలినవి అలవెన్సు రూపంలో ఉంటాయి. ఉద్యోగికి చెల్లించే మొత్తం వేతనంలో అలవెన్సులు 50 శాతం మించకూడదు. అంటే ఇకపై తక్కువ బేసిక్ పే చూపించడానికి వీల్లేదు. పర్ఫార్మెన్స్ బేస్డ్ ఇన్సెంటివ్స్, ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్స్ (ఇఎస్‌ఓపీఎస్), వేరియబుల్ పే, రీయంబర్స్‌మెంట్స్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ వంటివి 50 శాతం నిబంధన పరిధిలోకి రావు. వీటిని వేజెస్‌గా పరిగణించరు. ఉదాహరణకు ఒక వ్యక్తి వేతనం రూ.70 వేలు అనుకుందాం. ప్రస్తుతం రూ.20 వేలు బేసిక్, డిఎ, మిగిలిన రూ.50వేలు అలవెన్సుల రూపంలో చెల్లిస్తున్నారనుకుందాం. అలవెన్సులపై 50 శాతం పరిమితి కారణంగా రూ.35 వేలు వేతనంగా చెల్లించి.. మిగిలిన రూ.15వేలు వేజెస్‌లో కలపాలి. పనిచేసిన కాలానికి గానూ ఏడాదికి 15 రోజుల చొప్పున చివరి వేతనాన్ని గ్రాట్యుటీ కింద చెల్లించాలి. ఉద్యోగి రాజీనామా, తొలగింపు, రిటైర్మెంట్, ఫిక్స్‌డ్ టర్మ్ కాంట్రాక్ట్ ముగిసినప్పుడు ఈ గ్రాట్యుటీని చెల్లించాలి. ఉద్యోగి మరణించినప్పుడు, వైకల్యానికి గురైనప్పుడు, కాంట్రాక్ట్ ముగిసినప్పుడు ఐదేళ్లు పనిచేసి ఉండాలన్న నిబంధన వర్తించదు. 2025 నవంబర్ 21 నుంచి గ్రాట్యుటీ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

కార్మికసంఘాల వ్యతిరేకత

కార్మికుల హక్కులు, ప్రయోజనాలు కాలరాసేలా నూతన చట్టాలు ఉన్నాయని కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. కార్మిక చట్టాలతో యాజమాన్యాలకే మేలు జరుగుతుందని తెలిపాయి.

గిరిజన యువ సమ్మేళనం ప్రారంభం

- ఆకట్టుకున్న ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు

ప్రజాశక్తి-మాధురవాడ (విశాఖ)

భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 17వ గిరిజన యువ సమ్మేళనం విశాఖ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. దీనిని ప్రారంభించిన మై భారత్ ఎపి, తెలంగాణ డైరెక్టర్ అంసుమన్ ప్రసాద్‌దాస్ మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల్లోని ఎల్‌డబ్ల్యుఇ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన యువతకు దేశంలోని సాంకేతిక, పారిశ్రామిక అభివృద్ధిపై అవగాహన కల్పించడంతో పాటు విభిన్న సాంస్కృతిక వారసత్వాన్ని తెలుసుకునేందుకు ఈ గిరిజన యువ సమ్మేళనం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆధునిక నైపుణ్యాలను సంప్రదాయ జ్ఞానంతో సమన్వయం చేస్తూ స్థిరమైన ఉపాధి అవకాశాలు సృష్టించి, తమ గిరిజన సమాజాల సమగ్ర అభివృద్ధికి యువత దోహదపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైభారత్ విశాఖపట్నం ఉప డైరెక్టర్ జి మహేశ్వరరావు, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ కమాండెంట్ సురజ్ ప్రకాశ్ జోషి, హెచ్‌పిసిఎల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ జనరల్ మేనేజర్ పి విజయకుమార్, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి రెహమున్నిసా బేగం, గీతం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌విజి రెడ్డి, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత లీలాప్రసాద్, సెట్విస్ అధికారి ఎం రమ్య, సీనియర్ పాత్రికేయుడు ఎన్ నాగేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల గిరిజన యువత సామూహిక సంప్రదాయ నృత్యాల ద్వారా తమ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రదర్శించారు. గిరిజన సంప్రదాయ వేషధారణలో చేసిన ఆత్మీయ సంగీతం, లయాత్మక నృత్యాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. వేణువు, డప్పులు వంటి సంప్రదాయ వాద్యాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తున్న గిరిజన కళాకారులు

దిగొచ్చిన ఫుడ్ యాప్‌లు

- డెలివరీ బాయ్స్‌కు ప్రోత్సాహకాలు పెంపు
- గిగ్ వర్కర్ల సమ్మె పిలుపునకు ప్రతిఫలం

న్యూఢిల్లీ : గిగ్ వర్కర్స్ ఇచ్చిన సమ్మె పిలుపునకు ఫుడ్ యాప్ యాజమాన్యాలు దిగివచ్చాయి. డెలివరీ బాయ్స్ డిమాండ్‌ల నేపథ్యంలో పలు ప్రోత్సాహకాలు అందించడానికి ముందుకు వచ్చాయి. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బెస్ట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్‌లు సమ్మెకు పిలుపునిచ్చాయి. ముందు జాగ్రత్తగా వ్యాపారం నష్టపోతామనే భయంతో ఫుడ్ యాప్‌లు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. ఈ ప్రభావంతో పలుచోట్ల సమ్మె మిశ్రమంగా జరిగింది. ఏడాది చివరిరోజు ఆటంకం కలగకూడదన్న ఉద్దేశంతో ఫుడ్ డెలివరీకి సంబంధించిన స్విగ్గీ, జొమాటో, జెప్టో తదితర సంస్థలు పలు ప్రోత్సాహకాలను ప్రకటించాయి. డిసెంబర్ 31న సాయంత్రం ఆరు గంటల నుంచి 12 గంటల మధ్య పనిచేసే గిగ్‌వర్కర్లకు ఒక్కో ఆర్డర్‌కు రూ.120 - రూ.150 చెల్లిస్తామని జొమాటో ప్రకటించింది. ఆర్డర్లను బట్టి ఒక్కొక్కరు సగటున రూ.3 వేలు ఆర్జించవచ్చని పేర్కొంది. కేన్సిలేషన్లు, ఆర్డర్లు తీసుకోకపోవడం వంటి వాటిపై జరిమానాలు కూడా విధించబోమని హామీ ఇచ్చింది. జొమాటో తరహాలోనే స్విగ్గీ కూడా తన డెలివరీ బాయ్స్‌కు ఆఫర్స్‌ను ప్రకటించింది. పీక్ అవర్స్‌లో రూ.2 వేల వరకు సంపాదించుకోవచ్చని పేర్కొంది. క్విక్ కామర్స్ వేదిక జెప్టో కూడా ప్రోత్సాహకాలు ప్రకటించింది. దేశవ్యాప్తంగా డిసెంబర్ 25న గిగ్‌వర్కర్లు సమ్మె చేపట్టడంతో డెలివరీ యాప్స్‌పై తీవ్ర ప్రభావం పడ్డాయి. కొత్త సంవత్సరం ముందు రోజు భారీగా ఆర్డర్లు ఉండటంతో మళ్లీ ప్రభావం పడొచ్చనే భయంతో ఆయా యాజమాన్యాలు గిగ్‌వర్కర్లకు ప్రోత్సాహకాలు పెంచి తాత్కాలికంగా బయటపడ్డాయని తెలుస్తోంది.

చంద్రబాబు, నారాయణ ఇతరులపై కేసుల వివరాలివ్వాలంటూ పిటిషన్

ప్రజాశక్తి-అమరావతి

ముఖ్యమంత్రిగా, మంత్రులుగా 2014-19 మధ్యకాలంలో చేసిన చంద్రబాబు, పి నారాయణ, కొల్లు రవీంద్ర ఇతరులపై ఉన్న కేసుల వివరాలు తనకు ఇచ్చేలా విజయవాడ ఎసిబి కోర్టును ఆదేశించాలంటూ ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు సువర రాజు వేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించింది. సువర రాజు వేసిన మూడు రివిజన్ పిటిషన్లను విచారణకు స్వీకరించి సమగ్ర వివరాలను అందజేయాలని సిఐడిని హైకోర్టు ఆదేశించింది. విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణ జిఓపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలో అనధికార, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణపై జిఓ 225ను రద్దు చేయాలంటూ దాఖలైన పిల్‌లో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులిచ్చింది. క్రమబద్ధీకరణకు సవరణ చట్టాన్ని, దీనికి చెందిన జిఓ 225ను రద్దు చేయాలనే పిల్‌లోని అంశాలపై కౌంటర్ దాఖలు చేయాలని మున్సిపల్, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ, జిఎడి శాఖ ముఖ్యకార్యదర్శులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, పురపాలకశాఖ కమిషనర్లను ఆదేశించింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ప్రకాశం జిల్లాకు చెందిన చిన్నబోయిన హరికృష్ణ వేసిన పిల్‌లో జిఓ 225 మున్సిపల్, పంచాయతీరాజ్ చట్టాలకు వ్యతిరేకమని పేర్కొన్నారు. అనధికార, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ప్రజాతంత్ర ఉద్యమంపై దాడి తగదు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రజల తరపున ప్రశ్నించే ప్రజానాయకులు, ప్రజాతంత్రవాదులపై పీడీ యాక్ట్, ఉపా వంటి నిర్బంధ చట్టాలను దుర్వినియోగం చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తోన్న ప్రభుత్వ విధానాలను ఎదుర్కొనేందుకు ప్రజాప్రతిఘటన నిర్మించాల్సిన అవసరం ఉందని పలువురు వక్తలు స్పష్టం చేశారు. రైతు సంఘం అనకాపల్లి జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై ప్రభుత్వం పెట్టిన పీడీ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఒంగోలులోని ఎల్‌బిజి భవన్‌లో సంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాన్ని జిల్లా ప్రధాన కార్యదర్శి పమిడి వెంకటరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐలు జాతీయ నాయకులు, సుప్రీంకోర్టు న్యాయవాది పొత్తూరి సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజల తరపున వేతనాల పెంపు, కాలుష్య నియంత్రణ, బలవంతపు భూసేకరణలకు వ్యతిరేకంగా ప్రశ్నిస్తే నేరస్తులుగా ముద్ర వేసి పీడీ యాక్ట్ ప్రయోగించడం నేరపూరిత చర్య అని విమర్శించారు. అప్పలరాజుపై 19 కేసులున్నాయంటూ నిర్బంధం విధించిన ప్రభుత్వం, 24 కేసులున్న చంద్రబాబు నాయుడిపై ఈ చట్టం ఎందుకు వర్తింప చేయలేదని ప్రశ్నించారు. సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు మాట్లాడుతూ ప్రజలు ఆహారం కంటే స్వేచ్ఛను ఎక్కువగా కోరుకుంటున్నారని, బ్రిటిష్ పాలనలోని 1917 డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్, 1919 రౌలత్ చట్టాల కన్నా తీవ్రమైన నిర్బంధాలను రాష్ట్రంలో అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.అయ్యప రెడ్డి, రైతు కూలి సంఘం నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా స్వేచ్ఛను హరించే ప్రభుత్వాల నిరంకుశ విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.మాబు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో త్రీ ఫేజ్ సరఫరాకు చర్యలు

- విద్యుత్ సంస్థల డైరీల ఆవిష్కరణలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఎపిసిపిడిసిఎల్ 6వ వార్షికోత్సవం, విద్యుత్ సంస్థల నూతన సంవత్సర డైరీ, కేలండర్ల ఆవిష్కరణ కార్యక్రమం విజయవాడలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2026లో యూనిట్ ధర రూ.4.60 పైసలు, 2029 నాటికి రూ.4 ఉండే లక్ష్యంతో ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేయాలని చెప్పారు. 24 గంటలూ విద్యుత్ సరఫరా చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. జెన్‌కో పనితీరు గణనీయంగా మెరుగుపడిందన్నారు. కొండ, గిరిజన ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ అందిస్తున్నామని వెల్లడించారు. జెన్‌కో ఎమ్‌డి ఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాష్ట్ర విద్యుత్ అవసరాల్లో 40-50 శాతం విద్యుత్ జెన్‌కో సరఫరా చేస్తుందని చెప్పారు. ట్రాన్స్‌కో జెఎమ్‌డి జి సూర్యసాయి ప్రవీణ్ చంద్ర మాట్లాడుతూ.. డిస్కమ్‌ల పరిధిలో కొత్తగా 27 సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎమ్‌డి టి శివశంకర్ మాట్లాడుతూ.. సిబ్బందిని బలోపేతం చేసేందుకు, భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. సిపిడిసిఎల్ సిఎమ్‌డి పి పుల్లారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల మధ్య సమన్వయం పెంచుతూ వివిధ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని చెప్పారు. నెడ్‌క్యాప్ ఎమ్‌డి ఎం కమలాకర్ బాబు మాట్లాడుతూ.. 2029 నాటికి నిర్దేశించుకున్న ఇంధన సామర్థ్య లక్ష్యాలను చేరుకోవడానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఎలక్ట్రికల్ సేఫ్టీ డైరెక్టర్ జి విజయలక్ష్మి మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలను అరికట్టి భద్రతా ప్రమాణాలను పాటించడంపై దృష్టి సారించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌ల డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. 'ఇ-డిప్' ద్వారా యాత్రికులకు ముందుగానే టికెట్లను కేటాయించారు. దీంతో యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. టికెట్లు ఉన్నవారినే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తుండటంతో యాత్రికుల రద్దీ సర్వసాధారణంగా ఉంది. మంగళవారం సాయంత్రం యాత్రికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనానికి వచ్చారు. బుధవారం నుండి సాధారణ రద్దీ నెలకొంది. సినీ, రాజకీయ ప్రముఖులు సైతం వైకుంఠ ద్వార దర్శనం చేసుకుని, కానుకలు సమర్పించారు. టిటిడి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు తండ్రి, గుంటూరు విజ్ఞాన్స్ విద్యా సంస్థల అధినేత లావు రత్తయ్య టిటిడికి రూ.కోటి విరాళం అందజేశారు. టిటిడి చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బి.ఆర్.నాయుడుకు విరాళం డిడిని అందజేయగా ఆయన వారిని అభినందించారు.

పండగ వాతావరణంలో 2 కొత్త జిల్లాల ఆవిర్భావం

(మొదటిపేజి తరువాయి)

పిఎంఆర్‌సిలో నూతన ఎస్‌పి కార్యాలయం ఏర్పాటైంది. ఇన్‌ఛార్జి ఎస్‌పిగా అల్లూరి జిల్లా ఎస్‌పి అమిత్ బర్దర్ బాధ్యతలు స్వీకరించారు.

మార్కాపురం పట్టణ శివారులోగల ఆర్ అండ్ ఆర్ కాలనీలోని పాఠశాల భవనాల సముదాయంలో ఏర్పాటు చేసిన మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌ను ఇన్‌ఛార్జి కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హామీ ఇచ్చిన మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశామని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకమైన పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేసి ప్రజల, రైతుల తాగు, సాగు నీటి అవసరాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు నీటిని విడుదల చేసిన తర్వాత మాత్రమే ఓట్లు అడుగుతామన్నారు. ఈ కార్యక్రమానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు, మారిటోరియం చైర్మన్ దామచర్ల సత్య తదితరులు మాట్లాడారు. ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా పి.రాజాబాబు, జిల్లా ఇన్‌ఛార్జి ఎస్‌పిగా వి.హర్షవర్ధన్‌రాజు బాధ్యతలు చేపట్టారు.

మార్కాపురం కలెక్టరేట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

మదనపల్లెలో అన్నమయ్య జిల్లా కలెక్టరేట్

మదనపల్లెలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో అన్నమయ్య జిల్లా నూతన కలెక్టరేట్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె కేంద్రంగా ఏర్పాటైన నూతన అన్నమయ్య జిల్లా అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. దీనికి ముందు ఆయన అక్కడి ఆవరణలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కలెక్టర్‌కు మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి స్వాగతం పలికారు.

పోలీసులు అరెస్టు చేసిన గంజాయి నిందితులు

21 కేజీల గంజాయి స్వాధీనం

- ఇద్దరు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరంలో పోలీసులు 21 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు. ధవళేశ్వరం సిఐ టి.గణేష్ కథనం ప్రకారం... బుధవారం ఉదయం పోలీసులకు గంజాయి అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు ధవళేశ్వరంలోని చెరుకూరి లేఅవుట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా... అదే సమయంలో అక్కడ ఉన్న ధవళేశ్వరానికి చెందిన సూర్యగాంధీ, తిమ్మరాజు వారిని చూసి పరుగులు పెట్టారు. పోలీసులు అప్రమత్తమై వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగ్‌ను తనిఖీ చేయగా 21 కేజీల గంజాయి లభించింది. దీనిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూర్యగాంధీపై గతంలో ఆరు క్రిమినల్ కేసులు, మండపేట పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. మరో నిందితుడు తిమ్మరాజుపై గతంలో ఐదు క్రిమినల్ కేసులున్నాయి. రాజమహేంద్రవరం 3 టౌన్ పరిధిలో రౌడీ షీట్ ఉంది. ఇద్దరు నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు సిఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.10,80,750లు ఉంటుందని ఆయన తెలిపారు. నిందితులను అరెస్టు చేయడంలో కృషి చేసిన పోలీసులను ఎస్‌పి డి.నరసింహ కిశోర్ అభినందించారు.

గిరిజనులపై దాడి అధికారమా.. అహంకారమా

- ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్ర ప్రసాద్
- ఇనుమూరు బాధితులకు ఐలు బృందం పరామర్శ, పంట పరిశీలన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనులు వేసుకున్న పంటలు ధ్వంసం చేసి, అడ్డొచ్చిన వారిపై దాడి చేసిన పోలీసుల తీరు అధికారమా లేక అహంకారమా అని రెవెన్యూ, పోలీసుల తీరును ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలం ఇనుమూరు గ్రామంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు ధ్వంసం చేసిన పంటలను ఐలు నేతలు బుధవారం పరిశీలించి, బాధితులను పరామర్శించారు. ఈ బృందంలో రాజేంద్రప్రసాద్‌తో పాటు వి కోటేశ్వరరావు, కామన మునిస్వామి, జి విజయభాస్కర్, వి రాజారత్నం, పి పెద్దిరాజు, డి కృష్ణబాబు, జి నాగిరెడ్డి, డి నాగభూషణం ఉన్నారు. రెవెన్యూ, పోలీసుల అధికారుల తీరును, పంట ధ్వంసానికి సంబంధించిన అంశాలను వారికి బాధిత గిరిజనులు వివరించారు. రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గిరిజనులు వేసిన పంటలను రెవెన్యూ, పోలీసులు దౌర్జన్యంగా ధ్వంసం చేయడం దారుణమని, ఈ దుర్మార్గపు చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని అన్నారు. 1972లో గిరిజనులే రికార్డుల్లో ఉంటే 59లో గిరిజనేతరులు ఎలా భూములు కొనుగోలు చేశారని ఆయన ప్రశ్నించారు. 2004లో అప్పటి గిరిజన ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్‌డిసి) గిరిజనేతరులకు భూమి చెల్లదని, గిరిజనులకు భూమి అప్పగించాలని తీర్పు ఇస్తే దీని అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించారన్నారు. కాసులకు కక్కుర్తిపడి గిరిజనులకు అధికారులు ద్రోహం చేశారని విమర్శించారు. పంటల ధ్వంసం, అడ్డొచ్చిన గిరిజన మహిళలపై మగ పోలీసులు దాడి చేయమని ఏ చట్టం చెప్పిందని అధికారులను ప్రశ్నించారు. 2007లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి డిజిపి ఇచ్చిన సర్క్యులర్‌లో గిరిజనుల భూ వివాదాల్లో పోలీసుల జోక్యం ఉండరాదని, ఒకవేళ ఉంటే పోలీసులు వ్యవహరించిన తీరుపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని స్పష్టంగా ఉదన్నారు. గిరిజనులకు అనుకూలంగా 2004 ఎస్‌డిసి కోర్టు తీర్పులు, 1972, 1994 అడంగల్, 2025 హైకోర్టులో గిరిజనుల తరఫున పెండింగ్ ఉండగా, గిరిజనుల పంటలను ధ్వంసం చేస్తూ దాడులు చేయమని ఏ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారో బహిర్గతం చేయాలని కోరారు. గిరిజనులపై దాడి చేసిన వారిపై క్రిమినల్ కేసులు పెడతామని, గిరిజనులకు అండగా హైకోర్టులో ఉచితంగా వాదిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, ఉపాధ్యక్షులు పోలోజు నాగేశ్వరరావు, నాయకులు కారం భాస్కర్, బొరగం భూచంద్రరావు, వెట్టి వీరయ్య, కారం ముత్యాలరావు, శేఖర్, బుజ్జి, రాము, వెంకటేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన పంటను పరిశీలించి మాట్లాడుతున్న ఐలు రాష్ట్ర అధ్యక్షులు సుంకర రాజేంద్రప్రసాద్

18 నెలల్లో 13 శాతం పనులు

- నిర్వాసితులకు ఏడాదిలో రూ.1,894 కోట్లు విడుదల
- పోలవరంపై సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టులో 18 నెలల్లో 13 శాతం పనులు పూర్తి చేశామని, నిర్వాసితులకు ఏడాదిలోనే రూ.1,894 కోట్లు విడుదల చేశామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. జలవనరులశాఖపై బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జనవరి మొదటివారంలో వెలిగొండ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించనున్నారని మంత్రి తెలిపారు. పోలవరం పనులను కళ్లుండీ చూడలేని కబోదిలా వైసిపి తయారైందని విమర్శించారు. ఐదేళ్లు అధికారం ఇస్తే రెండు శాతం పనులు మాత్రమే చేయగలిగారని, అలాంటప్పుడు పోలవరం గురించి విమర్శించే అర్హత వైసిపికి ఎక్కడుందని ప్రశ్నించారు. 2014-19లోనే పోలవరం పనులు 72 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే 13 శాతం పనులు చేసినట్లు పేర్కొన్నారు. మొత్తంగా పోలవరం ప్రాజెక్టు పనులు 87 శాతం చేశామన్నారు. 2027 చివరినాటికి దీన్ని జాతికి అంకితం చేయాలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, నిర్దేశిత గడువుకంటే ముందుగానే పుష్కరాల నాటికి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వైసిపి హయాంలో కేంద్రం రీయింబర్స్ చేసిన రూ.3 వేల కోట్లను మళ్లించి పోలవరాన్ని ముంచిన జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పుడు విమర్శలు చేయడం హాస్యాస్పదం అన్నారు.

కొత్త డయాఫ్రం వాల్ 1,032 మీటర్లుంటే 83 శాతం పూర్తి చేశామని చెప్పారు. పోలవరం ఎడమకాలువ పనులు పూర్తిచేసి 2026లో అనకాపల్లి వరకూ నీరిస్తామని అన్నారు. రాష్ట్రంలో ఇతర ప్రాజెక్టుల పురోగతిపైనా ఆయన మాట్లాడారు. 2026 సీజన్ మొదలయ్యేనాటికి వెలిగొండ ప్రాజెక్టు పూర్తిచేసే లక్ష్యంతో తమ శాఖ పనిచేస్తుందని అన్నారు. రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులను సిఎం ప్రారంభిస్తారని అన్నారు. రాయలసీమలో హంద్రీనీవా, ఉత్తరాంధ్రలో అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు నిర్ణీత కాలవ్యవధిని నిర్ణయించుకుని పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ సలహాదారు ఎం వెంకటేశ్వరరావు, ఇఎన్‌సి నరసింహమూర్తి పాల్గొన్నారు.

గోదావరి నీటిని మళ్లించొద్దు

- తెలంగాణ మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గోదావరి నీటిని ఆంధ్రప్రదేశ్ ఏ రూపంలో మళ్లించినా అంగీకరించే ప్రసక్తి లేదని తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోదావరి ట్రిబ్యునల్ 80 టిఎంసిలకు అనుమతించిందనీ, అంతకంటే ఒక్క చుక్క నీరు ఎక్కువ తీసుకెళ్లినా ఉపేక్షించమన్నారు. తమ ప్రభుత్వం అడ్డుకోవడం వల్లే గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపసంహరించుకుందని చెప్పారు. దాని స్థానంలో గోదావరి-నల్లమలసాగర్ ప్రాజెక్ట్‌ను ప్రతిపాదించిందని అన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి), గోదావరి వాటర్ డిస్ట్రిబ్యూట్ ట్రిబ్యూనల్ (జిడబ్ల్యుడిటి), పునర్విభజన చట్టానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ తీసుకున్న నిర్ణయాన్ని అడ్డుకుంటామని పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాశయాల్లో 200 టిఎంసిల నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. నికర జలాలను కాకుండా అదనపు జలాలపై ఆధారపడి ప్రాజెక్ట్ చేపట్టడం సరికాదన్నారు. వరద రాని సీజన్‌లో నికర జలాలను మళ్లిస్తారనీ, ఫలితంగా తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. అదనపు వాటా తరలింపును ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. గతేడాది నవంబర్ 21న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిపిఆర్ టెండర్లు పిలవడంతో, తెలంగాణ ప్రభుత్వం డిసెంబర్ 16, 2025న సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నెం.1258/2025 దాఖలు చేసిందన్నారు. గోదావరిలో తెలంగాణకు కేటాయించిన 968 టిఎంసిల నీటి హక్కులను కాపాడుకోవడమే మా ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు.

మనమిత్ర అంటే...!

- తెలీదంటున్న జనం
- అత్యధికంగానే శ్రీసత్యసాయి జిల్లాలో 35 శాతం మందికి తెలుసు
- బాపట్లలో 26 శాతం మందికే ఎరుక
- వినియోగిస్తున్న వారు సగటున 20% కన్నా తక్కువే
- ప్రభుత్వ ప్రచారం మాత్రం భారీగానే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

అన్ని సేవలను నేరుగా ప్రజలే ఇళ్ల నుంచి వినియోగించుకునేందుకు నిర్వహిస్తున్న మనమిత్ర అంటే ఇప్పటికీ ప్రజలకు తెలియదంటే ఆశ్చర్యం కలుగుతోంది. వాట్సాప్ గవర్నెన్స్ పేరిట ఈ యాప్‌ను కొన్ని నెలల క్రితమే అమలులోకి తీసుకువచ్చారు. సుమారుగా 300 వరకు సేవలను మనమిత్రలోకి అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలో మరో 300 వరకు ఇందులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. అయితే దీనిపై ప్రజలకు మాత్రం అవగాహన లేదని అధికారుల రికార్డులే చెబుతున్నాయి.

కార్యాలయాల చుట్టూ తిరగడాన్ని తప్పించేందుకు గత జనవరిలోనే వాట్సాప్ గవర్నెన్స్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా కార్యాచరణ కూడా అమలు చేశారు. అయితే అవగాహన కల్పించడంలో సిబ్బంది నిర్లిప్తతో, నేర్చుకోవడంలో ప్రజలకు అవగాహన లేకపోవడమో తెలియదుగానీ మొత్తం మీద 75 నుంచి 80 శాతం మందికి ఈ విధానం ఏమిటో కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది.

అత్యంత కీలకమైన రెవెన్యూ వ్యవస్థ నుంచి రిజిస్ట్రేషన్లు, పోలీసు, పంచాయితీరాజ్, మున్సిపాల్టీలు వంటి అనేక సేవల్లో దైనందిక లావాదేవీలు నిర్వహించుకునేందుకు వాట్సాప్ గవర్నెన్స్‌కోసం ప్రత్యేక నంబర్‌ను కూడా కేటాయించారు.

ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటేచాలు అన్ని వ్యవహారాలు తమ మొబైల్ నుంచే నిర్వహించుకునే వీలుంటుందని అధికారులు చెబుతున్నారు. అయితే దీనిని ప్రజల్లోకి మాత్రం విజయవంతంగా తీసుకువెళ్లలేకపోతున్నారు.

అత్యల్పంగా బాపట్లలో

ఇటీవల ప్రభుత్వం కూడా వాట్సాప్ గవర్నెన్స్ గురించి సర్వే నిర్వహించింది. ఇందులో ఎక్కువ శాతం మంది తమకు ఈ యాప్ గురించి తెలియదని, ఇంకొంతమంది తెలిసినా వాడడం లేదని చెప్పడం ప్రభుత్వానికి షాక్ కలిగించింది. బాపట్ల జిల్లాలో ఏకంగా 73 శాతం మందికిపైగా యాప్ గురించి తెలియదని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆధునికతకు వేదికగా ఉండే విశాఖలో కూడా 70 శాతం మందికి తెలియదట. మొత్తం 26 జిల్లాలకుగాను 17 జిల్లాల్లో 70 శాతం మందికి ఈ యాప్ తెలియదని తేలింది. యాప్‌కు సంబంధించి ఒక్క సత్యసాయి జిల్లాలో మాత్రం 35 శాతం మందికి తెలుసునని తేలింది.

వాడడంలోనూ వెనుకబాటే

ఇక ఈ యాప్‌ను వినియోగిస్తున్న వారిని పరిశీలిస్తే సత్యసాయి జిల్లాలో అత్యధికంగా 24.9 శాతం మంది వినియోగిస్తుండగా, కోనసీమ జిల్లాలో 17.5 శాతం మాత్రమే వినియోగిస్తున్నారట. ఏకంగా 13 జిల్లాల్లో 20 శాతం మాత్రమే వినియోగం కనిపించడం గమనార్హం. ఈ ప్రాంతాల్లో వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు.

మోసపోతామనే భయం

యాప్‌ను వినియోగించకపోవడానికి మోసపోతామన్న భయమే కారణమని ప్రజలు అంటున్నారు. ఏకంగా 32.13 శాతం మంది మొబైల్‌లో మనమిత్రను వినియోగిస్తే ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా డబ్బు కోల్పోయే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యాప్ వాడడం రాదని 37 శాతం మంది వరకు చెబుతుండగా, స్మార్ట్ ఫోన్ కాదని మరో 32 శాతం మంది వరకు వెల్లడించడం విశేషం.

సహకార రంగం బలోపేతమే లక్ష్యం

- రాష్ట్ర వ్యవసాయ, సహకారశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సహకార వ్యవస్థ కోట్లాది మంది సామాన్యుల జీవితాలతో ముడిపడి ఉందని, ఈ రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన 'అంతర్జాతీయ సహకార సంవత్సరం - రాష్ట్రస్థాయి సహకార సదస్సు 2025' ముగింపు వేడుకల్లో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2025ను సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. వాణిజ్య బ్యాంకులు ఉన్నా, గ్రామీణ రైతాంగానికి క్షేత్రస్థాయిలో అండగా నిలిచేందుకు సహకార సంఘాలు ఎంతో అవసరమన్నారు. ఒకప్పుడు సాంకేతికతకు దూరంగా ఉన్న ఈ వ్యవస్థ, ఇప్పుడు కంప్యూటరీకరణ ద్వారా వాణిజ్య బ్యాంకులతో పోటీ పడే స్థాయికి ఎదిగిందని కొనియాడారు.

సహకార రంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్రం నిలిచేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. సహకార వ్యవస్థను పూర్తిగా గాడిలో పెట్టిన తర్వాత, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన పిఎసిఎస్ కమిటీలు అన్ని వర్గాల ప్రజలకు సేవలందించాలని సూచించారు. సిక్కోలు డ్వాక్రా బజార్ నిర్వహణకు నాబార్డు నుంచి రుణ సహాయాన్ని చెక్కు రూపంలో డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్‌కు అందించారు. డిసిసిబి డైరీ, కేలండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, నాబార్డు సిజిఎం గోపాల్, జిఎం కె.వి.ఎస్.ప్రసాద్, డిసిసిబి అధ్యక్షులు కిమిడి నాగార్జున, శివ్వాల సూర్యనారాయణ, తాతారావు, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

2025లో రూపాయి 4.7 శాతం పతనం

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ వరుసగా రెండో నెలలోనూ పతనమయ్యింది. డిసెంబరులోనూ నష్టంతో ఈ ఏడాదిని ముగించింది. చివరి నెలలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారత దేశ చరిత్రలోనే 91 స్థాయిని దాటి ఆల్‌టైం కనిష్ట స్థాయిని చవి చూసింది. బుధవారం నాటి ట్రేడింగ్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 89.87 వద్ద ముగిసింది. ఈ నెలలో స్థూలంగా 0.5 శాతం విలువ కోల్పోయింది. 2025 ఏడాదిలో మొత్తంగా రూపాయి విలువ 4.7 శాతం క్షీణించింది. ఇది గత మూడేళ్లలో నమోదైన అతిపెద్ద వార్షిక పతనం కావడం ఆందోళనకరం. ఈ ఏడాది పొడవునా రూపాయిపై ప్రభావం చూపిన అంశాలే డిసెంబరులోనూ కొనసాగాయి. భారతీయ ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులను ఉపసంహరించుకోవడం, దిగుమతిదారులు హెడ్జింగ్‌ను పెంచడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వంటివి రూపాయి పతనానికి కారణమయ్యాయి. "విదేశీ ఇన్వెస్టర్ల నిరంతర నిధుల ఉపసంహరణ, రక్షణ, చమురు, బంగారం రంగాల నుండి డాలర్ డిమాండ్ అన్నీ రూపాయిపై ప్రభావాన్ని చూపుతున్నాయి," అని ఫిన్‌రెక్స్ ట్రెజరీ అడ్వైజర్స్‌కు చెందిన ట్రెజరీ హెడ్ అనిల్ భన్సాలీ తెలిపారు.

చివరి రోజు మార్కెట్లకు లాభాలు

ముంబయి : నాలుగు రోజులుగా వరుస నష్టాలు చవి చూసిన సూచీలు ఏడాది చివరి రోజు లాభాల్లో ముగిశాయి. బుధవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 545.52 పాయింట్లు లేదా 0.64 శాతం పెరిగి 85,220కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 190.75 పాయింట్లు లేదా 0.74 శాతం లాభపడి 26,129 వద్ద ముగిసింది. దీంతో ఒక్కరోజులోనే మదుపర్ల సంపద రూ.4 లక్షల కోట్లు పెరిగింది. బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ రూ.472 లక్షల కోట్ల నుంచి రూ.476 లక్షలకు కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్ షేర్లు అధికంగా లాభపడ్డాయి. టిసిఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, బజాజ్ ఫైనాన్స్, సన్‌ఫార్మా షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి.

2026 లోనూ పసిడి పరుగు !

న్యూఢిల్లీ: కొత్త ఏడాది 2026లోనూ బంగారం ధరల్లో పెరుగుదల కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2025 సంవత్సరం ముగిసే సమయానికి బంగారం, వెండి ధరలు చారిత్రక స్థాయిలకు చేరుకున్నాయి. బంగారం ధరలు 66 శాతం ఎగిసి.. గడిచిన 50 ఏళ్లలో గరిష్ట పెరుగుదలను నమోదు చేసింది. వెండి 157 శాతం పైగా పెరిగి రికార్డు సృష్టించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల కారణంగా 2026లో కూడా బంగారం సురక్షితమైన పెట్టుబడిగా కొనసాగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇది ఔన్సు ధర 5,000 డాలర్ల వరకు, భారతీయ మార్కెట్‌లో తులం బంగారం రూ.1.50 లక్షల నుంచి రూ. 1.65 లక్షల వరకు చేరవచ్చని అంచనా. సోలార్ ప్యానెల్స్, విద్యుత్ వాహనాల్లో వెండి వినియోగం పెరగడం వల్ల ఈ లోహం మరింత వేగంగా పెరిగే అవకాశం ఉంది. కిలో వెండి ధర రూ.2.40 లక్షల నుంచి రూ.2.75 లక్షల వరకు చేరవచ్చని.. కొందరు నిపుణులు రూ. 4 లక్షల మార్కును కూడా అంచనా వేస్తున్నారు. 2026లో బంగారం, వెండిలో 50:50 నిష్పత్తి ప్రకారం పెట్టుబడులు ఉత్తమమని సూచిస్తున్నారు.

మోడీ పాలనలో 'ఉపాధి'కి తూట్లు

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మోడీ పాలనలో కోట్లాది మంది పేదలకు ఉపాధిని కల్పించే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచారని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మోడీ తీసుకొచ్చిన కొత్త చట్టంతో ఉపాధి హామీలో ఉపాధి లేనట్లేనన్నారు. ఉమ్మడి అప్పటి కాంగ్రెస్ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకానికి రాష్ట్రంలో బీజం పడిందన్నారు. కరువు పనుల్లో నాడు దేశానికి రోల్ మోడల్‌గా మన రాష్ట్రం నిలిచిందన్నారు. వలసలను నివారించి పేదల కొనుగోలు శక్తి పెంచడానికి, వ్యవసాయానికి సాయంగా ఉండేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడిందని పేర్కొన్నారు.

శిక్షణలోని కానిస్టేబుళ్లకు స్టైపెండ్ పెంపు

- జిఓ ఎంఎస్ 183 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతనంగా రిక్రూట్ అయి శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు నెలవారీ స్టైపెండ్‌ను ప్రభుత్వం పెంచింది. ఈ మేరకు బుధవారం జిఓ ఎంఎస్ నెంబరు 183ని విడుదల చేసింది. ఇప్పటి వరకు శిక్షణలో ఉన్న కానిస్టేబుళ్లకు రూ.4,500 చెల్లిస్తుండగా, ప్రభుత్వం దానిని రూ.12 వేలకు పెంచింది. శిక్షణకు ఎంపికైన కానిస్టేబుళ్లకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో స్టైఫండ్ పెంపు గురించి సిఎం చంద్రబాబు ఇటీవల ప్రకటన చేసిన విషయం తెలిసిందే.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని, నేరాలు పెరిగాయని వైసిపి ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయని తెలిపారు. బాధిత మహిళలకు వైసిపి అండగా ఉంటుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల్లో జాతీయ స్థాయిలో రాష్ట్రం అట్టడుగున ఉందన్నారు. శాంతిభద్రతల వైఫల్యంపై సిఎం చంద్రబాబుకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా లేఖ రాశారని, కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చంద్రబాబు స్వయంగా తెలిపారని వివరించారు. జగన్ హయాంలో దిశ పోలీస్ స్టేషన్లు ఏర్పాటుచేసి మహిళలకు అండగా ఉన్నామన్నారు.

యాప్ పేరుతో వేధింపులు

యాప్ పేరుతో సచివాలయ ఉద్యోగులను వేధించడం సరికాదని, వాట్సాప్ గవర్నెన్స్ ఫెయిలైతే ఆ నెపం సచివాలయ ఉద్యోగులపై పెడితే ఎలాగని వైసిపి ఉద్యోగుల విభాగం నాయకులు చంద్రశేఖరరెడ్డి విమర్శించారు. మనమిత్ర యాప్ పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ సేవలను 68 శాతం మంది ప్రజలు ఉపయోగించడం లేదని ప్రభుత్వ సర్వేలో వెల్లడైందని పేర్కొన్నారు. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వలంటీర్ల వ్యవస్థే బాగుందని అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌ను ప్రజలపై బలంగా రుద్దారన్నారు.

ప్రసాదంలో నత్త ఉందన్న వారిపై కేసు : నాగార్జున యాదవ్

సింహాచలం ఆలయంలోని పులిహోరలో నత్త వచ్చిందని ఫిర్యాదు చేసిన వ్యక్తిపైనే కేసు నమోదు చేశారని వైసిపి అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్ అన్నారు. పులిహోరలో నత్త ఉందని యాత్రికులు ఫిర్యాదు చేస్తే ప్రసాదాన్ని లాక్కుని దిక్కున్నచోట చెప్పుకోవాలన్నారని, సోషల్ మీడియాలో పెడితే వారిపై అన్యాయంగా కేసు నమోదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇటిఇ ట్రాన్స్‌పోర్టేషన్ ఇష్యూకు 490 రెట్ల స్పందన

ముంబయి : రైల్వే ఇంజనీరింగ్, సిస్టమ్ ఇంటిగ్రేషన్ కంపెనీ ఇటిఇ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు విశేష స్పందన లభించినట్లు ఆ సంస్థ తెలిపింది.

మొత్తంగా 490 రెట్ల సబ్‌స్క్రిప్షన్ అయ్యిందని వెల్లడించింది. ఆ సంస్థ రూ.84.22 కోట్ల పబ్లిక్ ఇష్యూ డిసెంబర్ 30న ముగిసింది. అన్ని విభాగాల ఇన్వెస్టర్ల నుండి ఈ ఐపిఒకు అద్భుతమైన స్పందన లభించిందని ఆ సంస్థ తెలిపింది. ఈ కంపెనీ షేరు ధరల శ్రేణీ రూ.164-174 మధ్య నిర్ణయించింది. జనవరి 2న లిస్టింగ్ కానున్నాయి.

సవాళ్లలోనూ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం

- ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా వెల్లడి

న్యూఢిల్లీ: ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి, సవాల్‌తో కూడుకున్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన వృద్ధిని కనబర్చుతుందని ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దేశీయ డిమాండ్, తక్కువ ద్రవ్యోల్బణం, సమర్థవంతమైన ఆర్థిక విధానాలు ఇందుకు దోహదం చేస్తోన్నాయని బుధవారం గవర్నర్ మల్హోత్రా ఓ సమావేశంలో పేర్కొన్నారు. 2025 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత జిడిపి 8.2 శాతం వృద్ధిని కనబర్చడమే ఇందుకు నిదర్శనమన్నారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య పరమైన అనిశ్చితి వల్ల స్వల్పకాలిక ముప్పులు పొంచి ఉన్నాయన్నారు. అయినప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థకు ఆ ప్రతికూలతలను తట్టుకునే శక్తి ఉందన్నారు. ఆర్థిక స్థిరత్వాన్ని కాపడటమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.

ఐడిఎఫ్‌సి 'గజ్' మెటల్ కార్డ్ ఆవిష్కరణ

హైదరాబాద్ : ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్ తన సంపన్న కస్టమర్ల కోసం అత్యంత విలాసవంతమైన 'గజ్' క్రెడిట్ కార్డును పరిచయం చేసినట్లు తెలిపింది. దీనిని ఎంపిక చేసిన వారికి మాత్రమే అందించనున్నట్లు పేర్కొంది. ఈ కార్డుకు వార్షిక రుసుమును రూ.12,500గా నిర్ణయించింది. ఏడాదికి రూ.10 లక్షలు ఖర్చు చేస్తే వార్షిక రుసుము మాఫీ అవుతుందని పేర్కొంది. ఈ కార్డుతో 12,500 రివార్డ్ పాయింట్లు వెల్‌కమ్ బెనిఫిట్‌గా లభిస్తాయని తెలిపింది. విదేశీ లావాదేవీలపై సున్నా శాతం ఫారిన్ ఎక్స్చేంజీ చార్జీలను విధించనున్నట్లు తెలిపింది.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION VISAKHAPATNAM

Tender Notice No: 36/2025-26/SE(Works-III)/EE-VB/GVMC, Dt29-12-2025 (Item 01.02.03 & 04)

01.	No.of Works	:	04 Nos (Four)
02.	Value of works (ECV)	:	Rs. 2,51,15,544/-
03	Down loading Starting Date	:	30-12-2025 @ 02.00 PM
04	Date of opening Tenders	:	13-01-2026 @ 02.30 PM

Further details at http://www.apeprocurement.gov.in O/o the Chief Engineer, GVMC.
Sd/- For Commissioner, GVMC

సంపాదకీయం

కోటి ఆశలతో కొత్త ఏడాది

కాల గమనంలో మరో సంవత్సరం కలిసిపోయింది. నూతన సంవత్సరం 2026లోకి అడుగుపెట్టాం. గత కాలపు అనుభవాలు పాఠాలుగా మార్చుకోవడానికి, గుణపాఠాలు నేర్చుకుని ముందుకు అడుగు వేయడానికి ఇది సరైన సమయం! 2025వ సంవత్సరం మన ముందుంచిన కఠోర వాస్తవాలు నూతన సంవత్సరానికి స్పష్టమైన హెచ్చరికగా నిలుస్తున్నాయి. అసమానతలు ప్రమాదకర స్థాయికి చేరడం, నిరుద్యోగం తీవ్రమవ్వడం, కార్పొరేట్ దురాశలతో ప్రజల జీవనాధారాలు కుదేలవడం, పాలకుల మతోన్మాద రాజకీయాలు కార్పొరేట్ల లాభాల ఆశలతో జత కలవడం...ఇవన్నీ గత ఏడాది సాధారణ ప్రజల జీవితాన్ని నేరుగా ప్రభావితం చేసిన అంశాలు. దేశ సంపదలో నలభై శాతం కేవలం ఒక్క శాతం మంది వద్ద కేంద్రీకృతమవ్వడం, మరోవైపు కోట్లాది మంది కూడు-గూడు-గుడ్డ-విద్య-వైద్యం వంటి మౌలిక అవసరాలు కూడా తీరని దుస్థితి నెలకొంది. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన పాలకులు దానికి భిన్నంగా మతోన్మాద మంటలు రగిలించి, వాటిలో చలికాచుకున్నారు. విద్య, ఉపాధి రంగాలు అత్యంత దయనీయ స్థితికి చేరాయి. ఇప్పటివరకు అంతో, ఇంతో విశ్వాసం పొందిన న్యాయ వ్యవస్థ గత కాలపు ఖ్యాతి మసకబారుతుండటం ఆందోళనకర పరిణామం. నూతన విద్యావిధానం పేరుతో మూతబడిన బడులు మళ్లీ తెరుచుకోవాలని, చరిత్ర, విజ్ఞానశాస్త్రాలను మతతత్వపు వక్రీకరణలతో నింపివేయడం మానుకోవాలని, విద్యారంగం శాస్త్రీయ భావనలతో కొత్త పుంతలు తొక్కాలని, వేయి ఆలోచనలు వికసించి భావి తరాల ప్రగతికి బాటలు వేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజల జీవనోపాధికి గ్యారంటీ ఇచ్చే ఉద్యోగ, ఉపాధి రంగాలు కొత్త సంవత్సరంలోనైనా పూర్తిస్థాయిలో విరాజిల్లాలన్నది ప్రజల ఆకాంక్ష! గణాంకాల మాయాజాలం కాకుండా, తమ గౌరవాన్ని కాపాడే నిజమైన అభివృద్ధి జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు. కానీ, సర్కారు గమనం దానికి భిన్నం! ఆర్థిక సంస్కరణలతో ఇప్పటికే అరకొరగా మారిన కార్మిక హక్కులను లేబర్‌కోడ్‌లతో పూర్తిగా దిగమింగడానికి ప్రభుత్వం సిద్ధమైంది. గ్రామీణ ప్రజానీకానికి ఆలంబనగా నిలిచిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని హుళక్కి చేసేందుకు జి.ఆర్.ఎ.ఎ.ఎం.జి పేరుతో శాసనం తెచ్చింది. ఈ దుష్కృత్యాలకు నిరసనగా ఫిబ్రవరి నెలలో సమ్మెకు కేంద్ర కార్మిక సంఘాలు ఇప్పటికే పిలుపునిచ్చాయి. కొత్త సంవత్సరంలో సామాన్య ప్రజానీకపు సమరశంఖం ఇది!

మన రాష్ట్రంలోనూ పరిస్థితులు ఆందోళనకరంగానే ఉన్నాయి. పరిశ్రమల ఏర్పాటుకానీ, ఉపాధి కల్పన కానీ ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టుగాలేవు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు ఏమాత్రం పెరగడం లేదు. మరోవైపు పరిశ్రమల పేరు చెప్పి, కార్పొరేట్లకు భూ సంతర్పణ కొనసాగుతోంది. గిట్టుబాటు ధరలు లేక రైతాంగం ఆందోళన చెందుతోంది. ప్రభుత్వ వైద్య రంగాన్ని కార్పొరేట్లకు అప్పచెప్పడానికి పాలకులు పరుగులు తీస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే కుట్రలు ఆగలేదు. ప్రత్యేక హోదా మాటే పాలకులు మరచిపోయారు. రాజధాని అమరావతి నగర నిర్మాణం ఇంకా అస్తుబిస్తుగానే ఉంది. వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం వంటివి జవాబులేని ప్రశ్నలుగానే మిగిలాయి. ఈ వైఫల్యాలను ప్రశ్నించి, ప్రజలకు న్యాయం కోసం గళమిప్పే శక్తుల గొంతు నొక్కడానికి ప్రభుత్వం బరితెగించడం, పి.డి యాక్టును బనాయించడం ఏడాది చివర్లో చోటుచేసుకున్న దుష్పరిణామాలు. నూతన సంవత్సరలోనైనా రాష్ట్ర ప్రభుత్వ ఈ ధోరణి మారాలి.

దళితులు, ఆదివాసులు, మైనార్టీలు, మహిళలు ఎదుర్కొంటున్న దాడులకు ముగింపు పలికి, సమానత్వం నిజంగా అమలుకావాలన్నది ప్రజల ఆకాంక్ష. జల్, జంగల్, జమీన్‌పై కార్పొరేట్ ఆక్రమణలు ఆగాలి. అటవీ భూముల రక్షణ, గిరిజనుల హక్కుల పరిరక్షణ జరగాలి. పట్టణాల్లో కాలుష్యం, కొండల విధ్వంసం, ప్రక తి వనరుల దోపిడీ వంటివి కేవలం పర్యావరణ సమస్యలు కావు. ఇవి జీవన, సామాజిక న్యాయ సమస్యలు. సామాన్యులను పట్టం కట్టే పర్యావరణ న్యాయంవైపు దేశం మళ్లాల్సి ఉంది. 'సర్'తో ప్రశ్నార్థకంగా మారిన దేశ ఎన్నికల ప్రక్రియ నూతన ఏడాదిలోనైనా నిజమైన, నిష్పక్షపాతపు ప్రజాస్వామ్యంగా పరిఢవిల్లుతుందని ఆశిద్దాం! కొత్త సంవత్సరం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ఆశావహ మలుపు కావాలని కోరుకుందాం!

మహనీయుల మాట



ఘన విజయాలు సాధించడానికి అంకిత భావంతో పనిచేయండి.

- ఎ.పి.జె. అబ్దుల్ కలామ్,
భారత పూర్వ రాష్ట్రపతి,
ప్రఖ్యాత శాస్త్రవేత్త.

విశ్లేషణ

ప్రజారోగ్యానికి పి.పి.పి అవసరం లేదు

కన్నూరు సుజాతారావు

ప్రభుత్వం రూపొందించే విధానాలకు ఒకటి లేదా అంతకు మించిన లక్ష్యాలు ఉంటాయి. వైద్య విద్యలో అనుసరించదలిచిన ప్రభుత్వ-ప్రైవేటు-భాగస్వామ్యం (పి.పి.పి) విధానానికి కూడా చాలా లక్ష్యాలు ఉండొచ్చు. అందుబాటులో ఉండే ఫీజులో నాణ్యమైన వైద్య విద్యకు అవకాశం కల్పించడం, పెట్టుబడిదారుడికి తగినన్ని లాభాలు సమకూర్చడం, రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ప్రజలకు సంకేతాత్మకంగా ప్రచారం చెయ్యడం, కోట్లాది రూపాయల ఈ బడా కాంట్రాక్టుల ద్వారా పై డబ్బులు దండుకోవడం...ఇలా చాలా అవకాశాలు ఉంటాయి. కాబట్టి లక్షిత విధానానికి అనుగుణంగా పాలసీ విధివిధానాలు రూపొందిస్తారు.

సంఖ్యా విస్తీర్ణం

మూడేళ్ళ క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్తగా ఆరు వైద్య కళాశాలలను నెలకొల్పాలని నిర్ణయించింది. దీనితో ప్రభుత్వ వైద్య కళాశాలల సంఖ్య 17కి పెరుగుతుంది. ప్రైవేటు రంగంలో 19 వైద్య కళాశాలలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మరో 10 వైద్య కళాశాలలను పి.పి.పి పద్ధతిన నెలకొల్పాలని భావిస్తున్నది. ఈ కళాశాలలు అందుబాటులోకి వస్తే కొత్తగా 6500 సీట్లు లభిస్తాయి. ఈ ప్రతిపాదిత 10 వైద్య కళాశాలలకుగాను జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 835 ఎకరాల భూమి సేకరించింది. అలాగే ఈ కళాశాలల నిర్మాణం వివిధ దశలలో ఉన్నది.

సగటున ఒక్కో వైద్య కళాశాల స్థాపనకు 450 కోట్ల రూపాయల చొప్పున మొత్తం 4500 కోట్ల రూపాయల నిధులు అవసరమవుతాయి. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, నాబార్డ్ రుణాలతో ఈ నిధులు సమకూరుతాయి. ప్రతి వైద్య కళాశాలలో 150 ఎం.బి.బి.ఎస్ సీట్లు, దానికి అనుబంధంగా 650 పడకల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి భవిష్యత్తులో మరింత సామర్థ్యం పెంచుకునే అవకాశంతో అందుబాటులోకి వస్తాయి. సాధారణంగా ప్రభుత వైద్య కళాశాలలో ఫీజు రాయితీ కల్పిస్తారు. అయితే ఆర్థిక నిర్వహణ భారం కాకుండా ఉండడానికి ప్రభుత్వం మూడంచెల ఫీజులు నిర్ణయించింది. 50 శాతం సీట్లు ఏడాదికి 15,000 రూపాయల ఫీజు చొప్పున, 35 శాతం సీట్లు 12 లక్షల ఫీజు చొప్పున, 15 శాతం సీట్లు ఎన్నారైలకు 20 లక్షల ఫీజు చొప్పున వసూలు చేస్తే ఏడాదికి ఒక్కో బ్యాచ్ నుండి 11 కోట్ల ఆదాయం లభిస్తుంది. ఐదేళ్ళ కోర్సు పూర్తయ్యేసరికి 55 కోట్ల ఆదాయం వస్తుంది. వీటికి తోడు కాలేజీలో విద్యా బోధన మొదలయిన రెండవ ఏడాదిలో 28 పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్లు లభిస్తాయి. ఇవి 50 వరకు పెరిగే అవకాశం ఉన్నది. ఈ సీట్ల ఫీజు ఎం.బి.బి.ఎస్ ఫీజులకు మూడు రెట్లు ఎక్కువగా ఉంటుంది.

2024లో ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం విద్యా రంగ ప్రైవేటీకరణే లక్ష్యంగా పెట్టుకున్న నీతి ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా మొత్తం 11 వైద్య కళాశాలలను పి.పి.పి పద్ధతిన నిర్వహించడానికిగల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చెయ్యడానికి కె.పి.యం.జి ని నియమించింది. పి.పి.పి పద్ధతిన కళాశాల, జిల్లా ఆసుపత్రుల నిర్వహణకు అవసరమయ్యేంత భూమిని ఎకరాకు 100 రూపాయల చొప్పున 33 ఏళ్ళకు (దాన్ని మరో 33 ఏళ్ళకు పొడిగించుకునే వెసులుబాటుతో) లీజుకు ఇవ్వాలి. అలాగే ప్రాజెక్టు వ్యయంలో ప్రభుత్వం 25 శాతం వాటా 'వయబిలిటీ ఫండింగ్' పేరిట సమకూర్చాలి. రాష్ట్ర ఆరోగ్య బీమా సదుపాయం కింద సేవలు అందించే ఆసుపత్రిగా ప్యానల్‌లో చేర్చాలి. జాతీయ వైద్య కమిషన్ తదితర సంస్థల నుండి అనుమతులు తెచ్చి పెట్టాలి. అలాగే 70 శాతం పడకలు నిండేందుకు హామీ పడాలి. ఇందుకు ప్రతిగా పెట్టుబడి పెట్టే సంస్థ రెండేళ్ళలో నిర్మాణ పనులు పూర్తి చెయ్యాలి. అలాగే ఔట్ పేషెంట్లకు ఉచిత వైద్య సేవలు అందించాలి. 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' కింద ప్రభుత్వం సిఫార్సు చేసే పేషెంట్లకు 70 శాతం పడకల ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి. మిగిలిన 30 శాతం పడకలకు సంబంధించి మార్కెట్ రేటుకు వైద్యం చేసుకోవచ్చు. నిర్దిష్ట గడువు పూర్తయ్యేలా పర్యవేక్షించడానికి ప్రభుత్వం ఒక ఇంజనీరుని నియమించాలి. జన ఔషధి ఫార్మసీకి, మెడికో లీగల్ కేసుల నిమిత్తం చెరి 500 చదరపు అడుగుల నిర్మాణాన్ని పూర్తి చేసి అందించాలి.

> **మన రాష్ట్రంలోని ప్రజారోగ్య వ్యవస్థలో చాలా బలహీనతలున్నాయి. మౌలిక సౌకర్యాలు కరవై, నిధుల లేమితో కునారిల్లుతూ తగితనంత సిబ్బంది, ముఖ్యంగా స్పెషలిస్టుల కొరతతో మన ప్రజారోగ్య వ్యవస్థ అగమ్యగోచరంగా తయారైంది. వైద్య విద్యను ప్రైవేటీకరిస్తే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు అందుతున్న అరకొర వైద్య సౌకర్యాలు కూడా లోపిస్తాయి. కాబట్టి ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చే వారికి ప్రత్యేక రాయితీలు కల్పించడం అవసరం. ఈ కారణాలన్నింటి రీత్యా ఇవాళ వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులను పి.పి.పి పద్ధతలో నిర్వహించాలని భావించడం ఎంత మాత్రమూ సముచితం కాదు.**

సాక్ష్యాధార అంచనాల అవసరం

పి.పి.పి విధానంపై పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు వెల్లువెత్తాయి. ప్రజల ఆస్తులుగా ఉండాల్సిన జిల్లా ఆసుపత్రులను ప్రైవేటీకరిస్తున్నారన్న విమర్శలు చెలరేగాయి. మధ్య తరగతి, పేద విద్యార్థులకు వైద్య విద్యావకాశాలు సన్నగిల్లుతాయని, ప్రభుత్వ ఉద్యోగాలు హరించుకుపోతాయనే ఆందోళన నెలకొనిఉన్నది. ప్రైవేటు పెట్టుబడిదారులు రిక్రూట్‌మెంట్‌లో కోటా విధానాన్ని పాటిస్తారనిగానీ, జేబు ఖర్చులకు ఇచ్చే అలవెన్సులు చెల్లిస్తారని కానీ గ్యారంటీ ఉండదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అలాగే ప్రైవేటు పెట్టుబడిదారులకు వాళ్ళ భయాలు వాళ్ళకు ఉన్నాయి. ఆసుపత్రిలో 70 శాతం పడకలలో ఆయుష్మాన్ భారత్ పథకంలో రేట్లకు వైద్య సేవలు అందించాల్సి రావడం, ప్రభుత్వ చెల్లింపులలో జరిగే తీవ్ర జాప్యం వంటి రిస్కులను ఏకపక్షంగా భరించాల్సి వస్తుందన్న భయాలు ఉన్నాయి. కాబట్టి ఈ 'రిస్క్'లను తట్టుకోవడానికి ప్రైవేటు పెట్టుబడుదారులు దొడ్డిదారిన క్యాపిటేషన్ ఫీజుల వసూళ్ళకు పాల్పడవచ్చు. అలాగే బోధనా సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకుండా ఖర్చులు తగ్గించుకోవాలని చూడొచ్చు. అలాగే ఆరోగ్య సేవల నాణ్యతా లోపాలు, సేవల నిరాకరణకు పాల్పడవచ్చు. డిమాండ్ లేదు, పేషెంట్లు లేరనే పేరిట 70 శాతం పడకలలో కావలసిన మేరకు మార్కెట్ రేట్లతో వైద్యం చేసుకునే వాటిగా మార్చుకోవచ్చు. అన్నిటికన్నా మించి ప్రభుత్వంతో ఏదన్నా పేచీ వచ్చి కోర్టులకెక్కితే పరిష్కారానికి ఏళ్ళకేళ్ళు పట్టొచ్చు.

జిల్లా ఆసుపత్రుల మీద సర్వాధికారాలను ప్రైవేటు సంస్థలకు 66 ఏళ్ళపాటు కట్టబెట్టే పద్ధతి ఎంతమాత్రం న్యాయంగా లేదు. దీనిని పున: సమీక్షించాలి. సమగ్ర ప్రాథమిక వైద్య సదుపాయాలు కల్పిస్తే 30 శాతం ఆసుపత్రుల చేరికలను నివారించవచ్చని అనేక అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి ప్రభుత్వం ప్రాథమిక వైద్య సదుపాయాలను పటిష్టం చేసే దిశగా తగిన చర్యలు చేపట్టాలి. ఆధునిక సాంకేతిక వైద్య నైపుణ్యాలను నెలకొల్పితే ఆపరేషన్ల తరువాత ఆసుపత్రిలో ఉండాల్సిన పరిస్థితులను కనీస స్థాయికి తగ్గించవచ్చు.

ఒక్కో సందర్భంలో సాంకేతికత ఆరోగ్య సేవల అందజేతలో ఆటంకాలు సృష్టిస్తుంది. కాబట్టి ప్రాంతాల వారీగా తరచూ వచ్చే రోగాలను, వాటిలో మార్పులను సమగ్రంగా అంచనా వేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఏకరీతిగా 650 పడకల ఆసుపత్రులను నెలకొల్పాల్సిన అవసరం ఉందో లేదో నిర్ధారించవచ్చు.

జిల్లా స్థాయిలో పి.పి.పి పద్ధతిలో ఆసుపత్రులు నిర్మిస్తే దీర్ఘకాలంలో ప్రజారోగ్య వ్యవస్థ క్షీణించిపోతుంది. ప్రజారోగ్య వ్యవస్థ బలోపేతానికి, ఎదుగుదలకు తీవ్ర విఘాతం కలుగుతుంది. బలమైన రిఫరల్ వ్యవస్థను నెలకొల్పడానికి ప్రాథమిక, మాధ్యమిక, తృతీయ స్థాయి ఆరోగ్య రక్షణలను సమీకృతం చేయడం ద్వారా వైద్య వ్యవస్థ సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని మరింత మెరుగుపరచవచ్చు.

వ్యవస్థాగత లోపాలు

మన రాష్ట్రంలోని ప్రజారోగ్య వ్యవస్థలో చాలా బలహీనతలున్నాయి. మౌలిక సౌకర్యాలు కరవై, నిధుల లేమితో కునారిల్లుతూ తగితనంత సిబ్బంది, ముఖ్యంగా స్పెషలిస్టుల కొరతతో మన ప్రజారోగ్య వ్యవస్థ అగమ్యగోచరంగా తయారైంది. వైద్య విద్యను ప్రైవేటీకరిస్తే ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు అందుతున్న అరకొర వైద్య సౌకర్యాలు కూడా లోపిస్తాయి.

కాబట్టి ప్రభుత్వమే వైద్య కళాశాలలను నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడానికి ముందుకు వచ్చే వారికి ప్రత్యేక రాయితీలు కల్పించడం అవసరం. ఈ కారణాలన్నింటి రీత్యా ఇవాళ వైద్య కళాశాలలు, జిల్లా ఆసుపత్రులను పి.పి.పి పద్ధతలో నిర్వహించాలని భావించడం ఎంత మాత్రమూ సముచితం కాదు. నూతనంగా నెలకొల్పదలచిన కాలేజీలకు అవసరమైన పెట్టుబడులు సమీకరించడానికి ఇతర మార్గాలు అనేకం ఉన్నాయి. పి.పి.పి పద్ధతిని ఆశ్రయించాలంటే రాష్ట్రంలోనూ, దేశంలోనూ బలమైన చట్టాలు, పర్యవేక్షణా వ్యవస్థ అవసరం ఎంతైనా ఉంది. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అరడజను కాంట్రాక్టులు కట్టబెట్టి ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. కనీసంగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టాన్ని కూడా అమలు చేయకలేకపోయింది. ఈ చేదు అనుభవం రీత్యా పేదల జీవితాల మీద ప్రత్యక్షంగా ప్రభావం చూపే ప్రజారోగ్య వ్యవస్థను ప్రైవేటీకరించడం శ్రేయస్కరం కాదు.

> **వైద్య విద్య ఇవాళ సంక్షోభంలో ఉంది. మార్పులు వేగవంతంగా చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పటి ఐ.టి బూమ్‌లో విచ్చలవిడిగా నెలకొల్పిన ఇంజినీరింగ్ కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరతతో ఎన్ని కాలేజీలు మూతపడ్డాయో తెలిసిందే! తగినంత మంది బోధనా సిబ్బంది లేకుండా వైద్య కళాశాలలు నెలకొల్పడం మూలంగా వైద్య కళాశాలలకూ అదే దుస్థితి ఎదురవుతుంది. కొత్తగా వైద్య కళాశాలలు నెలకొల్పాలంటే నాణ్యమైన విద్యను అందించడం, మధ్యతరగతి ప్రజానీకం పిల్లల ప్రవేశానికి వెసులుబాటు ఉండడం ఎంతైనా అవసరం. పి.పి.పి పద్ధతి మాత్రం ఆ రకమైన సంక్షేమం, ప్రజావిశ్వాసం పాదుకొలిపే వ్యవస్థ కానే కాదు.**

వైద్య విద్య ఇవాళ సంక్షోభంలో ఉంది. మార్పులు వేగవంతంగా చోటు చేసుకుంటున్నాయి. ఒకప్పటి ఐ.టి బూమ్‌లో విచ్చలవిడిగా నెలకొల్పిన ఇంజినీరింగ్ కాలేజీల్లో బోధనా సిబ్బంది కొరతతో ఎన్ని కాలేజీలు మూతపడ్డాయో తెలిసిందే! తగినంత మంది బోధనా సిబ్బంది లేకుండా వైద్య కళాశాలలు నెలకొల్పడం మూలంగా వైద్య కళాశాలలకూ అదే దుస్థితి ఎదురవుతుంది. కొత్తగా వైద్య కళాశాలలు నెలకొల్పాలంటే నాణ్యమైన విద్యను అందించడం మధ్యతరగతి ప్రజానీకం పిల్లల ప్రవేశానికి వెసులుబాటు ఉండడం ఎంతైనా అవసరం. పి.పి.పి పద్ధతి మాత్రం ఆ రకమైన సంక్షేమం, ప్రజావిశ్వాసం పాదుకొలిపే వ్యవస్థ కానే కాదు.

/ వ్యాసకర్త కేంద్ర ప్రభుత్వ మాజీ ఆరోగ్య కార్యదర్శి /
('హిందూ' సౌజన్యంతో)

★

వ్యాఖ్య

మళ్లీ తూర్పు దేశాలకు వైజ్ఞానిక వైభవం!

> **కాలం కలిసి రానప్పుడు అప్పటి దాకా జాజ్వల్యమానంగా వెలిగిన చోటి నుండి ఎక్కడ ఠికాణా దొరికితే అక్కడికి సైన్సూ వలస పోయింది. అలా ప్రపంచంలో ఒక్కో యుగంలో ఒక్కో చోట అది కొలువు తీరింది. వెళ్లిన చోటల్లా వెలుగులు చిమ్ముతూ ఆ సమాజాల్ని విప్లవీకరించింది. మళ్లీ కష్టకాలం వస్తే మూటా ముల్లే సర్దుకుని మరో చోటు వెతుక్కుంది. విచిత్రమేమంటే అప్పుడప్పుడూ వెనకబడ్డా, మానవాళికి మల్లే మళ్ళీ మళ్ళీ దానికి మంచి రోజులే వచ్చాయి. కారణం సైన్సు చరిత్ర మానవ చరిత్ర ఒకటే గనుక!**

విజ్ఞాన శాస్త్రపు ప్రయాణాన్ని, పరిణామాన్ని కూడా చరిత్రగా రాస్తే అది మానవ చరిత్రకు నకలుగా కనిపిస్తుంది. కాలం కలిసి రానప్పుడు అప్పటి దాకా జాజ్వల్యమానంగా వెలిగిన చోటి నుండి ఎక్కడ ఠికాణా దొరికితే అక్కడికి సైన్సూ వలస పోయింది. అలా ప్రపంచంలో ఒక్కో యుగంలో ఒక్కో చోట అది కొలువు తీరింది. వెళ్లిన చోటల్లా వెలుగులు చిమ్ముతూ ఆ సమాజాల్ని విప్లవీకరించింది. మళ్లీ కష్టకాలం వస్తే మూటా ముల్లే సర్దుకుని మరో చోటు వెతుక్కుంది. విచిత్రమేమంటే అప్పుడప్పుడూ వెనకబడ్డా, మానవాళికి మల్లే మళ్ళీ మళ్ళీ దానికి మంచి రోజులే వచ్చాయి. కారణం సైన్సు చరిత్ర మానవ చరిత్ర ఒకటే గనుక!

తొలి నాగరికతల్లో శాస్త్ర సాంకేతికాలు అప్పటి వ్యవసాయ సమాజ అవసరాల్ని గొప్పగా తీర్చాయి. ఈజిప్టు నుంచి హరప్పా దాకా, చైనా నుంచి మొసపొటేమియా దాకా బండ్లు, చక్రాలు, పడవలు, లోహాలు, ఖగోళం, పంచాంగం, గణితం, కొలతలు ఇలా ఎన్ని ఆవిష్కరణలు ఆ కాలంలో పురుడు పోసుకున్నాయో! ఈ క్రమంలో ఎన్ని ఇచ్చిపుచ్చుకోవడాలు జరిగాయో! చరిత్రలో అదే మనిషికయినా, సైన్సుకయినా మొదటి మహత్తర కాలం. కానీ కాలం విచిత్రమైంది. ప్రకృతి కన్నెర్రతో, మోయలేని భారంగా మారిన నగరాలతో ఆ మహా నాగరికతలు మట్టిపాలయ్యాయి. 'పెట్టుబడిదారీ శైశవాడంబరంగా' మిగిలిపొయ్యాయి. దీంతో వాటన్నిటా సైన్సుకు తలుపులు మూసుకుపొయ్యాయి.

తర్వాత తూర్పు దేశాల వైజ్ఞానిక యుగం మొదలైంది. చైనా భారతదేశాల్ని శాస్త్రవిజ్ఞానం గాఢాలింగనం చేసుకొంది. అప్పటికి ఇనుము మనిషి హస్తగతమైంది. విస్తార వ్యవసాయ క్షేత్రాల్ని అతనికందించింది. దీంతో ఖగోళం, రసాయనం, వైద్యం, గణితం, గడియారం, తెరచాప, కాగితం, మందుగుండు, దిక్సూచి ఇలా ఎప్పుడూ ఎరగని ఆవిష్కరణలు ఈ దేశాల్ని ముంచెత్తాయి. సరికొత్త సామ్రాజ్యాలు, తాత్విక చింతనలు పుట్టుకొచ్చాయి. అదో వెలుతురు వెల్లువ. కానీ వాటన్నిటికీ మత ఛాందస పునరుత్థానాలు, తిర్యగ్ధోరణులు శాపాలుగా మారాయి. సైన్సు చిన్నబోయింది.

ఆ తర్వాత శాస్త్ర విజ్ఞానం తార్కిక విజ్ఞానాన్ని కూడా వెంటపెట్టుకొని గ్రీకును చేరింది. ఏథెన్స్ గొప్ప వైజ్ఞానిక కేంద్రమైంది. సైన్సు శాఖోపశాఖలుగా విస్తరించింది. రోమ్ వీధుల్లో ఇంజనీ రింగు తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. నౌకా నిర్మాణం, జీవశాస్త్రం, ఖగోళ జ్ఞానం, కొత్త పుంతలు దొక్కాయి. అక్కడా సప్తరుషులు వెలిశారు. కానీ అనుభవ జ్ఞానం లేని భావ వాదం సైన్సును అంతకంటే ముందుకు పోనీకుండా అడ్డుకొంది. దాంతో ఆ శకం ముగిసింది.

ఈ దశలో విజ్ఞాన శాస్త్రం అరబ్బు దేశాలకు చేరుకుంది. తొలి ఇస్లాం సమతావాదం, ఉదారత్వం, యాత్రాభిలాష, జ్ఞానదాహం అన్నిటికీ మించి ప్రపంచం నలుమూలల నుండి విజ్ఞానాన్ని సేకరించే, స్వీకరించే తత్వం సైన్సుకక్కడ గొప్ప ఆలంబనాలుగా మారాయి. ఎక్కడెక్కడి గ్రంథాలకు అనువాదాలు వచ్చాయి. దీంతో గణిత రసాయన వైద్య జీవశాస్త్ర సముద్రయాన జ్ఞాన రంగాల్లో అరబ్బులు ఎవ్వరికీ అందనంత ఎత్తుకు ఎదిగిపొయ్యారు. కానీ తర్వాత వారు ప్రజాస్వామ్య లక్షణాల్ని పోగొట్టుకున్నాక విజ్ఞాన శాస్త్రం దూరమైంది.

ఆ తర్వాత చరిత్ర మనకు తెలిసిందే. అదే ఆధునిక సైన్సు యుగం. యూరపు వైజ్ఞానిక విప్లవం. పోగుబడ్డ సంపద, వలసల కోసం సముద్రాధిపత్యం, సాంస్కృతిక పునరుజ్జీవనాలు కలిసి ప్రపంచం ఎప్పుడూ ఎరగని కొత్త సైన్సు శకాన్ని యూరపులో ఆవిష్కరించాయి. ఆవిరి యంత్రాలు, విద్యుత్తు, మోటార్లు, రైళ్ళు, విమానాలు, నౌకలు ప్రజా జీవనాన్ని ఆనవాళ్లు పట్టలేనంతగా మార్చేశాయి. పదార్థ విజ్ఞాన శాస్త్రానికి కొత్త రెక్కలొచ్చాయి. యంత్రాలొచ్చి వస్తువులు గుట్టలు పడి యూరపు ప్రపంచాధిపత్యానికి చేరుకుంది. కానీ అది ప్రపంచ యుద్ధాల్ని నెత్తికెత్తుకొని చతికిలపడ్డంతో ఆ హోదాను కాస్తా అమెరికా తన్నుకెళ్ళింది.

ఇప్పుడు ఆధునిక శాస్త్ర విజ్ఞానమంతా అమెరికా గుప్పిట్లో వుంది. అణుశక్తి నుంచి అంతరిక్ష విజ్ఞానం దాకా దాన్ని ఢీకొనగల వారు లేరు. సమాచార సాంకేతికత నుండి కృత్రిమ మేధ దాకా దానికి తిరుగులేదు. ఆధునిక వైద్యం నుంచి రోబోట్స్ దాకా దానికి ఎదురులేదు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల్లో సింహభాగం అమెరికాలోనే వున్నాయి. ఎక్కడెక్కడి సుప్రసిద్ధ శాస్త్రవేత్తలు వాటిలోనే వున్నారు. ప్రతి ఏటా నోబెల్ అవార్డు గ్రహీతల్లో సగానికి సగం అమెరికన్లే. అది పరిశోధనల మీద (2023) పెట్టే ఖర్చు 834 బిలియన్ల డాలర్లు! ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికా ప్రపంచాధిపత్యమంతా దాని వైజ్ఞానిక శక్తి మీదనే ఆధారపడి వుంది. ఎప్పటికప్పుడు అత్యాధునిక ఆవిష్కరణలు చేస్తూ పరిశోధనా రంగాన్ని పరుగులు పెట్టించడంపైనే వుంది. ఈ పోటీలోకి మరెవ్వరూ దరిదాపులకు కూడా రాలేరని ఇప్పటిదాకా అందరం అనుకున్నాం!

కానీ ఇటీవల చూస్తే వ్యవహారం ఉల్టా అయ్యేలా వుంది. దాని సంకుచిత తిరోగామి తత్వం, పెత్తందారీ విధానం, ఆర్థిక మాంద్యం, విదేశీ సంబంధాలు, పెట్టుబడులు, రాజకీయ దృక్పథం-ఇలా ప్రతిదీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమెరికా అగ్ర స్థానానికి ఎసరు పెట్టేలా వున్నాయి. చరిత్రలో ఒకనాడు భారతదేశానికి ఏం జరిగిందో, అరబ్బు దేశాలకేం జరిగిందో ఇప్పుడు అమెరికాకూ అదే పునరావృతం అయ్యేలా వుంది. మళ్లీ చక్రం వెనక్కి తిరిగి తూర్పు దేశాల్లో వైజ్ఞానిక వైభవం ముందుకొచ్చేలా ఉంది.

ట్రంప్ అధికారంలోకి వచ్చాక 1000 శాస్త్ర సాంకేతిక సంస్థలకు నిధులు నిలిచిపోయాయి. జాతీయ క్యాన్సర్ సంస్థకు బడ్జెట్లో 30 శాతం కోతబడింది. బిగ్ బ్యూటిఫుల్ చట్టం నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌కు నిధుల కేటాయింపుల్ని 56 శాతం తగ్గించింది. నాలుగు వేల పరిశోధనలకు గ్రాంట్లు నిలిచి పొయ్యాయి. చివరకు 2023లో నోబెల్ అవార్డు సంపాదించి పెట్టిన ఆర్ఎన్ఏ వ్యాక్సిన్ ప్రాజెక్టు కూడా ఆర్థికంగా కష్టాల్లోకి పోయింది. ఇక హెచ్ఐవి, టి.బి, మలేరియా, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులపై పరిశోధన సైతం క్రమంగా అటకెక్కుతోంది!

దీంతో జాన్ హాప్కిన్స్ లాంటి గొప్ప విశ్వవిద్యాలయం నుంచి సైతం విద్యార్థులు ఆక్స్‌ఫర్డ్ వంటి సంస్థలకు క్యూ కడుతున్నారు. దాదాపు 1.50 లక్షల విద్యార్థులు అమెరికాకు మొహం చాటేస్తున్నారని "గార్డియన్" పేర్కొంటే, దీనివల్ల ఏడుబిలియన్ల డాలర్లు నష్టమని "ఫోర్బ్స్" చెప్పుకొచ్చింది.

అమెరికా ధోరణి ఇలా వుంటే చైనా తన విద్యార్థులందరినీ విదేశాల నుంచి వెనక్కి రప్పించుకుంటోంది. 'నేచర్ ఇండెక్స్ రిసెర్చ్ లీడర్స్ ర్యాంకింగ్స్' (31 డిసెంబరు 2024) ప్రకారం బయో సైన్సు, రసాయన శాస్త్రం, భౌతిక శాస్త్రం, భూ పర్యావరణ శాస్త్రాలు, ఆరోగ్య శాస్త్రాల్లో చైనా పరిశోధనలతో సరితూగేవి నేడు ఏ దేశంలో లేవు. పరిశోధనా రంగంలో హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని 'చైనా సైన్సు అకాడమీ' ఇప్పటికే వెనక్కి నెట్టేసింది. చైనాలో 2015 నాటికే ఓ డజను దాకా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలున్నాయి. అంతర్జాతీయ వైజ్ఞానిక పరిశోధనా రంగానికి చైనా దోహదం అమెరికాను అధిగమించే రోజులు అతి సమీపంలో వున్నాయి. ప్రపంచ స్థాయిలో ఉటంకించబడే అత్యంత ప్రామాణిక పరిశోధనా పత్రాల్లో 27.2 శాతం చైనావి. పరిశోధనా రంగానికి చైనా బడ్జెట్ కూడా 780.7 బిలియన్ల డాలర్లకు చేరుకుంది. ఇది ప్రతి ఏటా 8.7 శాతం పెరుగుతోంది. అమెరికా పెరుగుదల మాత్రం 1.7 శాతం మించి లేదు.

ఇక అత్యాధునికశాస్త్ర పరిశోధనా రంగాల్లోనూ చైనా దూకుడు ఇలానే వుంది. శాన్ ఫోర్డ్ యూనివర్సిటీ ఎ.ఐ ఇండెక్స్ రిపోర్టు (2023) ప్రకారం కృత్రిమ మేధ పరిశోధనా పత్రాల్లో 40 శాతం చైనావి. అమెరికా వాటా కేవలం పది శాతం. క్వాంటం రీసెర్చ్, సెమీ కండక్టర్స్, బ్రాడ్ బ్యాండ్ ఇన్ఫర్మేషన్, నానో మెటీరియల్స్, స్మార్ట్ రోబోట్స్ ఫ్యూయల్ సెల్స్, కాస్మిక్ డిటెక్టర్స్ లాంటి రంగాల్లో కేంద్రీకరించి పరిశోధనలు చేసేందుకు ఇటీవల చైనా 15వ పంచవర్ష ప్రణాళిక విశ్వవిద్యాలయాలకు, శాస్త్ర పరిశోధనా సంస్థలకు పుష్కలంగా నిధులందించాలని నిర్ణయించింది. ప్రపంచంలోనే పరిశోధనా రంగానికి అత్యంత భారీ పెట్టుబడి త్వరలోనే చైనాది కానుంది. దూరదృష్టితో ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాల పునాదినది పటిష్టం చేసుకుంటోంది.

ఇలా చూస్తే తమ పూర్వ వైజ్ఞానిక వైభవాన్ని తూర్పు దేశాలు మళ్లీ సంతరించుకోబోతున్నాయా అనిపిస్తుంది. ప్రాగ్దేశాల ప్రాంగణంలో సరికొత్త శాస్త్ర సాంకేతికాలు కాంతి ధారల్ని కురిపించబోతున్నట్లు అనిపిస్తోంది.

మరి అలనాడు చైనాతో సమ ఉజ్జీగా వున్న మనం ఇప్పుడు ఎక్కడున్నాం? మనకు మనం ఎన్ని బడాయిలు చెప్పుకున్నా ప్రపంచం మాత్రం మన వైపు చూడ్డం లేదన్నది సత్యం!

/ 'జనవిజ్ఞానం' సంపాదకీయం /

జనవాక్యం

అవినీతి అంతానికి...

అవినీతి అనేది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఓ పెద్ద సమస్య. అవినీతి కారణంగా పేద ప్రజల జీవన ప్రమాణాలు చాలా దారుణంగా దిగజారతాయి. అన్ని రంగాల్లోను దారిద్ర్యం, అస్థిరత చాలా పెరిగిపోతున్నాయి. అంతిమంగా అది మౌలిక వసతుల వైఫల్యానికి, రాజ్య వైఫల్యానికి దారితీస్తుంది. ప్రభుత్వాలు, ప్రైవేటు సంస్థలు, అంతర్జాల వ్యవస్థ, ఎన్జీవోలు, మీడియా, వ్యక్తులు కలసికట్టుగా అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాల్సి ఉంది. అవినీతి వల్ల మానవ హక్కుల ఉల్లంఘనలు, స్టాక్ మార్కెట్ అనిశ్చితి, జీవన ప్రమాణాల నాణ్యంలో క్షీణత లాంటివి చోటు చేసుకుంటాయి. వ్యవస్థీకృత నేరాలు పెరిగిపోతాయి. ప్రజలు వారి హక్కులను కాపాడుకోవటానికి కోర్టులను మానవ హక్కుల కమిషన్లను ఆశ్రయించడం, ఇంటర్నెట్, టీవీ, ప్రింట్ మీడియాను ఆశ్రయించడం, సమాచార హక్కు చట్టం కింద సమాచారం కోరడం వంటి వాటి ద్వారా అవినీతిని కొంతమేరకైనా తగ్గించవచ్చు. యాంటీ కరప్షన్ సంస్థలు ఏర్పాటు చేయడం, రాజకీయ పక్షాలకు నిధులు అందించడంలో, పాలనా వ్యవహారాల్లో పారదర్శకత పెంచడం, ప్రతిభ, సామర్థ్యం లాంటి అంశాల కారణంగా నియామకాలు, ప్రమోషన్లు చేపట్టడం లాంటి చర్యలు తీసుకోవాలని ఈ రంగంలో నిపుణులు సూచిస్తున్నారు.

- యం.రాంప్రదీప్,
తిరువూరు.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@ gmail.com

ప్రజాశక్తి
www.prajasakti.com
5

ఫరీదాబాద్‌లో దారుణం

- కారులో సామూహిక అత్యాచారం
- రోడ్డుపై తోసేసిన కీచకులు
- బాధితురాలి పరిస్థితి విషమం

ఫరీదాబాద్ : గుర్‌గావ్ - ఫరీదాబాద్ రోడ్‌పై వెళుతూ ఇద్దరు వ్యక్తులు కార్లోనే ఒక మహిళపై అత్యాచారం చేసి, బయటకు తోసేసిన సంఘటన సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ఆ మహిళకు 12 కుట్లు పడ్డాయని, ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా వుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి యుపికి చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. బస్సు కోసం ఆమె ఎదురు చూస్తుండగా లిఫ్ట్ ఇస్తామని వారు మారుతి సుజుకి ఇకో కారు ఎక్కించుకుని, దాదాపు మూడు గంటల పాటు ఆ యువతి (25)ని బందీగా వుంచారని ఫరీదాబాద్ పోలీసులు తెలిపారు. బాధితురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసు కేసు నమోదైంది. ఇంట్లో తల్లితో గొడవపడిన ఆ యువతి స్నేహితురాలి ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ దారుణానికి గురైంది. కొద్దికాలంగా ఆమె తన భర్త నుండి వేరుగా జీవిస్తోంది. దట్టమైన పొగమంచు వల్ల ఏమీ కనిపించని వాతావరణంలో నిర్మానుష్యమైన ప్రాంతానికి తీసుకెళ్లిన వారు కారులోనే సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత తెల్లవారుజామున 3-4 గంటల సమయంలో కారులో నుండి తోసేశారని, ఆమెకు ముఖంపై, తలపై తీవ్రంగా గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి సోదరి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదైంది. మంగళవారం ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

మత మార్పిడుల పేరుతో
చర్చి ఫాదర్ సహా 12 మంది అరెస్టు

- నాగపూర్ పోలీసుల నిర్వాకం
- రాజ్యాంగ స్వేచ్ఛను హరించడమే : కేరళ సిఎం విజయన్

నాగపూర్, కొట్టాయం : బిజెపి పాలిత రాష్ట్రాల్లో క్రైస్తవులపై అరెస్టులు, దాడులు పెరుగుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలోని నాగపూర్‌లో క్రిస్మస్ ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న కేరళకు చెందిన చర్చి ఫాదర్‌ని, ఆయన భార్యను, మరో 12మందిని మంగళవారం రాత్రి స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై మహారాష్ట్రతోపాటు కేరళ తదితర ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. విషయం గురించి వాకబు చేయడానికి స్టేషన్‌కు వచ్చిన వారిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వారు బెనొడా పోలీసు స్టేషన్‌లో వున్నారు. పోలీసు స్టేషన్‌లోనే బెయిల్ కోసం సిఎస్ఐ చర్చ్ ప్రతినిధులు ప్రయత్నించినా, కోర్టును ఆశ్రయించాల్సిందిగా పోలీసులు చెప్పారు. పైగా ఎఫ్ఐఆర్ కాపీని కూడా వారికి అందజేయలేదు. ఫాదర్ సుధీర్ గత ఐదేళ్లుగా మహారాష్ట్రలో ఉంటున్నారు. క్రిస్మస్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఇతర మిషనరీలతో కలిసి స్థానికంగా ఒక నివాసానికి చేరుకున్నారు. ఆహ్వానించిన వ్యక్తి పుట్టినరోజు కూడా కావడంతో అక్కడ వేడుకలు జరుపుకుంటున్నారు. ఫాదర్ బలవంతపు మతమార్పిడులకు పాల్పడుతున్నారంటూ బజరంగ్‌దళ్ కార్యకర్త ఫిర్యాదు చేయడంతో నాగపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. వారందరినీ అదుపులోకి తీసుకున్నారు.

ఉప రాష్ట్రపతిని కలిసిన మరునాడే...

క్రైస్తవులపై దాడుల విషయంలో జోక్యం చేసుకోవాలని బిషప్‌లు ఉప రాష్ట్రపతిని కలిసిన మరుసటి రోజే ఈ సంఘటన జరగడం గమనార్హం. క్రైస్తవ మత పెద్దలు, పలువురు రాజకీయ నేతలు కూడా ఈ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకోవడంపై ఆందోళన వెలిబుచ్చారు.

నాగ్‌పూర్‌లో మోహరించిన పోలీసులు

పినరయి విజయన్ ఆగ్రహం

బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఫాదర్ అరెస్ట్ రాజ్యాంగ స్వేచ్ఛను హరించడమేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫాదర్ సుధీర్, ఆయన భార్యతో పాటు 12మంది సహచరుల అరెస్ట్‌పై ఆయన బుధవారం ఎక్స్ వేదికగా స్పందించారు. వారి అరెస్ట్ తీవ్ర ఆందోళన కలిగించిందని అన్నారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ప్రజల్లో చీలికలు తెచ్చేందుకు సంఘ్‌పరివార్ అనుసరిస్తున్న ఇటువంటి ఆందోళనకర విధానాలు, చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని చెప్పారు. గతంలో జబల్‌పూర్‌లో కూడా ఇదే తరహా ఘటనను చూశామని అన్నారు.

ఈ చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛకు విఘాతం : బిషప్ కౌషు

ఈ ఘటనను చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సిఎస్ఐ) బిషప్ సాబు మలై కౌషు తీవ్రంగా ఖండించారు. కొట్టాయంలో ఆయన మాట్లాడుతూ, ఈ చర్యలు రాజ్యాంగ స్వేచ్ఛకు విఘాతమని అన్నారు. నాగ్‌పూర్‌లో 12 సంవత్సరాలుగా సుధీర్ సేవలందిస్తున్నారన్నారు.

పిల్లలకు విద్యను అందించడంతోపాటు స్థానికంగా ప్రజలకు చేదోడు వాదోడుగా వుంటారని, పలు గ్రామాల అభివృద్ధిలో ఆయన గణనీయమైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లౌకికవాదాన్ని రక్షించడం అత్యవసరం

- మహారాష్ట్రలో చర్చి ఫాదర్ అరెస్టును ఖండించిన ఎంఎ బేబీ

న్యూఢిల్లీ : ప్రస్తుత పరిస్థితుల్లో లౌకికవాదాన్ని రక్షించడం అత్యవసరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ పోలీసులు చర్చి ఫాదర్‌తో సహా 12 మందిని అరెస్టు చేసిన సంఘటనపై ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని, హిందుత్వ ఉగ్రవాద మూకలపై చర్యలు తీసుకోవాలని కోరారు. భజరంగ్‌దళ్, ఇతర సంఘ్ సంస్థలు చేస్తున్న దారుణమైన నేరాలకు బలవంతపు మత మార్పిడులను సాకుగా చూపుతున్నాయని, గ్రాహం స్టెయిన్స్, ఆయన కుమారుల హత్య జ్ఞాపకాల నుంచి చెరిగిపోలేదని బేబీ తెలిపారు. ఇంకా రాజ్యాంగం 25వ అధికరణ ఉల్లంఘనకు సంబంధించి అనేక ఉదంతాలు వెలుగుచూస్తున్నాయని పేర్కొన్నారు. సంఘ్‌పరివార్ శక్తులు అల్లర్లను రెచ్చగొడుతున్నాయని ఈ వైఖరి స్పష్టం చేస్తుందని, బిజెపి - ఎన్‌డిఎ ప్రభుత్వాలు బాధితులపైనే చర్యలు తీసుకుంటున్నాయని బేబీ విమర్శించారు. ప్రజల మధ్య విభజనలు రెచ్చగొట్టడం కోసం మైనార్టీలను లక్ష్యంగా చేసుకోవడం భారతదేశ బహుళత్వ సమాజంపై దీర్ఘకాలిక ప్రభావం చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బేబీ ఈ పోస్టుతో ఈ వార్తకు సంబంధించి పత్రికల్లో వచ్చిన కథనాలనూ జతచేశారు.

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి-01451
డి.నెం. 27-18-85, హోటల్ రాజ్ టవర్స్ దగ్గర, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, విజయవాడ-520002.

డిమాండ్ నోటీసు

Notice under Sec.13(2) read with Sec.13(3) of Securitization and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీతలు: 1. శ్రీమతి పెరికల క్రిస్టిన, తండ్రి: పి. క్రిస్టోఫర్, డి.నెం: 47-1-14, బెట్టీ జూబ్లీ హోమ్, లూర్దు నగర్, గుణదల, విజయవాడ-520004. **2. శ్రీ క్రిస్టోఫర్ పెరికల (సహ-ఆబ్లిగెంట్),** తండ్రి: దావీదు, డి.నెం: 47-1-14, బెట్టీ జూబ్లీ హౌస్, లూర్దు నగర్, గుణదల, విజయవాడ-520004. **3. శ్రీ పాల్ పెరికల (సహ-ఆబ్లిగెంట్),** తండ్రి: దావీదు, డి.నెం: 47-4-22, లూర్దు నగర్, గుణదల, విజయవాడ-520004.

టైప్ ఆఫ్ ఫెసిలిటీ	మొత్తం (రూ.లలో)	బకాయి మొత్తం (రూ.)
Education Loan 129630100023178	Rs 20,00,000/-	Rs 24,51,257.11

గౌరవనీయులైన సర్/మేడమ్,
సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) తో చదవబడే సెక్షన్ 13(3) క్రింద **ది. 30-12-2025**వ తేదీన అధీకృత అధికారి మీకు చెందిన లోన్ ఖాతా/ల లోని బకాయిలను తిరిగి చెల్లించమని మీరు చివరిగా తెలిపిన చిరునామాకు నోటీసును అందించలేకపోయాము. కాబట్టి చెప్పబడిన డిమాండ్ నోటీసులోని విషయాలను ఈ వార్తా పత్రికలో ప్రచురిస్తున్నాము. మీరు పొందిన క్రెడిట్ సౌకర్యాలు / ఋణ సౌకర్యాలను **ది. 29-12-2025**న నిరర్థక ఆస్తి (**NPA**) గా పరిగణిస్తున్నాము. మీరు ఋణాన్ని పొందినప్పుడు ఋణపత్రాలను అమలు చేసి బ్యాంక్‌కు అనుకూలంగా భద్రతా ఆస్తిని సృష్టించారు. క్రెడిట్ సౌకర్యాలు మరియు సెక్యూర్డ్ ఆస్తుల వివరాలు ఈ క్రింద విధంగా ఉన్నాయి. **ది. 29-12-2025** నాటికి బకాయి మొత్తం **రూ. 24,51,257.11 పై** (అక్షరాలా ఇరవై నాలుగు లక్షల యాభై ఒక్క వేల రెండు వందల యాభై ఏడు రూపాయల పదకొండు పైసలు మాత్రమే).

స్థిరాస్తి వివరములు

కృష్ణాజిల్లా, విజయవాడ, గుణదల ఎస్.ఆర్.ఓ., నాగార్జున నగర్, పంటకాలువ రోడ్డు, ఆయుష్ హాస్పిటల్ సమీపంలో గల ఆర్.ఎస్. నెం: 326/2ఎ, డోర్ నెం.: 48-13-1ఎ, అసెసెమెంట్ నెం. 625507, మున్సిపల్ వార్డు నెం. 32 లో గల 119 చదరపు గజముల స్థలము మరియు అందులోని ఏసి రేకుల షెడ్డు శ్రీ పెరికల క్రిస్టోఫర్ గారికి చెందినది. **ఆస్తికి హద్దులు: తూర్పు:** పంటకాలువ రోడ్డు - 37.0 అడుగులు, **దక్షిణం:** ఏలేశ్వరపు సూర్య కుమారి గారి ఆస్తి, **పడమర:** జంధ్యాల నాగలక్ష్మమ్మ మరియు ఇతరుల ఆస్తి, **ఉత్తరం:** జొన్నవిత్తుల కుటుంబ సుబ్బారావు గారి ఆస్తి.

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 సెక్షన్ 13 (2) ప్రకారం పైన పేర్కొన్న **రూ. 24,51,257.11 పై** (అక్షరాలా ఇరవై నాలుగు లక్షల యాభై ఒక్క వేల రెండు వందల యాభై ఏడు రూపాయల పదకొండు పైసలు మాత్రమే) మరియు **ది. 13.08.2024** నుండి భవిష్యత్తు వడ్డీ మరియు ఛార్జీలతో కలిపి ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు చెల్లించవలసి ఉంటుంది. మీరు దానిని పాటించడంలో విఫలమైతే, సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13 (2) క్రింద ఉన్న అన్ని లేదా ఏవైనా హక్కులను వినియోగించుకోవడానికి సెక్యూర్డ్ క్రెడిటార్ అయినటువంటి మేము అర్హులము. చట్టంలోని సెక్షన్ 13 (13) ప్రకారం, నోటీసు అందిన తేదీ నుండి మీరు పైన పేర్కొన్న సెక్యూర్డ్ ఆస్తులను తిరిగి పొందేందుకు బ్యాంక్ ముందస్తు అనుమతి లేకుండా బదిలీ చేయకూడదు. సెక్యూర్డ్ ఆస్తులను అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి, చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) లోని నిబంధనలను దయచేసి గమనించగలరు.

తేది : 30.12.2025 — **అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

స్నేహం, సౌభ్రాతృత్వం చాటిన నారాయణ గురు

- ఆ సిద్ధాంతాలను వక్రీకరించే వారిపట్ల అప్రమత్తత అవశ్యం
- కేరళ సిఎం విజయన్

వర్కాల (కేరళ) : కులమతాలకు అతీతంగా మానవత్వం, ఐక్యత, సౌభ్రాతృత్వం, స్నేహ మార్గాన్ని మానవాళికి చాటి చెప్పిన నిజమైన ప్రపంచ గురువు శ్రీనారాయణ గురు అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అన్నారు. వర్కాలలో ప్రముఖ సాధు-సంఘ సంస్కర్త నారాయణ గురు స్థాపించిన శివగిరి మఠంలో 93వ శివగిరి యాత్రను బుధవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. నారాయణ గురు తాత్వికత యావత్ ప్రపంచ విముక్తికి ఒక దార్శనికతను అందజేసిందన్నారు. ఆధునిక కేరళను రూపొందించడంపైనా ఆయన దార్శనికత ప్రగాఢమైన ప్రభావాన్ని చూపిందని చెప్పారు. గురు తత్వాలను, సిద్ధాంతాలను వక్రీకరించి, హైజాక్ చేసేందుకు యత్నిస్తున్న కొన్ని స్వార్థపూరిత శక్తులపై విజయన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణ గురుని ఒక నిర్దిష్ట మతం లేదా సమాజానికి పరిమితం చేసే ఇటువంటి ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. దేశ రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రగతిశీల శక్తుల దార్శనికతతో నారాయణ గురు సందేశాన్ని అనుసంధానించాల్సిన అవసరముందన్నారు. సమానత్వం, సామాజిక న్యాయాన్ని పరిరక్షించే ప్రగతిశీల ఆశయాలతో గురు బోధనలను సమన్వయం చేయడం, అనుసంధానించడంపై ప్రజాస్వామ్య, లౌకిక రాజ్యాంగ విలువల మనుగడ ఆధారపడి ఉందని అన్నారు. గుర్తింపు ప్రాతిపదికన ప్రజలను విభజించే యత్నాలను ప్రతిఘటించడానికి, నారాయణ గురు బోధనల్లో కీలకమైన ప్రజాస్వామ్య, లౌకిక విలువలను బలోపేతం చేయడానికి సమిష్టి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి ఎస్.సిద్ధరామయ్య, శ్రీ నారాయణ ధర్మ సంఘం ట్రస్ట్ అధ్యక్షుడు సచ్చిఆనంద స్వామీజీ తదితరులు ప్రసంగించారు.

93వ శివగిరి యాత్రను ప్రారంభిస్తున్న పినరయి విజయన్

'ఉక్కు' దిగుమతులపై సుంకాలు

- చౌకైన చైనా ఉత్పత్తులను అడ్డుకునేందుకు కేంద్రం నిర్ణయం

న్యూఢిల్లీ : ఎంపిక చేసిన ఉక్కు ఉత్పత్తులపై కేంద్రప్రభుత్వం మూడు సంవత్సరాలపాటు దిగుమతి సుంకం విధించింది. చైనా నుంచి చౌకగా దిగుమతి అవుతున్న ఉక్కు ఉత్పత్తులకు కళ్లెం వేసేందుకు ప్రభుత్వం బుధవారం ఈ చర్య తీసుకుంది. దీని ప్రకారం... మొదటి సంవత్సరం 12 శాతం, రెండో ఏడు 11.5 శాతం, మూడో సంవత్సరం 11 శాతం సుంకాలు విధిస్తారు. ప్రపంచంలో రెండో అతి పెద్ద ముడి ఉక్కు ఉత్పత్తిదారు అయిన భారత్... చైనా నుంచి తక్కువ ధరతో దిగుమతి అవుతున్న ఉక్కు కారణంగా సమస్యలు ఎదుర్కొంటోంది. చౌకగా లభిస్తున్న చైనా ఉక్కు దేశీయ ఉత్పత్తిదారులపై ఒత్తిడి పెంచుతోంది. భారత్ విధించిన సుంకాలు చైనా, వియత్నాం, నేపాల్ సహా కొన్ని వర్ధమాన దేశాలపై ప్రభావం చూపుతాయి. స్టెయిన్‌లెస్ స్టీల్ వంటి ఉత్పత్తులకు లెవీ వర్తించదు. చౌకగా, నాణ్యత లేకుండా దిగుమతి అవుతున్న ఉత్పత్తుల కారణంగా దేశీయ ఉక్కు పరిశ్రమకు నష్టం వాటిల్లకూడదని సంబంధిత మంత్రిత్వ శాఖ పదేపదే చెబుతోంది. ఇటీవలి కాలంలో దిగుమతులు ఆకస్మికంగా, గణనీయంగా పెరిగాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డిటిజిఆర్) గుర్తించింది. ఈ నేపథ్యంలోనే మూడు సంవత్సరాల సుంకాన్ని సిఫార్సు చేసింది.

నార్తన్ ఎఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్
NORTHERN ARC
నమోదిత కార్యాలయం : 10వ అంతస్తు, ఫేజ్-1, ఐఐటి- మద్రాస్ రీసర్చ్ పార్క్, కనగం గ్రామం, తరమణి, చెన్నై-600113, తమిళనాడు.

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (సర్ఫాసీ) యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

[illegible]

తేది : 01 జనవరి, 2026 — సం/- అధీకృత అధికారి
ప్రదేశం : బాపట్ల — నార్తన్ ఎఆర్‌సి క్యాపిటల్ లిమిటెడ్

హిందూ రక్షాదళ్ పంపిణీకి సిద్ధం చేసిన కత్తులు

ఇంటింటికీ కత్తుల పంపిణీ

- యుపిలో రెచ్చిపోతున్న హిందూ రక్షా దళ్

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో కాషాయమూకలు రెచ్చిపోతున్నాయి. తాజాగా హిందూ రక్షా దళ్ ఘజియాబాద్‌లో ఇంటింటికీ కత్తులను పంపిణీ చేసింది. సోమవారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘజియాబాద్‌లో హిందూ రక్షా దళ్ అధ్యక్షురాలు పింకీ చౌదరి సంస్థ సభ్యుల ద్వారా ఇంటింటికీ కత్తులను పంపిణీ చేశారు. వారు కత్తులను అందిస్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో పోలీసులు కేసు నమోదు చేసి, 10మందిని అరెస్ట్ చేశారు. 46 మందిపై బిఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీస్ కమిషనర్ గార్డెన్ కుమార్ తెలిపారు. దేశ ఐక్యత, సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తున్న శత్రువులపై చర్యలు తీసుకునేవారు ఎవరైనా ఉన్నారా అని సమాజ్ వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ప్రశ్నించారు. హింస అనాగరిక వ్యక్తులను, బలహీనపరిచే శక్తులను కూడా సూచి స్తుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. మత సామరస్యానికి భంగం కలిగించడానికి, మైనారిటీలను భయ భ్రాంతులకు గురిచేయడానికి పశ్చిమ యుపి అంతటా మితవాద సంస్థలు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి షాన్వాజ్ ఆలం మర్శించారు.

'చక్మా'కు న్యాయం చేయండి

- జంతర్‌మంతర్‌లో ఈశాన్య రాష్ట్రాల విద్యార్థుల నిరసన

న్యూఢిల్లీ : డెహ్రాడూన్‌లో త్రిపుర విద్యార్థి అంజెల్ చక్మాను హత్య చేయడాన్ని నిరసిస్తూ దేశ రాజధానిలోని జంతర్ మంతర్ ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, చక్మా హత్యపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ఈశాన్య ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థుల సంఘం (ఎన్ఇఎస్ఎస్‌డియు) ఆధ్వర్యాన జరిగిన ఈ నిరసనలో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో చదువుతున్న వందలాదిమంది ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కేసు విచారణను సిబిఐకి బదిలీ చేయాలని, చక్మా కుటుంబానికి తగిన పరిహారం చెల్లించాలని ఎన్ఇఎస్ఎస్‌డియు అధ్యక్షులు పాయింటింగ్ ధోక్‌చోమ్ డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జాతి వివక్ష, దాడుల నుంచి ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులను రక్షించేందుకు ఒక చట్టం చేయాలని కోరారు. ఈ కేసు దర్యాప్తులో ఉత్తరాఖండ్ ప్రభుత్వం జాప్యం చేస్తుండటం వల్లే ఆందోళన చేయాల్సి వస్తోందని ఎన్ఇఎస్-ఎస్‌డియు ఉపాధ్యక్షులు బిపుల్ చక్మా తెలిపారు. తాను కూడా డెహ్రాడూన్‌లో జాతి వివక్షకు గురయ్యానని, ఇలాంటి ఘటనలు, ఈశాన్య రాష్ట్ర విద్యార్థులపై దుర్మార్గపు దాడులను ఆపాలని కోరుకుంటున్నానని చెప్పారు.

చక్మా హత్యను నిరసిస్తూ జంతర్ మంతర్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉత్తరాఖండ్ పోలీసుల వాదనను ఖండించిన చక్మా కుటుంబం

త్రిపుర విద్యార్థి అంజెల్ చక్మా హత్య ఘటనపై విచారణకు ఉత్తరాఖండ్ పోలీసులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి)ను ఏర్పాటు చేశారు. చక్మా హత్య ఘటనలో ఎలాంటి జాతి వివక్ష కోణం లేదని. ఈ కేసులో ఆరుగురు నిందితులకు ఎలాంటి నేర చరిత్ర లేదని సిట్ తెలిపింది. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మృతుడు చక్మా కుటుంబం ఉత్తరాఖండ్ పోలీసుల వాదనను ఖండించింది. చక్మా తండ్రి మీడియాతో మాట్లాడుతూ తన కుమారుడు జాతి వివక్షను ఎదుర్కొన్నాడని, కత్తితో పొడిచి హత్య చేశారని తెలిపారు. దాడి చేసిన దుండగులు 'చైనీస్ మోమో' అని తన కుమారుడ్ని ఎగతాళి చేసినట్లు చెప్పారు. డెహ్రాడూన్‌లోని ఒక ప్రైవేటు విశ్వవిద్యాలయంలో ఎంబిఎ చివరి సంవత్సరం చదువుతున్న త్రిపురకు చెందిన అంజెల్ చక్మా, అతని సోదరుడు మైఖేల్ చక్మాపై డిసెంబరు 9న సాయంత్రం 6:15 గంటల సమయంలో జాతివివక్ష వ్యాఖ్యలు చేస్తూ కొంతమంది కత్తులతో దాడి చేసిన సంగతి తెలిసిందే. అంజెల్ చక్మా చికిత్స పొందుతూ డిసెంబరు 26న మరణించడంతో దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి.

ఇరాన్‌లో 4వ రోజూ నిరసనలు

- పెరుగుతున్న జీవనవ్యయంపై ప్రజాగ్రహం

టెహ్రాన్ : ఇరాన్‌లో జీవనవ్యయం భరించలేని స్థాయికి చేరడంతో ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంటోంది. బుధవారం వరుసగా నాలుగో రోజు కూడా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. తాజాగా పది విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు కూడా ఆందోళనలో భాగస్వాములయ్యారు. వీటిలో రాజధాని టెహ్రాన్‌లోని ఏడు ప్రతిష్టాత్మక యూనివర్సిటీలు ఉన్నాయి. ఇస్ఫహాన్‌లోని టెక్నాలజీ యూనివర్సిటీలోనూ, యజ్డ్, జన్‌జన్ నగరాలలోని సంస్థలలోనూ నిరసనలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నామని దుకాణ యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ మంగళవారం కార్మిక నేతలతో సమావేశమయ్యారు. ఆర్థిక సంక్షోభ పరిష్కారానికి కొన్ని ప్రతిపాదనలు చేశారు. నిరసనకారుల చట్టబద్ధమైన డిమాండ్లను వినాల్సిందిగా హోం మంత్రిత్వ శాఖను కోరానని ఆయన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

పేపర్ ప్రకటన

**IN THE COURT OF
THE XI ADDL. DIST. JUDGE : TENALI
E.P.No. 50/2020 in AOP NO: 390/2018**
Between
M/s. Shriram City Union Finance Limited, Tenali Branch ...Petitioner
And
1) Shaik Patcha & Others ...JDrs
2) Burle Kanyaka, W/o.Naga Venkata Kishore, Hindu, Age: 60 Years, R/o. D.No. 22-5-07, Sarojini Naidu Street, Kotha T Tenali, JCJC Tenali.
3) Shaik Dariyabi, W/o. Shaik Patcha (Late), Age: 78 Years
4) Shaik Baji, S/o. Shaik Patcha (Late), Age: 52 Years
5) Shaik Kalesha, S/o. Shaik Patcha (Late), Age: 50 Years
Both are Same Address:
Door No.6-15-4, Veera Raghavulu Street, Salt Bazaar, Tenali, Guntur Dist.
ఈ నెంబరు దావాలో 1వ ప్రతివాది అయిన **Shaik Patcha** గారు చనిపోయినందున వారి చట్టబద్ధవారసులు అయినటువంటి **3వ జెడిఆర్ అయిన Shaik Dariyabi, W/o. Shaik Patcha గారికి, 4వ జెడిఆర్ అయిన Shaik Baji, S/o. Shaik Patcha గారికి, 5వ జెడిఆర్ అయిన Shaik Kalesha, S/o. Shaik Patcha** వారికి పై కోర్టు ద్వారా అనేక సార్లు నోటీసులు పంపి ఉన్నాము. తీసుకొనక కాలయాపన చేయుట వలన శ్రీ కోర్టు వారు **JDR3, 4, 5** అయిన మీకు నోటీసు నిమిత్తం ది.22-01-2026 న పేపర్ పబ్లికేషన్ కొరకు వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు ది.22-01-2026న స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టుకు హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. అట్లు కాని యెడల సదరు దావా మీ పరోక్షము నందు విచారించి తీర్మానించ బడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.
యన్.వి.మహేశ్వరరావు, BA (Litt) BL
డిక్రీ హోల్డర్ తరపు న్యాయవాది
పంచామృతం స్ట్రీట్, జయప్రకాష్ నగర్, తెనాలి.

PUB/1674

ప్రెస్ నోటిఫికేషన్
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
రైల్వే భద్రతా కమిషన్

విజయవాడ (BZA) డివిజన్‌లోని VSKP BZA విభాగంలోని ఎలమంచిలి (YLM) స్టేషన్‌లోని టిఆర్. నం. 18189 (TATA-ERS) యుపి ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై 29.12.2025న చట్టబద్ధమైన విచారణ జరుగుతుంది,
సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ నుండి సికింద్రాబాద్‌లోని సౌత్ సెంట్రల్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ శ్రీమతి మాధవి, పైన పేర్కొన్న సంఘటనపై 31.12.2025 మరియు 01.01.2026 తేదీలలో "ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్ (ETTC), విజయవాడ"లో చట్టబద్ధమైన విచారణను నిర్వహిస్తారు.
పైన పేర్కొన్న ప్రమాదం మరియు దానికి సంబంధించిన విషయాలకు సంబంధించి జ్ఞానం ఉన్న ప్రజా సభ్యులు మరియు ఆధారాలు అందించాలనుకునే వారు విచారణ తేదీన పైన పేర్కొన్న స్థలంలో అలా చేయవచ్చు లేదా ఈ క్రింది అధికారిక చిరునామాకు రాయవచ్చు.
రైల్వే సేఫ్టీ కమిషనర్, దక్షిణ మధ్య సర్కిల్, రైల్వే నిర్మాణ్ భవన్, సరోజిని దేవి రోడ్డు, సికింద్రాబాద్ 500025 లేదా ఆమెను 040-27820104 ఫోన్ నంబర్‌లో సంప్రదించండి.

జారీ చేసినది
చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్,
దక్షిణ మధ్య రైల్వే

A2130

ముగిసిన ఖలీదా జియా అంత్యక్రియలు

ఢాకా : బంగ్లాదేశ్ తొలి మహిళా ప్రధాని, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) చీఫ్ ఖలీదా జియాకు వేలాదిమంది ప్రజలు, అభిమానులు అశ్రు నయనాలతో బుధవారం తుది వీడ్కోలు పలికారు. పార్లమెంట్ భవనానికి సమీపంలో అత్యంత గట్టి భద్రతా ఏర్పాట్ల మధ్య ఆమె అంత్యక్రియలు ముగిశాయి. ఖలీదా జియా (80) భౌతిక కాయాన్ని ఆమె భర్త, మాజీ అధ్యక్షుడు జియా వుర్ రెహమాన్ సమాధి పక్కనే ఖననం చేశారు. జాతీయ పతాకం చుట్టిన శవపేటికను ఆమె నివాసం నుండి కాన్వాయ్‌తోపాటు అంత్యక్రియలు జరిగే ప్రదేశానికి తీసుకువచ్చారు. అంతకుముందు మాణిక్ మియా అవెన్యూ వద్ద ప్రార్థనలు జరిగాయి. చీఫ్ అడ్వైజర్ మహ్మద్ యూనస్, చీఫ్ జస్టిస్ జుబయెర్ రహమాన్ చౌదరి, ఖలీదా జియా కుమారుడు, బిఎన్‌పి తాత్కాలిక చైర్మన్ తారిక్ రహమాన్‌సహా పలువురు ప్రముఖులు ఈ ప్రార్థనల్లో పాల్గొన్నారు.

దక్షిణాసియా దేశాల నుంచి పలువురు మంత్రుల రాక

జియా అంత్యక్రియలకు హాజరైన వారిలో భారత్, నేపాల్, భూటాన్, శ్రీలంక, విదేశాంగ మంత్రులు వరుసగా జై శంకర్, బాలానంద శర్మ, లియాన్‌పో దుంగ్యాల్, విజిత హెర్త్ వున్నారు. పాకిస్తాన్ నుండి నేషనల్ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ రాగా, మాల్దీవుల నుండి ఉన్నత విద్యా, కార్మిక శాఖ మంత్రి అలీ హైదర్ అహ్మద్ వచ్చారు. వీరు కాక పలు దేశాల రాయబారులు హాజరయ్యారు.

తారిక్ రెహమాన్‌తో జై శంకర్ భేటీ

కేంద్ర మంత్రి జై శంకర్ బుధవారం ఖలీదా జియా కుమారుడు తారిక్ రహమాన్‌ను ఆమె నివాసంలో కలుసుకుని ఖలీదా జియా మృతికి భారత ప్రభుత్వం తరపున సంతాపం తెలియజేశారు. ప్రధాని మోడీ లేఖను అందజేశారు. రాజీపడని నేతగా పేరొందిన జియా మృతికి దేశం యావత్తు సంతాపం వ్యక్తం చేస్తోందని రహమాన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. 18 ఏళ్ల ప్రవాసం తర్వాత రహమాన్ ఢాకా తిరిగి వచ్చిన సంగతి తెలిసిందే.

బహిరంగ ప్రకటన

ICICI Bank — శాఖ కార్యాలయం : ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10, మైత్రి టవర్, బొమ్మన్ హళ్లి హొసూర్ మెయిన్ రోడ్డు బెంగళూరు-560068

కింది రుణగ్రహీతలు ఐసిఐసిఐ బ్యాంక్ నుండి పొందిన రుణాల అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించడంలో డీఫాల్ట్ అయ్యారు మరియు రుణాలు పని చేయని ఆస్తులు (ఎన్‌పిఎ) గా వర్గీకరించబడ్డాయి. ... ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 సెక్షన్ 13(2) కింద ... అందువల్ల ఈ పబ్లిక్ నోటీసు ద్వారా వారికి తెలియజేయడమైనది.

క్ర సం:	రుణగ్రహీత/సహ రుణగ్రహీత/ హామీదారుల పేర్లు (లోన్ అకౌంట్ నెంబరు) మరియు చిరునామా	ఆస్తుల చేయబడిన సెక్యూర్డ్ ఆస్తి చిరునామా	నోటీసు పంపిన తేదీ/ నోటీసు తేదీ నాటికి బకాయి మొత్తం	ఎన్‌పిఎ తేదీ
1.	[illegible] LBVJW00001758593/ ... 505208.	[illegible]	06.11.2025 Rs. 22,62,952.00/-	30.11. 2018

[illegible]

తేదీ : 01 జనవరి, 2026 — అధీకృత అధికారి
ప్రదేశం : [illegible] — ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరఫున

సమత - మమత

రాజు, రహీమ్, రాబర్ట్ ముగ్గురు ప్రాణ స్నేహితులు. పాఠశాలలో వీరిని ఆర్.ఆర్.ఆర్ అని పిలుస్తారు. ఒకరి ఇంటికి ఒకరు పండుగలకు వెళుతుంటారు. రాబర్ట్ పుట్టినరోజు డిసెంబర్ 25 కావడంతో రాజు, రహీమ్ ఆ రోజు కొత్త బట్టలు వేసుకోవాలని, అవి కూడా ఒకేలాంటివి కావాలని అనుకున్నారు. తల్లిదండ్రులతో చెప్పి ముగ్గురు స్నేహితులు ఒకేలాంటి బట్టలు కొనిపించుకున్నారు. పండుగ మరుసటి రోజు హెడ్ మాస్టర్ పర్మిషన్ తీసుకుని ఆ డ్రెస్ వేసుకుని పాఠశాలకు వెళ్ళారు. వారి ముగ్గురిని చూసి అంతా అన్నదమ్ములు అనుకున్నారు. సోషల్ మాస్టర్ వాళ్లను చూసి 'నిజమైన మిత్రులు మీరు. అసలు లౌకికవాదం మీలోనే కనిపిస్తుంది' అన్నారు. తరగతి గదిలోని మిగిలిన పిల్లలవైపూ చూస్తూ 'పిల్లలూ మీరందరూ కూడా కక్షలు మాని, అసూయాలు విడిచి అందరితో సమతా మమతలతో మెలగాలి. రమ్య, నదియా మీరు ఎప్పుడూ గొడవ పడుతుంటారు. వీళ్ళని చూసి నేర్చుకోండి' అని మందలించారు.

ఆరోజు 'లౌకికవాదం' పాఠం ముగించి 'ఈరోజు మన పాఠానికి మంచి ఉదాహరణ రాజు, రహీమ్, రాబర్ట్' అని మరోసారి ఆ ముగ్గురిని అభినందించారు. అప్పుడు రమ్యతో గొడవ పడే నదియా 'నేను ఏమైనా నీ పట్ల తప్పుగా మాట్లాడి ఉంటే సారీ' అంది. రమ్య కన్నీళ్లు పెట్టుకుని 'లేదు నదియా నేనే నీకు సారీ చెప్పాలి' అంది. ఇద్దరూ చేతులు కలుపుకుంటుంటే 'గుడ్ ఇదే నాకు కావాలి' అన్నారు మాస్టారు. చప్పట్లతో తరగతి గది మా ర్మోగిపోయింది.

– కనుమ ఎల్లారెడ్డి, తాడిపత్రి,
93915 23027.

ఒక కొత్త రోజు నాకు

ఈ రోజు క్యాలెండర్ నవ్వింది
నిన్నటి తేదీ మౌనమైంది
ఈ రోజు కొత్త పేజీ వచ్చింది
అందులో నా పేరు ముందుగా ఉంది!

ఈ రోజు పుస్తకాలు కొత్తగా
పెన్నులు ఇంకా మెరిసిపోతూ
నా చేతులు కూడా కొత్తగా
ఏదో మొదలెట్టాలని అంటున్నది!

నిన్న చేసిన చిన్న తప్పులు
ఈ రోజు నన్ను వెంటాడవు కదా
టీచర్ కూడా నవ్వుతూ అంటూ
'ఈ రోజు నుంచి కొత్తగా చూడు!
మా అమ్మ చెప్పింది మెల్లగా

ఏడాది ఈ రోజు మొదలైంది
నాకు అనిపించింది అప్పుడు
నేను కూడా కొత్తవాడినయ్యానని!

ఈ రోజు పాఠశాలకి వెళ్తే
బ్యాగ్ కూడా తక్కువ బరువు
భయం లేదు మార్కులు లేవు
నవ్వులే నిండిన రోజు ఇది!

ఈ రోజు ఆకాశం కూడా
నిన్నటికంటే నీలంగా ఉంది
నన్ను చూసి నవ్వినట్లు
'నీతోనే మొదలు' అన్నట్లు!

జనవరి అనలేదు ఎవరు
కానీ నాకు అర్థమైంది
ఇది నా కలలకు
మొదటి చిన్న అడుగని!

ఈ రోజు డైరీ తెరవలేదు
ఏమవుతానో రాయలేదు
మనస్సులో మాత్రం గట్టిగా
'నేను బాగుంటాను' అనుకున్న!

ఈ రోజు పండగ కాదు
కానీ పండగలా అనిపించింది
నాకు నేను ఇచ్చుకున్న
కొత్త ఆశల రోజు ఇది!

– ఆరాల నిహాల్ యాదవ్,
5వ తరగతి,
ఎస్ఆర్ఎం స్కూలు, కోదాడ,
సూర్యాపేట జిల్లా.

నేను గీసిన బొమ్మ

కుమ్మరి మహాలక్ష్మి,
6వ తరగతి,
జిల్లా పరిషత్ పాఠశాల, రాంపూర్,
మండలం నిజాంపేట,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కొత్త ఆశల వాకిళ్లలోకి ...

నూతన సంవత్సర శుభాకాంక్షలు!

నేను కొత్త సంవత్సరాన్ని. మంచిముత్యాల్లా మంచుబిందువులు మేళమించిన నేల మీదికి లేలేత కిరణాలతో ఆగమించిన కాల క్రాంతిని. నిన్న రాత్రి నిముషాలు నిముషాలు లెక్కించి, సెకన్ల ముల్లు కదలికలపై కళ్లు నిలిపి... 12 అయ్యేసరికి కేరింతల హోరింతలతో నన్ను ప్రియమారా స్వాగతించిన అందరికీ శుభాకాంక్షలు! అంబరాన్ని తాకే సంబరాలతో అలా ఆహ్వానించని వారికి కూడా శుభాకాంక్షలు!

శుభాకాంక్షలు అంటే అందరికీ మంచి జరగాలని కోరుకోవటం. అందరూ బాగుండాలని ఆకాంక్షించటం. అందరూ బాగుంటే – మనమూ బాగుంటాం. మనం బాగుండడం కోసమైనా అందరూ బాగుండాలి. మన వలె మన పొరుగు వారూ సంతోషంగా ఉండాలని కోరుకోవటం మానవీయ సమాజం లక్షణం. అలాంటి మంచి సమాజమే మీ అందరిలాగానే నాకూ ఇష్టం.

పాత సంవత్సరం వెళుతూ వెళుతూ నాకు కొన్ని సంగతులు నివేదించింది. కొన్ని అనుభవాలను పంచుకొంది. కొన్ని జాగ్రత్తలూ చెప్పింది. అవి నాకే కాదు; మీక్కూడా వర్తిస్తాయి. ఇప్పటికే మీ గమనంలో ఉండి ఉంటాయి. వాటి అనుభవంలో ఈ ఏడాదంతా సాగటమే మనందరి కర్తవ్యం.

మంచిని పెంచుదాం!

కాలం అందరికీ ఉమ్మడిదే అయినా, అనుభవాలు స్థూలంగా రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి సామూహికం, సామాజికం అయితే– రెండోది వ్యక్తిగతం, కౌటుంబికం. గతేడాది వ్యక్తిగతంగా మీరు ఎన్నో సాధించి ఉంటారు. ఎన్నో పాఠాలూ గుణపాఠాలూ నేర్చుకొని ఉంటారు. ఆనందాన్నిచ్చిన అనుభవాలు, సంతోషాన్ని కలిగించిన సందర్భాలూ మిమ్మల్ని ముమ్ముందుకు నడిపించే ఉత్సాహ ప్రేరకాలు అవుతాయి. తలపుల పొరల్లో తళుక్కున మెరిసే శక్తి జనక కేంద్రాలుగా నిక్షిప్తమవుతాయి. వాటిని అవసరమైన ప్రతిసారీ తలచుకొండి. మీ మేలి మలుపుల ప్రయాణంలో మధురిమలుగా దాచుకొండి. సానుకూల విషయాల అవలోకనం పాజిటివ్ ఎనర్జీని ఉత్పన్నం చేస్తుందని మనస్తత్వ పరిశోధకులు చెబుతున్నారు.

ఈ అనుభవాన్ని సామాజికంగా కూడా వర్తింపచేద్దాం. మన చుట్టూ మంచి విషయాలే విస్తరించి ఉంటే– అంతా మంచిగా ఉంటుందని భావిద్దాం. మహాకవి గురజాడ చెప్పినట్టు – 'దేశమును ప్రేమించుమన్నా మంచియన్నది పెంచుమన్నా' అన్న మాటను పాటిద్దాం. దేశాన్ని ప్రేమించటమంటే– మనుషులను ప్రేమించటమని, మంచిని ప్రేమించటమని అర్థం చేసుకుందాం. ఆచరిద్దాం.

సంఘటితంగా కదులుదాం!

సమాజంలో జీవించేవాళ్లు విడివిడిగా కనిపిస్తారు. అదే సమయంలో సామూహికంగానూ ఉంటారు. ప్రతి మనిషికీ ఈ రెండు లక్షణాలూ ఉంటాయి. ప్రతి ఒక్కరికీ రెండు అనుభవాలూ, రెండు ప్రభావాలూ ఉంటాయి. కాబట్టే– 'నా జీవితం నాది, ఎవరెలా పోయినా నాకేం?'; 'మా బతుకు మాది, సమాజంలో ఏం జరిగితే మాకెందుకు?' అని అనుకుంటే– కుదరదు. సమాజంలో జరిగే ప్రతి మార్పూ ప్రతి ఒక్కరి మీదనో ఎంతో కొంత పడి తీరుతుంది. అందువల్ల చెడ్డ మార్పు వొద్దని, మంచి మార్పు కావాలని అందరూ అనుకోవాలి. అలా అనుకొని సమూహంగా, సంఘటితంగా నడవాలి. విడివిడిగా అనుకున్న పనులు జరక్కపోవొచ్చు కానీ, సమూహాలుగా సంకల్పించుకున్న పనులు జరిగి తీరుతాయి. పెద్ద మార్పులు రావాలంటే– పెద్ద పెద్ద సమూహాలుగా కదలాలి. పెద్ద పెద్ద సంకల్పాలు చేసుకోవాలి.

మద్యం, మత్తు వంటివి యువతరాన్ని, తద్వారా సమాజాన్ని నిర్వీర్యం చేస్తున్నాయి. చైతన్య కిరణాల వలె వెలుగులను చిమ్మాల్సిన వారిని మలిగిపోయిన చమురు దీపాల్లా మార్చేస్తున్నాయి. వక్రమార్గాల వైపు, దుష్ట పథాల వైపు మళ్లిస్తున్నాయి. ఇలాంటి దుష్పరిణామాలపై ఎవరికి వారు అప్రమత్తంగా ఉంటూనే– సమూల నివారణకు, నియంత్రణకూ సంఘటితంగా కదలాలి. ఇలాంటి సామాజిక కర్తవ్యాలు ఇంకెన్నో ఉన్నాయి. వీలైనంత మేర విస్తరించి, అనేక గొంతుల్లో మీ గొంతూ కలపండి. మాట్లాడితే పోయేదేం లేదు; మన్ను తిన్న పాములాంటి నిర్వీర్యతనం తప్ప!

విద్వేషాన్ని ఖండిద్దాం

"సమాజంలో విద్వేషం చాపకింద నీరులా పెరుగుతోంది. అది దేశభక్తి పేరుతోనూ, దైవభక్తి పేరుతోనూ పేట్రేగిపోతుంది. జాగ్రత్తగా ఉండమ'ని 2025 మరీ మరీ హెచ్చరించింది. మంచి అన్నది మంచిగానే ఉంటుంది. మంచిగానే వినిపిస్తుంది. మంచిగానే కనిపిస్తుంది. ఆఖరికి మంచి పనితోనే అది వికసిస్తుంది. కానీ, విద్వేషం వంటి చెడు అలా కాదు. మంచిగా కనిపించటానికి దేశభక్తి, దైవభక్తి అనే ముసుగు వేసుకుంటుంది. జాగ్రత్తగా గమనిస్తే అది ముసుగేనని అర్థమైపోతుంది. ఎలాగంటే దాని భాషలో ద్వేషం ఉంటుంది. ఆలోచన కలిగించే మాటల కన్నా ఆవేశం రగిలించే పదాలు వల్లిస్తుంది. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుజులోయ్' అన్న గురజాడ మాటలకు వ్యతిరేకమైన భావాలను పలికిస్తుంది. 'అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నియు మెలగవలెనోయి' అన్న పిలుపునకు భిన్నంగా మతవిద్వేషాలను రాజేస్తుంది. 'దేశభక్తి' అనే గురజాడ గేయాన్ని దగ్గర పెట్టుకొని, ప్రతి మాటనూ తూచి చూడండి. ఆగి ఆలోచించండి. విచ్చిన్నవాదులు, విద్వేషకారులు వెదజల్లుతున్న విషం ఏమిటో తెలిసిపోతుంది. సోషల్ మీడియాలోనూ, దేవాలయ ప్రాంగణాల్లోనూ ఉన్మాదాన్ని పెంచే ప్రచారం ఏం జరిగినా ఊగిపోకండి. 'గని కల్ల నిజము తెలిసిన మనుజుడే పో నీతిపరుడు' అని సుమతీకారుడు చెప్పిన ప్రబోధాన్ని గుర్తు చేసుకొండి.

వర్తమానంలో జీవిద్దాం

గతం ఒక చరిత్ర. ఒక అనుభవం. దానిని పాఠంగా తీసుకోగలం కానీ, గతంలోకి వెళ్లి దేనినీ మార్చలేం. భవిష్యత్తు ఒక ఊహ. ఒక ఆశ. ఒక అంచనా. భవిష్యత్తులో బాగుండాలంటే వర్తమానం మీదుగా ప్రయాణించాలి. ఆ వర్తమానంలో మనం ఉన్నాం. వర్తమానంలోని మంచి చెడ్డలను గాలికొదిలేసి, గతం గురించే మాట్లాడుకోవటం వల్ల, గతంలోనే తలపెట్టుకొని కూచోవటం వల్ల ఉపయోగం లేదు. కొన్ని విద్వేష శక్తులు ఈ పనినే ప్రత్యేకంగా ఒక మిషన్‌లా చేస్తున్నాయి. చరిత్రని తమకిష్టమొచ్చినట్టు వక్రీకరించి, యువతను అందులో శ్లేష్మంలో ఈగల్లా కొట్టుమిట్టాడేలా చేస్తున్నాయి. నేటి యువతరం ముందుకాలపు దూతలు. సుందర భవిష్యత్తు నిర్మాతలు. కాబట్టి నవీనంగా ఆలోచించాలి. మూఢత్వాన్ని, మూర్ఖత్వాన్ని నూరిపోస్తున్న మతోన్మాద శక్తుల బారిన పడకుండా జాగ్రత్త పడాలి. తమ దృష్టికి వచ్చిన ప్రతి సంగతిని తార్కికంగా విశ్లేషించి, అది ఎవరికి లాభమో, ఎవరికి నష్టమో ఆలోచించి, సరైన నిర్ణయం తీసుకోవాలి. విద్య, వైద్యం, ఆర్థికం, వైజ్ఞానికం, సాంస్కృతికం ... ఇలా ప్రతి రంగంలో మంచి మార్పులను ఆకాంక్షించాలి. ప్రతి ఒక్కరూ సరైన విద్యతో, ఉపాధితో వికసించే కార్యాచరణకే ప్రాధాన్యం ఇవ్వాలి.

నేను కాలాన్ని, కాలధర్మం తెలిసిన దానిని.

ఎవరు ఎన్ని చెప్పినా, ఎన్ని చేసినా నన్ను వెనక్కు తిప్పలేరు.

ముమ్ముందుకే పోతాను ప్రతి క్షణం.

వెనకబాటు చరిత్రలు, పురాతన గాథలు, వదిలేసిన చీకటి గుహల్లాంటి అన్ని రకాల దురాచారాలు, దుర్వ్యవస్థలూ... ఎంత అత్తరు చిలకరించినా తాజాగా పరిమళించవు. వర్తమానపు గాలి పీలుస్తూ, వర్తమాన వైజ్ఞానిక శాస్త్రం అందించిన సదుపాయాలు అనుభవిస్తూ ... వెనకటిని కీర్తించేవాళ్లు ప్రస్తుతానికి ద్రోహం చేస్తున్న పలాయనవాదులు. అలాంటి పురాతన విద్వేష వాదాల వల్ల వర్తమానానికి వన్నె రాదు. భవిష్యత్తు తేజరిల్లదు.

వర్తమానాన్ని ప్రేమించేవాళ్లు వర్తమానాన్ని పట్టించుకోవాలి. భవిష్యత్తును కాంక్షించేవాళ్లు వర్తమానాన్ని నిర్మించుకోవాలి.

నేను నేటి కాలాన్ని.

సంపూర్ణంగా మీ చేతిలో ఉన్నదాన్ని.

సద్వినియోగంగా చేసుకొండి సంపూర్ణంగా.

మంచిమార్పులకు పదం కదపండి, నా సాక్షిగా.

మరోసారి శుభాకాంక్షలతో
మీ
ప్రియమైన 2026ని.

- ఎ.ఎల్.పి.ఎస్.సుభాషిణి,
మండపేట, కోనసీమ జిల్లా.

మా చిరునామా రంగవల్లి

మెయిల్ ఐడి : jeevanapageps@gmail.com,
వాట్సాప్ : 83329 25496

'మ్యాజిక్'ని హిట్ చేయండి : మెహర్ రమేష్

'రాజు సత్యం నాకు చాలా మంచి స్నేహితుడు. కీర్తిశేషులు పునీత్‌రాజ్ కుమార్‌తో నేను చేసిన 'వీర కన్నడిగ' చిత్రంలో రాజు నటించాడు. అప్పటి నుంచి మా స్నేహం కంటిన్యూ అవుతూనే ఉంది. ఆయన ఇప్పుడు 'మ్యాజిక్' మూవీని నిర్మించారు. ట్రైలర్ చూశాను. నాకెంతో గ్రిప్పింగ్‌గా అనిపించింది. పూరి గారి చిత్రాల్లో రాజ్ నటించాడు. ఇప్పుడు ప్యాషనేట్ ప్రొడ్యూసర్‌గా మారిపోయారు. బాలీవుడ్ అంతా కదిలి వచ్చి ఈ చిత్రం కోసం సపోర్ట్ చేశారు. హైదరాబాద్‌లోని మరాఠీ ప్రేక్షకులకు కూడా స్క్రీన్స్ ఉంటాయి. ఇక్కడి వారంతా 'మ్యాజిక్' మూవీని చూసి సక్సెస్ చేయాలని కోరుతున్నా' అని దర్శకుడు మెహర్ రమేష్ అన్నారు. టుత్రీ వెంచర్స్ బ్యానర్‌పై రాజు సత్యం నిర్మించిన మరాఠీ చిత్రం 'మ్యాజిక్'. జితేంద్ర జోషి హీరోగా రానున్న ఈ మూవీకి రవీంద్ర విజయ కర్మార్కర్ దర్శకత్వం వహించారు. గురువారంనాడు నూతన సంవత్సరం సందర్భంగా విడుదల చేయబోతున్నారు. ప్రచార కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో చిత్ర యూనిట్ మాట్లాడారు. మహారాష్ట్ర మండలి అధ్యక్షురాలు గీతా, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్, దర్శకుడు మెహర్ రమేష్ హాజరై మాట్లాడారు.

త్వరలో 'ధర్మచక్రం' విడుదల

విఆర్‌పి క్రియేషన్స్ బ్యానర్‌లో పి.పద్మావతి సమర్పణలో తెరకెక్కిన సినిమా 'ధర్మచక్రం'. టాలీవుడ్‌కు చెందిన పలువురు నటులు ఇందులో నటించారు. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసుకున్న ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. ఎడిటర్‌గా నందమూరి హరి, డిఒపి బివిఎస్ కుమార్, సంగీతం శంకర్ మహాదేవ్. రచన, దర్శకత్వ, నిర్మాత వెంకటరమణ పసుపులేటి. సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలో సిఎం చంద్రబాబునాయుడు చేతులమీదుగా ఈ సినిమా ఆడియోను విడుదల చేయించనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

'శిశిరం' మూడో షెడ్యూల్ పూర్తి

లిటిల్ భాను ప్రకాష్, ప్రియాంక, సోమేష్, ప్రసన్న, ప్రీహాన్స్, పుష్ప, వెంకట్ తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తున్న చిత్రం 'శిశిరం'. తెనాలి పరిసర ప్రాంతాల్లో డిసెంబర్ 26న ప్రారంభమైన మూడో షెడ్యూల్ షూటింగ్ 31తో ముగిసింది. శ్రీకృష్ణ ఆర్ట్స్ బ్యానర్‌పై దర్శకుడు కనపర్తి రత్నాకర్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. కొరియోగ్రాఫర్‌గా అమ్మ సుధీర్, డిఒపి మురళీకృష్ణ, అసోసియేట్ డైరెక్టర్ వైఎస్ రెడ్డి, నిర్మాతలు అమిర్నేని వెంకట సాధు చలపతి, అనిల్ మూకిరి, రవి కన్నెగంటి నిర్మాతలు. ఆరురోజులపాటు ఏకధాటిన పలు కీలక ఘట్టాలను చిత్రీకరించారు.

సరికొత్త కథలతో సిద్ధం : అఫ్జల్

'రొటీన్‌కు భిన్నంగా నేను తీసిన 10 రూపీస్, 1000 వాలా, తరుణం వంటి సినిమాలు ప్రేక్షకారణ పొందాయి. త్వరలోనే మరికొన్ని కొత్త ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి. ప్రేక్షకుల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త సంవత్సరం మా సినిమాలు ఉంటాయి. క్లాస్, మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని మంచి సినిమాలు, అందులోనూ సమాజానికి మంచి సందేశాన్ని అందించే సినిమాలు చేస్తా. నిర్విరామంగా సరికొత్త, విభిన్న కథలను తయారు చేస్తూనే పంపిణీ రంగంలోనూ రాణిస్తున్నా' అని దర్శకుడు అఫ్జల్ అన్నారు. పవన్ కళ్యాణ్ ఒజి, ఎన్టీయార్, హృతిక్ రోషన్ కలిసి నటించిన వార్2 చిత్రాలను ఆయన విదేశాల్లో పంపిణీ చేశారు. కొత్త ఏడాదిలో సంక్రాంతికి రాబోతున్న ప్రభాస్ రాజాసాబ్ సినిమాను తెలుగు, హిందీ,తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విదేశాల్లో ఒక ప్రాంతానికి డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు.

సరికొత్తగా 'అనగనగా ఒక రాజు' : నవీన్ పోలిశెట్టి

'ఈ నూతన సంవత్సరం 2026 అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకుంటున్నా. 2024 అనేది నా జీవితంలో క్లిష్టమైన సంవత్సరం. వరుసగా మూడు విజయాలు అందుకున్న తర్వాత అదే ఉత్సాహంలో మీ ముందుకు మరో అదిరిపోయే సినిమాని తీసుకొద్దాం అనుకున్నాను. కానీ, ఒక యాక్సిడెంట్ జరగడం వల్ల నేను షూటింగ్‌కి దూరమయ్యాను. మానసికంగా, శారీరకంగా కోలుకోవడానికి చాలా సమయం పట్టింది. అదే సమయంలో మా బృందంతో కలిసి ఈ 'అనగనగా ఒక రాజు' కథ రాసుకున్నా. 2025 ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలుపెట్టాం. ఆ సమయంలో 'అన్నా సినిమా ఎప్పుడు?' అని చాలామంది మెసేజ్‌లు చేశారు. మీ అందరి ప్రేమ, మద్దతు వల్లే నేను త్వరగా కోలుకోగలిగాను. అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు. మీ అందరి ప్రేమతోనే మేము ఈ సినిమా షూటింగ్‌ని సరదాగా ఆరు నెలల్లో పూర్తి చేయగలిగాం. సినిమా చాలా చాలా బాగా వచ్చింది. ఇంతటి వినోదాత్మక చిత్రాన్ని ఎప్పుడు విడుదల చేద్దామనే చర్చ వస్తే.. సంక్రాంతికి విడుదల చేస్తే బాగుంటుందని మా నిర్మాతలు భావించారు. ఈనెల 14న విడుదల చేస్తున్నాం. ప్రేక్షకులంతా వారి కుటుంబంతో కలిసి చూసి ఆనందించాలని కోరుతున్నా. చిరంజీవి గారి 'మన శంకర వరప్రసాద్ గారు', ప్రభాస్ 'ది రాజా సాబ్'తో పాటు అన్ని సినిమాలు విజయం సాధించాలని కోరుకుంటున్నా' అని కథానాయకుడు నవీన్ పోలిశెట్టి అన్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పించింది. మారి దర్శకత్వం వహించగా మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు. నవీన్ పోలిశెట్టికి జోడీగా మీనాక్షి చౌదరి నటించారు. ప్రచారకార్యక్రమంలో భాగంగా నవీన్ పోలిశెట్టి మాట్లాడారు.

అండర్-15 హైదరాబాద్ ఉమెన్స్ వన్డే కెప్టెన్‌గా రెల్ల వాసి శాన్వి

అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన గుమ్మలక్ష్మీపురం బాలిక

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం (పార్వతీపురం మన్యం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురంలోని రెల్ల గ్రామానికి చెందిన విద్యార్థిని పత్తిక శాన్వి బిసిసిఐ వన్డే ట్రోఫీ హైదరాబాద్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు. జనవరి 2న విజయనగరంలో జరగబోయే బిసిసిఐ ఉమెన్స్ అండర్ -15 విభాగంలో ఆంధ్రా జట్టుతో తలపడనున్నారు. శాన్వి చిన్నప్పటి నుంచి క్రికెట్ పట్ల ఆసక్తి చూపడంతో తల్లిదండ్రులు శిక్షణ ఇప్పించారు. శాన్వి తండ్రి ప్రవీణ్ కుమార్ కూడా క్రికెట్ ఆటగాడు కావడంతో కుమార్తెను ప్రోత్సహిస్తూ హైదరాబాదులోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ శిక్షణ ఇప్పించారు. కోచ్ సాలం బయాస్ అలియాస్ తిలక్ వర్మ ఆధ్వర్యాన రెండేళ్లుగా పలు బాలికల క్రికెట్ పోటీల్లో అండర్ -15 విభాగంలో దేశ విదేశాల్లో పాల్గొని శాన్వి మంచి ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో బిసిసిఐ ఉమెన్స్ సెలక్షన్ కమిటీ చైర్మన్, సెలక్టర్లు హైదరాబాద్ జట్టుకు బాధ్యతలు అప్పగించారు. శాన్వి కెప్టెన్‌గా ఎంపిక కావడం పట్ల కుటుంబీకులతో పాటు గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థిని తొమ్మిదో తరగతి చదువుతూ క్రికెట్‌లో రాణించడం విశేషమని, మరింత ప్రోత్సాహంతో ఉత్తమ సేవలు అందించాలని కోరారు.

ఆంధ్రజట్టుకు మళ్లీ నిరాశ

సౌరాష్ట్ర చేతిలో 74పరుగుల తేడాతో ఓటమి

బళ్లారి(కర్ణాటక): విజయ్ హజారే వన్డే టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు వరుసగా రెండో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. సౌరాష్ట్రతో బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు 74 పరుగుల తేడాతో పరాజయాన్ని చవిచూసింది. సింగనహళి మైదానంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సౌరాష్ట్ర జట్టు నిర్ణీత 50ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 254పరుగులు చేయగా.. ఛేదనలో ఆంధ్రప్రదేశ్ జట్టు 47.2ఓవర్లలో 180పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బ్యాటర్లు జ్ఞానేశ్వర్(33), నితీశ్‌కుమార్ రెడ్డి(30), కలిదిండి రాజు(30) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. సౌరాష్ట్ర బౌలర్లు అంకుర్ పన్వార్(5/27) ఆంధ్రను కట్టడి చేశాడు. ఈ ఓటమితో ఆంధ్ర జట్టు గ్రూప్-డిలో నాలుగు మ్యాచ్‌లు ముగిసేసరికి కేవలం ఒక విజయంతో 7వ స్థానంలో ఉంది. ఆంధ్ర జట్టు 3న గుజరాత్‌తో తలపడనుంది.

భారీ లక్ష్యానికి చేరువై ఓడిన హైదరాబాద్

ఇక ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్ జట్టు బరోడా నిర్దేశించిన 418పరుగుల భారీ లక్ష్యానికి చేరువై ఓటమిపాలైంది. రాజ్‌కోట్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో బరోడా జట్టు తొలుత బ్యాటింగ్‌కు దిగి 50ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 417పరుగుల భారీస్కోర్ నమోదు చేసింది. అమిత్(127), నిత్య పాండ్యా(122), కృనాల్ పాండ్యా(109నాటౌట్) సెంచరీలతో రాణించారు. హైదరాబాద్ బౌలర్ చామ మిలింద్‌కు రెండు, వరుణ్ గౌడ్, త్యాగరాజన్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హైదరాబాద్ జట్టు 49.5ఓవర్లలో 380పరుగులకు పరిమితమైంది. అభిరథ్‌రెడ్డి(130), ప్రగ్నయ్(113) సెంచరీలతో రాణించగా.. బరోడా బౌలర్లు మహేశ్, అతీత్ శేత్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. శనివారం జరిగే లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు ఛండీగడ్‌తో తలపడనుంది.

63పరుగులకే కుప్పకూలిన జమ్ముకాశ్మీర్

ఎలైట్ గ్రూప్-బిలో జమ్ముకాశ్మీర్ జట్టు బెంగాల్ బౌలర్ల ధాటికి 63పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని బెంగాల్ జట్టు 9.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. ఇక టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ ప్రాతినిధ్యం వహించిన ఢిల్లీ జట్టు 79పరుగుల తేడాతో ఒడిషా చేతిలో ఓటమిపాలైంది. ఒడిషా 50ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 272పరుగులు చేయగా.. ఛేదనలో ఢిల్లీ 193పరుగులకే కుప్పకూలింది.

వేలం బరిలో అమన్ సెహ్రావత్

- రూ.18లక్షలతో కనీస ధరతో నమోదు
- మహిళల కేటగిరిలో రూ.10లక్షలకు అంతిమ్
- 3న ప్రొ రెజ్లింగ్ లీగ్ వేలం
- 15నుంచి టోర్నీ ప్రారంభం

అమన్ సెహ్రావత్

ముంబయి: పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత అమన్ సెహ్రావత్ ప్రొ రెజ్లింగ్ వేలం రేసులో నిలిచాడు. అతడు కనీస ధర రూ.18లక్షలతో వేలం రేసులో ఉన్నాడు. దీంతో అతడు అత్యంత ఖరీదైన దేశీయ ఆటగాడిగా బేస్ ప్రైజ్ రేసులో నిలిచాడు. ఇక రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత యుయ్ సుసాకీ, యుస్నీ లీస్ గుజ్మాన్ లోపెజ్ కూడా ఈసారి జరిగే రెజ్లింగ్ వేలం రేసులో ఉన్నాడు. ప్రొ రెజ్లింగ్ వేలం జనవరి 3న జరగనుండగా.. ఆటగాళ్లను కొనుగోలు చేసుకొనేందుకు ఆరు ఫ్రాంఛైజీలు మెగా వేలంలో పాల్గొనున్నాయి. ఒక ప్రొ రెజ్లింగ్ టోర్నమెంట్ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరగనుంది. రాబోయే సీజన్‌లో హర్యానా థండర్స్, టైగర్స్ ఆఫ్ ముంబై దంగల్స్, పంజాబ్ రాయల్స్, మహారాష్ట్ర కేసరి, ఢిల్లీ దంగల్ వారియర్స్ మరియు యుపి డామినేటర్స్ ఫ్రాంఛైజీలు రెజ్లింగ్ టోర్నీలో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అధిక బరువుతో భారత రెజ్లింగ్ సమాఖ్య నిషేధం విధించగా.. ఆ నిషేధం తాజాగా ముగిసింది. అమన్ ఇటీవలికాలంలో సంచలన విజయాలు, అద్భుత ప్రదర్శనతో అదరగొడుతున్నాడు. ఒలింపిక్స్, ఆసియా క్రీడల్లోనూ అమన్ పతకాలు కొల్లగొట్టాడు. కామన్వెల్ క్రీడల పతక విజేత దీపక్ పునియా, నవీన్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలువగా.. అత్యుత్తమ రెజ్లర్లలో ఒకరైన సుజీత్ కల్కల్ రూ.7లక్షలతో కనీస ధరతో వేలం బరిలో దిగాలని నిర్ణయించుకున్నాడు. భారత్ వేదికగా జరిగే ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో విదేశీ రెజ్లర్లదే హవా. మాజీ ప్రపంచ, యూరోపియన్ ఛాంపియన్, రష్యాకు చెందిన అబాస్గిడ్జి మాగోమెడోవ్ రూ.10లక్షల కనీస ధరతో, ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ ఆర్మేనియాకు చెందిన అర్మాన్ ఆండ్రియాస్యన్, పారిస్ ఒలింపిక్స్‌లో 5వ స్థానంలో నిలిచిన, 2023 ప్రపంచ ఛాంపియన్, హంగేరీకి చెందిన ఇజ్మాయిల్ కూడా రూ.10ల బేస్ ధరతోనే వేలం బరిలో దిగనున్నారు.

ఇక మహిళల విభాగంలో అంతిమ్ పంగల్ రూ.10లక్షల బేస్ ధరతో వేలం రేసులో నిలిచింది. దీంతో ఈ విభాగంలో భారత్ తరపున అత్యధిక బేస్ ధరతో రిజిస్టర్ చేసుకున్న తొలి రెజ్లర్‌గా అంతిమ్ పంగల్ నిలిచింది. ఇక ఆషూ మాలిక్, జాతీయ ఛాంపియన్ స్మృతి షిండే రూ.10లక్షల బేస్ ధరతో వేలం బరిలో దిగనుండగా.. ఒలింపిక్ ఛాంపియన్, జపాన్‌కు చెందిన యూ రూ.18లక్షలతో వేలం బరిలో దిగుతోంది. క్యూబా, ఉక్రెయిన్, అజర్‌బైజాన్, రష్యా రెజ్లర్లు కూడా భారత్ వేదికగా జరిగే ప్రొ రెజ్లింగ్ వేలం కోసం రిజిస్టర్ చేయించుకున్నారు. వీరంతా కనీస ధర రూ.5లక్షల నుంచి 10 లక్షలలోపు రిజిస్టర్ చేయించుకున్నారు.


అంతిమ్ పంగల్

ఐక్యతే ఆయుధంగా ఆధిపత్య వర్గాలపై పోరు

- డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ పిలుపు
- సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారులు మన శత్రువులు
- శ్రామికవర్గంపై మోడీ ప్రభుత్వం తీవ్ర దాడి
- ప్రతిఘటనోద్యమాలకు సంపూర్ణ మద్దతు
- విశాఖపట్నంలో ఉత్తేజభరితంగా ప్రారంభమైన సిఐటియు 18వ అఖిల భారత మహాసభ

ప్రతినిధుల సభనుద్దేశించి మాట్లాడుతున్న డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

ప్రస్తుతం ప్రపంచంలో సామ్రాజ్యవాద ప్రేరేపిత యుద్ధ ఆర్థిక సిద్ధాంతం అమల్లో ఉందని, ఆ విధానాల వలన ఉత్పత్తిలో నిజంగా భాగస్వాములైన శ్రామికులు బాధితులవుతున్నారని, ప్రపంచ కార్మిక ఐక్యతతో శత్రువులను ప్రతిఘటించాలని ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యుఎఫ్‌టియు) ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ పిలుపునిచ్చారు. కార్పొరేట్ ఆధిపత్య వర్గాలు తమ దోపిడీని తీవ్రతరం చేసేందుకు కార్మికుల హక్కులపై పాశవిక దాడులు జరుపుతున్నాయని చెప్పారు. నయా-ఉదారవాద చట్రంలో అంతర్భాగమైన భారతదేశంలోని ప్రభుత్వం కార్మికుల హక్కుల హననానికి పాల్పడుతోందన్నారు. కార్మిక వ్యతిరేక ప్రజా కంటక విధానాలను తిప్పికొడుతూ ఇక్కడ కార్మిక-కర్షక ఐక్య పోరాటాలు జరగడం హర్షణీయమని, అందుకు సిఐటియు కీలకంగా వ్యవహరించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇక్కడి ఎయు కన్వెన్షన్ హాల్‌లో ఐదు రోజుల పాటు జరిగే సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) 18వ అఖిల భారత మహాసభ బుధవారం ఉత్తేజభరితంగా ప్రారంభమైంది. కార్మిక ఉద్యమ నేతల, ప్రతినిధుల నినాదాల నడుమ సిఐటియు అఖిల భారత అధ్యక్షులు కె హేమలత మహాసభ ప్రారంభ సూచికంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ప్రారంభ సభకు ఆమె అధ్యక్షత వహించారు. మహాసభ జరుగుతున్న ఎయు కన్వెన్షన్ హాల్‌కు కామ్రేడ్ అనతలవొట్టం ఆనందన్ నగర్‌గా, మహాసభ ప్రధాన వేదికకు వాసుదేవ ఆచార్య-ఎంఎం లారెన్స్ మంచ్‌గా నామకరణం చేశారు. మహాసభ నుద్దేశించి డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ ప్రసంగించారు. ఆయన ఏమన్నారంటే...

ప్రపంచ భౌగోళిక ఆర్థిక రాజకీయ ఆధిపత్య పోరు ప్రపంచ శాంతి, భద్రతలకు ప్రత్యక్ష ముప్పుగా పరిణమించిన నేపథ్యంలో, అణు విధ్వంస భయాల సమయంలో సిఐటియు మహాసభ జరుగుతోంది. సామ్రాజ్యవాద యుద్ధాలు, జోక్యాలు, ఆంక్షలు, దిగ్బంధనాలు మరింత తీవ్రమవుతున్నాయి. పెట్టుబడిదారీ సంక్షోభ తీవ్రతను కార్మికులు ఎదుర్కొంటున్నారు. కార్మికుల హక్కులపై, వారు పోరాడి సాధించుకున్న విజయాలపై కొత్త దాడులు విచ్చలవిడిరూపం దాల్చాయి. మరింతగా కార్మికుల దోపిడీకి అనుకూలించే విధానాల రూపకల్పన జరుగుతోంది. రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం పెరుగుతున్నాయి. యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీకి, పర్యావరణ క్షీణతకు ప్రభుత్వాల చర్యలు ఊతమిస్తున్నాయి. కార్మికవర్గంపై ఆధిపత్యవర్గ, మితవాద పాలకుల నియంతృత్వం తీవ్రమైంది. క్యూబా, వెనిజులా, లాటిన్ అమెరికాలో కార్మికుల పోరాటాలను సామ్రాజ్యవాద దేశాలు తమ జోక్యంతో నిర్వీర్యం చేయప్రయత్నిస్తున్నాయి. ఇదే సమయంలో కార్మికులు చేతులు కట్టుకొని కూర్చోలేదు. పలుదేశాల్లో కార్మికుల నుంచి ప్రతిఘటనోద్యమాలు ఉధృతమయ్యాయి.

పాలస్తీనాకు సంఘీభావం

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధం పాలస్తీనా జాతిని తుడిచిపెట్టే మహా మారణహోమంగా పాంబిస్ క్రిరిట్సిస్ పేర్కొన్నారు... అమెరికా, యూరోపియన్ యూనియన్, నాటో మిత్ర దేశాల ప్రోద్బలంతోనే గాజాపై ఇజ్రాయిల్ ఈ దురాక్రమణపూరిత దాడికి తెగబడుతోంది. సామ్రాజ్యవాద అమెరికా, ఇయు, నియంత్రణలు, ఆంక్షలు, వాటి పర్యవేక్షణలోని కాల్పుల విరమణ వల్ల శాశ్వత శాంతి స్థాపన జరగదు. తూర్పు జెరూసలెం రాజధానిగా 1967కి ముందున్న సరిహద్దులతో పాలస్తీనా దేశం ఏర్పాటే సమస్యకు పరిష్కారం. అది సాకారమయ్యే వరకు డబ్ల్యుఎఫ్‌టియు అండ పాలస్తీనీయులకు కొనసాగుతూనే ఉంటుంది. ప్రపంచ కార్మిక వర్గం పాలస్తీనీయుల న్యాయసమ్మతమైన పోరాటానికి మద్దతివ్వాలి.

సిఐటియుది ఘనమైన చరిత్ర

మహాసభ జరుపుకుంటున్న సిఐటియుకు భూగోళంపైనున్న 133 దేశాలకు చెందిన 10.5 కోట్ల మంది సభ్యులు కలిగిన కార్మిక సంఘాల తరపున పాంబిస్ కిరిట్సిస్ సమరశీల శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు. సిఐటియు తమ డబ్ల్యుఎఫ్‌టియులో ప్రధాన సభ్యత్వం కలిగి ఉందని చెప్పారు... సామ్రాజ్యవాదానికి, నయా ఉదారవాద, మితవాద రాజకీయాలకు వ్యతిరేకంగా సిఐటియు నికరంగా నిలబడి పోరాడుతోంది. భారతదేశంలో సరళీకరణ విధానాలు, కార్మిక చట్టాల్లో మార్పులు, దూకుడుగా ప్రయివేటీకరణ, కార్మికులు, పెన్షనర్లపై ప్రతికూల ప్రభావం కలిగిస్తున్నాయి. ఉద్యోగ భద్రత, ట్రేడ్ యూనియన్ల రక్షణ, ప్రజాస్వామ్య హక్కులపై దాడులను తీవ్రంగా పరిగణించిన కార్మిక వర్గం ఐక్య ఉద్యమాలు చేస్తోంది. 2025 నవంబర్ 26 నాటి దేశ వ్యాప్త సమ్మెలో భారీ ప్రజా సమీకరణ ప్రశంసనీయమైనది. లేబర్ కోడ్స్ ఉపసంహరణ కోసం ఫిబ్రవరి 12న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి. ఈ సమ్మెకు డబ్ల్యుఎఫ్‌టియు మద్దతిస్తోంది. డబ్ల్యుఎఫ్‌టియు అంతర్జాతీయ మహాసభ 2027లో శ్రీలంక రాజధాని కొలంబోలో జరగనున్నది. ఢిల్లీలో 13వ కాన్ఫరెన్స్ 2000లో జరిగింది. ఇన్నేళ్ల తర్వాత ఆసియాలో జరగబోతున్న మహాసభను జయప్రదం చేయాలన్నారు. పారిస్‌లో అక్టోబర్ 3న సిఐటియు సహా వివిధ దేశాల నుంచి 350 మంది ప్రతినిధులు ఒక వేదికపైకి చేరి 80 ఏళ్ల ట్రేడ్ యూనియన్ ఉద్యమ గొప్పతనంపై చర్చించడం జరిగింది. భారతదేశంలో ఇతర తమ ఫెడరేషన్ సంఘాలతో కలిసి కార్మిక పోరాటాలను ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని విధాలా అండదండలందిస్తాం... అన్నారు... ప్రారంభ సభలో సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్.. దేశంలో నెలకొన్న పరిస్థితులను వివరించారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్-మతతత్వ విధానాలు అమలు చేస్తోందన్నారు. కార్మిక వర్గంపై ఎడాపెడా దాడులు చేస్తోందని చెప్పారు. జాతి రక్షణ- ప్రజల రక్షణ నినాదాలతో కార్మికవర్గం నాయకత్వంలో పోరాటాలు ఉధృతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని, ప్రభుత్వ రంగంలో విశాఖ ఉక్కు కొనసాగేలా సమరశీల పోరాటాలు నిర్వహించాలనే రెండు తీర్మానాలను సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రారంభ సభలో పాల్గొన్న ఇతర ట్రేడ్ యూనియన్ నేతలు సౌహార్ద సందేశాలిచ్చారు. తొలుత మహాసభ ఆహ్వానసంఘం ఛైర్మన్ సిహెచ్ నర్సింగరావు స్వాగతోపన్యాసం చేశారు. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవగీతాలు ఆలపించారు.

ప్రాంగణానికి అనతలవట్టం ఆనందన్ నగర్‌గా నామకరణం

- వేదికకు ఎంఎం లారెన్స్, బాసుదేవ ఆచార్య మంచ్‌గా పేరు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి అనతలవట్టం ఆనందన్ నగర్

సిఐటియు 18వ అఖిలభారత సభా ప్రాంగణం (ఏయూ కన్వెన్షన్ హాలు) కు కేరళకు చెందిన అనతలవట్టం ఆనందన్ నగర్ గా నామకరణం చేశారు. అనతలవట్టం ఆనందన్ కొబ్బరి కార్మికుడిగా ప్రారంభించి, ఆయన కొబ్బరి కార్మికులు, ప్రెస్ కార్మికులు, సామిల్ కార్మికులు, ప్రైవేట్ రవాణా కార్మికులు, కల్లు గీత కార్మికులు సెరికల్చర్ ఉద్యోగులు, ఎస్ ఐడిసిఓ ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. కెఎస్ఆర్ టి ఇ ఎ, కేరళ ఫైనాన్షియల్ గోర్పొరేషన్ ఆఫీసర్స్ అసోసియేషన్ సహా అనేక ప్రధాన సంఘాలకు ఆయన అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో మహాసభల ప్రాంగణానికి 'అనతలవట్టం ఆనందన్ నగర్ గా నామకరణ చేశారు. సభా వేదికకు 'ఎం ఎం లారెన్స్, బాసుదేబ్ అచయా' మంచ్ అని పేరు పెట్టారు. ఎం ఎం లారెన్స్ అనుభవజ్ఞుడైన ట్రేడ్ యూనియన్ నాయకుడు, సైటియు మాజీ జాతీయ ఆఫీస్ బేరర్ గాను, కేరళ రాష్ట్ర సిఐటియు ప్రధాన కార్యదర్శిగా కార్మిక వర్గానికి విశేష సేవలందించారు. 18 సంవత్సరాల వయస్సులో తన రాజకీయ

అనతలవట్టం లారెన్స్ బాసుదేవ

కార్యకలాపాలను ప్రారంభించిన ఆయన స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు. మాన్యువల్ స్కావెంజర్లను నిర్వహించడం ద్వారా తన ట్రేడ్ యూనియన్ జీవితాన్ని ప్రారంభించాడు. కొచ్చిన్ పోర్ట్ లేబర్ యూనియన్ సహా అనేక ఇతర సంస్థలకు అధ్యక్షుడిగా కూడా పని చేశారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల నుంచి జైలు శిక్ష, హింసను అనుభవించాడు, ఇడుక్కి నుండి లోక్‌సభకు ఎన్నికయ్యారు. పశ్చిమబెంగాల్ కార్మిక నేత ఆరుసార్లు లోక్‌సభకు ఎన్నికైన బాసుదేవ ఆచార్య పేరును కూడా ఈవేదికకు పెట్టారు.

అమరవీరులకు సంతాపం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి బి అనతలవట్టం ఆనందన్ నగర్

జీవితాంతం కార్మికవర్గం కోసం, ప్రజల కోసం పోరాడి, ఇటీవల కాలంలో మరణించిన నాయకులకు, కార్యకర్తలకు సిఐటియు 18వ అఖిల భారత మహాసభ నివాళులు అర్పించింది. సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసింది. పార్టీ నేతగా, రాజ్యసభ సభ్యుడుగా ఆయన కార్మికవర్గ స్వరాన్ని శక్తివంతంగా వినిపించారని గుర్తు చేసుకొంది. కేరళ మాజీ ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు విఎస్ అచ్యుతానందన్, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేబ్ భట్టాచార్య, సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షుడు అనతలవట్టం ఆనందన్, ఎంఎం.లారెన్స్ (సిఐటియు రాష్ట్ర కార్యదర్శి, కేరళ), కనై లాల్ బెనర్జీ, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి నీలిమా మైత్రా, సరోజిని బాలానందన్, కమ్యూనిస్ట్ నాయకురాలు మహారాణి కోనార్, కెఎం తివారీ, నేపాల్‌దేబ్ భట్టాచార్య, ఎవి రస్సెల్, కింకర్ పోషక్, ఎంఎన్ ప్రసాద్, పి.లాలాజీ బాబు, సుధామోయ్ మజుందార్ (పాను మజుందార్), శివశంకర్ సింగ్, పి.అనంతరామ శర్మ, జి.రఘుపాల్, సుజిత్ ముఖర్జీ, కులకర్ణి, హరీష్ నాయక్, ఎం.కరుణమ్మోర్తిల, శ్యామా ప్రసాద్ రాయ్, అంజు ఛటర్జీ, బాబాజీ పరిద్, చింతకాయల బాబూరావు, ఆర్.సత్యనారాయణ రాజు, మిథిలేష్ సింగ్‌లకు నివాళులు అర్పిస్తూ సంతాప తీర్మానాన్ని సిఐటియు అఖిల భారత కోశాధికారి ఎం.సాయిబాబు ప్రవేశపెట్టారు. మహాసభ సంతాపం ప్రకటించి, అమరవీరుల స్ఫూర్తితో పోరాటం సాగిస్తామని ప్రతిన పూనింది.

అమరవీరులకు సంతాపం తెలుపుతున్న నేతలు

సంక్షోభంలో పెట్టుబడిదారీ వ్యవస్థ

- ప్రత్యామ్నాయం కోసం పోరాటం
- కార్యదర్శి నివేదికలో తపన్ సేన్

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి అనతలవట్టం ఆనందన్ నగర్

కార్మిక పోరాటాల్లో సిఐటియు స్వతంత్ర జోక్యం పెరగాలని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. అలాగే ఉమ్మడి పోరాటాల్లోనూ సిఐటియు తనదైన పాత్ర పోషించాలని సూచించారు. కార్మిక సమస్యల పరిష్కారానికి ఉద్యమమే మార్గమని, షార్ట్ కట్ మార్గాలు లేవని అన్నారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభలో బుధవారం ఆయన కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. "మోడీ సర్కార్ ఏకపక్ష నిర్ణయాలతో అన్ని రంగాలూ కుదేలవుతున్నాయి. పార్లమెంట్లో బిల్లులపై ఎటువంటి చర్చా లేకుండానే ఆమోదిస్తున్నారు. కీలకమైన బిల్లులపై కనీస సంప్రదింపులు కూడా జరగటం లేదు. ఇటీవల న్యూక్లియర్ బిల్లు, ఉపాధి హామీని నిర్వీర్యం చేసే బిల్లుతో సహా అనేక కీలక బిల్లులను చర్చ లేకుండానే ఆమోదించారు." అని వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై తీవ్రమైన దాడి జరుగుతోందని, దీన్ని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)తో దేశానికి వచ్చిన దానికంటే, దేశం నుంచి వెళ్లిపోయిందే ఎక్కువని అన్నారు. మోడీ సర్కార్ మాత్రం ఎఫ్‌డిఐలతో ఏదో మేలు జరుగుతున్నట్టు ప్రచారం చేస్తుందని విమర్శించారు. "దేశంలో ఉపాధి రంగం కుదేలవుతోంది. 2.8 లక్షల పార్ట్‌టైం ఉద్యోగాలు వస్తే, 6.8 లక్షల శాశ్వత ఉద్యోగాలు ఊడిపోయాయి. మోడీ హయాంలో నిరుద్యోగం ఎన్నడూ లేనంతగా పెరిగింది." అని అన్నారు. సిఐటియు ఆధ్వర్యాన దేశవ్యాప్తంగా పోరాటాలు పెరిగాయని, మరింత పెరగాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్మికవర్గం పట్ల బిజెపి పాలకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, ఉత్తరప్రదేశ్‌లో వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన సిఐటియు నాయకుడిని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం అరెస్టు చేసి 22 రోజుల పాటు జైల్లో ఉంచిందని విమర్శించారు. తమిళనాడులో 15 బహుళజాతి కంపెనీ (ఎంఎన్‌సి)ల్లో సమ్మెలు జరిగాయని, అందులో 95 శాతం విజయవంతం అయ్యాయని వివరించారు. కర్నాటకలో ఎంఎన్‌సిల్లో చాలా ప్రాంతాల్లో సమ్మె జరిగాయని తెలిపారు.

"మనం సంఘటిత, అసంఘటిత, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలపై మరింత దృష్టి పెట్టి పని చేయాలి. శాశ్వత రంగంలో ఉద్యోగుల సంఖ్య తగ్గుతుండగా, కాంట్రాక్ట్ రంగంలో పెరుగుతోంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా దాదాపు 70 శాతం వరకు కాంట్రాక్ట్ కార్మికులతోనే పని నడుస్తోంది. కనుక కాంట్రాక్ట్ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి పని చేయాలి." అని తపన్‌సేన్ అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో ఉందని, ప్రత్యామ్నాయ విధానాల కోసం పోరాడాలని అన్నారు. 2020లో ఆమోదించిన లేబర్ కోడ్ బిల్లును 2025 వరకు నోటిఫై చేయకపోవడానికి ప్రధాన కారణం దేశంలోని కార్మిక పోరాటాలే అని పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంక్షోభ సమయంలో మన ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని, సంఘం బలోపేతానికి పని చేయాలని సూచించారు. హిందుత్వ మతోన్మాదంపై ప్రచారం కూడా కీలకమైనదని అన్నారు. కార్మిక పోరాటాలను విచ్ఛిన్న చేయడమే మతోన్మాదం లక్ష్యమని పేర్కొన్నారు. కాబట్టి, దీనికి వ్యతిరేకిస్తూ ఉద్యమానికి కార్మికులను సమాయత్తం చేయాలని అన్నారు.

మహాసభ నిర్వహణకు కమిటీలు

అనతలవట్టం ఆనందన్ నగర్ నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు 18వ అఖిల భారత మహాసభ నిర్వహణకు నాలుగు కమిటీలను మహాసభ ఎన్నుకుంది. మొత్తం కార్యవర్గం స్టీరింగ్ కమిటీగా వ్యవహరిస్తోంది.

అధ్యక్ష వర్గం : కె హేమలత (అధ్యక్షులు), ఎకె పద్మనాభన్, టిపి రామకృష్ణన్, ఎ సౌందరరాజన్, జె మెర్సీకుట్టి అమ్మ, సుభాష్ ముఖర్జీ, మానిక్ డే, డిఎల్ కరడి, మాలతి చిట్టిబాబు, ఎస్ వరలక్ష్మి, బిష్ణు మహంతి, చుక్క రాములు, జి బేబిరాణి, ఆర్ లక్ష్మయ్య

అర్హతల కమిటీ : ఎం సాయిబాబు (కన్వీనర్), కెఎన్ గోపీనాథ్ (కేరళ), సోమనాథ్ భట్టాచార్య (పశ్చిమ బెంగాల్), కెసి గోపీకుమార్ (తమిళనాడు), జె వెంకటేష్ (తెలంగాణ), భన్వర్ సింగ్ (రాజస్థాన్), బిఎస్ రావత్ (ఆలిండియా కేంద్రం), సుశాంత ఘోష్ (ఆలిండియా కేంద్రం), అంజు మైని (ఆలిండియా కేంద్రం), జయ్ ప్రకాష్ (ఆలిండియా కేంద్రం)

తీర్మానాల కమిటీ : పి నందకుమార్ (కన్వీనర్), ఎఆర్ సింధు, ఆర్ కరుమలైయన్, కెఎన్ ఉమేష్, సుదీప్ దత్తా, అనాది సాహు, మీనాక్షి సుందరం, తపన్ శర్మ, ప్రమోద్ ప్రదాన్

మినిట్స్ కమిటీ : దీపా కె రాజన్ (కన్వీనర్), లలిత్ మిశ్రా, హరిలాల్ (కేరళ), స్టాయనారాయణ (తమిళనాడు), అశోక్ గుహ (పశ్చిమ బెంగాల్), పద్మశ్రీ (తెలంగాణ), పూషన్ భట్టాచార్య (మధ్యప్రదేశ్), విజేందర్ మెహ్రా (హిమాచల్‌ప్రదేశ్), పివి అనియన్



ఆకట్టుకుంటున్న కళాకృతి

బిజెపిని తరిమికొట్టాలి

సంఘీభావం తెలుపుతున్న వివిధ సంఘాల నేతలు

వివిధ సంఘాల సౌహార్ద సందేశాలు

అనతలవట్టం ఆనందన్ నగర్ నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు 18 అఖిల భారత మహాసభ విజయవంతం కావాలని పలు కేంద్ర కార్మిక సంఘాలు ఆకాంక్షించాయి. బుధవారం విశాఖపట్నంలోని అనతలవట్టం ఆనందన్ నగర్‌లో ప్రారంభమైన మహాసభలో ఎఐటియుసి, టియుసిసి, ఎస్ఇడబ్ల్యుఎ, ఎఐసిసిటియు, యుటియుసి, ఐఎన్‌టియుసి, ఐద్వా తదితర సంఘాల నాయకులు తమ సౌహార్ద సందేశాలిచ్చారు.

పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఐఎన్‌టియుసి జాతీయ నాయకులు రాజశేఖర్

కేంద్రం లోని మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థ లను 100 శాతం ప్రైవేటీకరిస్తోందనిఐఎన్‌టియుసి జాతీయ నాయకులు రాజశేఖర్ అన్నారు. సిఐటియు మహాసభలో సౌహార్ద సందేశమిచ్చిన ఆయన ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం ఉద్యోగులు, కార్మికులు చేసే అన్ని పోరాటాలకు తమ సంఘం మద్దతిస్తుందని చెప్పారు.

ప్రైవేటీకరణ, లేబర్ కోడ్లపై ఐక్య పోరు: అమర్‌జిత్ కౌర్

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ మాట్లాడుతూ, మహాసభలో ప్రవేశపెట్టిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి, లేబర్ కోడ్లను రద్దు చేయాలన్న మహాసభ తీర్మానాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. నాడు బ్రిటిష్ వలసవాదానికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడితే, జనసంఘ్, ఆర్ఎస్ఎస్ మాత్రం బ్రిటిష్ వారికి ఊడిగం చేశాయని ఆమె అన్నారు.. 1955-56లో ప్రభుత్వ రంగ, ప్రభుత్వ సర్వీస్‌లపై చర్చ జరిగినప్పుడు జనసంఘ్ వ్యతిరేకించిందని, నేడు మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలపై కత్తిగట్టిందని అమర్‌జిత్ కౌర్ విమర్శించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఐదు సమ్మెలు నిర్వహించాయని, కానీ గోడీ మీడియా వాటిని పూర్తిగా విస్మరించిందని ఆమె పేర్కొన్నారు.

ఐక్య పోరాటాలే శరణ్యం : జయసేన్ మెహర్

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఐక్య పోరాటాలే శరణ్యమని ఎఐయుటియుసి అఖిల భారత కార్యవర్గ సభ్యులు జయసేన్ మెహర్ అన్నారు. కార్మిక సంఘాల ఐక్యత మరింత బలపడాలని ఆయన కోరారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్లను తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు.

అచ్ఛే దిన్ ర్పొరేట్లకే: జి.మధుసూదన్

మోడీ పాలనలో అచ్ఛే దిన్ (మంచి రోజులు) కార్పొరేట్లకే తప్ప కార్మికులకు కాదని టియుసిసి కార్యవర్గ సభ్యుడు జి.మధుసుదన్ అన్నారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక సమ్మె, మోడీ సర్కార్‌కు చెప్పుతో కొట్టే విధంగా ఉండాలని అన్నారు.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి: సోనియా జార్జి

సైద్ధాంతికంగా, రాజకీయంగా భిన్నాబిప్రాయాలు ఉన్నప్పటికీ, కార్మికుల హక్కుల సాధన పోరాటానికి సిఐటియు అఖిల భారత మహాసభ వేదిక అయిందని ఎస్ఈడబ్ల్యుఎ ఉపాధ్యక్షురాలు సోనియా జార్జి అన్నారు. దేశంలో మతోన్మాద విధానాల అమలుతో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నాయని, ఈ నేపథ్యంలో కార్మికుల సమస్యలపై కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడుతున్నాయని అన్నారు.

ఐక్యంగా ముందుకు : క్లిఫ్టన్ డి రోజారియో

దేశంలో ఎన్నడూ లేనంతంగా కార్మికులపై దాడి జరుగుతోందని ఎఐసిసిటియు ఉపాధ్యక్షులు క్లిఫ్టన్ డి రోజారియో అన్నారు. దేశంలో లేబర్ కోడ్లను అమలు చేసిన రోజు కార్మికులకు బ్లాక్ డేగా ఆయన అభివర్ణించారు.కార్మికుల హక్కులు హరించే ఈ లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

కార్మికులపై దాడిః సికె అప్పాస్వామి

మోడీ సర్కార్ ప్రైవేటీకరణ విధానాలతో కార్మికులపై సరికొత్త దాడికి దిగుతోందని యుటియుసి జాతీయ నేత సికె అప్పాస్వామి అన్నారు. ఇటీవలి పార్లమెంట్ శాంతి బిల్లు తీసుకొచ్చి అణుశక్తి రంగాన్ని ప్రైవేటీకరిస్తున్నారని, దీనివల్ల దేశ భద్రత, కార్మికుల హక్కుల హననం జరుగుతాయని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీరం చేసేందుకు బిల్లు ఆమోదించారని, దీంతో గ్రామీణ వ్యవసాయ కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఎల్‌పిఎఫ్ అధ్యక్షులు షణ్ముగమ్ అనివార్య కారణాలతో మహాసభకు హాజరుకాలేపోయారు. దీంతో ఆయన తన సందేశాన్ని మహాసభకు పంపిచారు. సిఐటియు అధ్యక్షురాలు కె.హేమలత ఆ సందేశాన్ని చదివి వినిపించారు.

మహిళల భాగస్వామ్యం పెంచుతాం : మరియం ధావలే

దేశంలో సిఐటియు చేపడుతున్న ఉద్యమాల్లో మహిళలు భాగస్వామ్యం పెంచే దిశగా కృషి చేస్తామని ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం ధావలే అన్నారు. సిఐటియు మహాసభలో సౌహార్ద్ర సందేశం ఇచ్చిన ఆమె ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలోనూ మహిళల భాగస్వామ్యాన్ని పెంచుతామని అన్నారు. దేశంలో మహిళలు, కార్మికులు, పీడితులపై పాలకులు దాడి పెంచుతున్నారన్నారు. దేశంలో విద్య, వైద్యం బలహీన పరిచరని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ చట్టాలను మార్చేసి కోట్ల మంది బలహీనులపైనా మహిళలపైన ఒత్తిడి పెంచుతున్నారన్నారు.

ఉత్సాహంగా... ఉత్తేజంగా

సిఐటియు మహాసభ ప్రారంభం

మహాసభ ప్రారంభంలో పతాకావిష్కరణ

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

సిఐటియు 18వ అఖిలభారత మహాసభలు విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో బుధవారం అత్యంత ఉత్సాహ పూరితంగా ప్రారంభమయ్యాయి. మహాసభల ప్రారంభ సూచికగా సిఐటియు జాతీయ అధ్యకులు కే.హేమలత సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'ఎత్తరా ఎర్రెర్రని జెండా' అంటూ ప్రజానాట్యమండలి కళాకారులు గీతాన్ని ఆలాపించారు. . అనంతరం ప్రతినిధులు అంతా ఒకరి తరువాత ఒకరిగా అమరవీరుల స్థూపం వద్ద రెడ సెల్యూట్ చేస్తూ నివాళులర్పించారు. 'వీరులారా.. ఓ అమరులారా..'అంటూ కార్మిక, ప్రజా పోరాట యోధులను గుర్తచేసుకుంటూ పాడిన పాట ఉత్కంఠను నింపింది. 'అమరులకు జోహార్లు' అన్న నినాదాలతో మహాసభ ప్రాంగణం మారుమ్రోగింది. దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రతినిధులతో మహాసభల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జనరల్ సెక్రటరీ పంబిస్ కిరీట్సిస్ సిఐటియు ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్, ఉపాధ్యక్షులు దేవరాయ్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు, అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు, కేరళ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శివన్ కుట్టి, నాయకులు ఎఆర్ సింధు, ఎరమరం కరీం తదితరులు కార్యక్రమంలో అగ్ర భాగాన నిలిచారు.

అమరులకు నివాళులర్పిస్తున్న సిఐటియు నేతలు తపన్‌సేన్, ఎకె పద్మనాభన్, ఎలమరం కరీమ్

మహాసభలో ప్రసంగిస్తున్న సిఐటియు అధ్యక్షులు హేమలత

ఉక్కుపాదంపై ఐక్య ఉద్యమాలు

- సిఐటియు అధ్యక్షులు హేమలత పిలుపు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి

కార్మికవర్గ పోరాటాలపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోపుతున్న ఉక్కుపాదాన్ని ఐక్య ఉద్యమాలతో తిప్పికొట్టాలని సిఐటియు అధ్యక్షులు కె. హేమలత పిలుపునిచ్చారు. విశాఖలో ప్రారంభమైన సిఐటియు 18వ అఖిల భారత మహాసభలో ఆమె మాట్లాడుతూ, గడిచిన మూడేళ్లలో కార్మికవర్గంపై పాలకవర్గాల దాడి పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. పాలకులు కార్పొరేట్లకు అనుకూల విధానాలను అవలంబించటం వల్ల కార్మికుల కొనుగోలు శక్తి తగ్గిపోయిందని అన్నారు. "కేంద్ర ప్రభుత్వం ఇటీవల కార్మిక చట్టాలను రద్దు చేసి వారి హక్కులకు భంగం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు తీసుకువచ్చింది. ప్రయివేటు రంగానికి పెద్దపీట వేస్తూ, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. దీంతో, లక్షలాది కార్మికులు ఉద్యోగ, సామాజిక భద్రతతోపాటు అనేక హక్కులను కోల్పోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ నేపథ్యంలో కార్మికవర్గ ఐక్యత మరింతగా పెరగాల్సిన అవసరం ఉంది." అని పేర్కొన్నారు. ఆ దిశగా సిఐటియు పనిచేస్తోందని చెప్పారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు హక్కుల పరిరక్షణకు చేపట్టాల్సిన పోరాటాలపై మహాసభలో చర్చిస్తామని అన్నారు. ఫిబ్రవరి 12న జరిగే సమ్మెలో కార్మికవర్గ సత్తా చూపించేందుకు శ్రామికులు, సంఘాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

విశాఖ ఉక్కును రక్షించుకోవాలి

- మహాసభ తీర్మానం...

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో అనతలవట్టం ఆనందన్ నగర్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వైజాగ్ స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్)ను ప్రైవేటీకరించాలన్న నిర్ణయాన్ని సిఐటియు 18వ అఖిల భారత మహాసభ తీవ్రంగా ఖండించింది. సంఘం ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఈ మేరకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మహా సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. కేంద్ర ప్రభుత్వం దూకుడుగా అమలుచేస్తున్న ప్రజా వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాల తిప్పికొట్టాలని మహాసభ పిలుపునిచ్చింది. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అనే నినాదంతో ఏర్పాటైన ఉక్కు ఫ్యాక్టరీని నిర్వీర్యం చేసే కుట్రలను తీర్మానం ఎండగట్టింది. 32 మంది ప్రాణబలిదానం తర్వాత సాధించబడ్డ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే తీర ప్రాంతంలో ఏర్పాటు చేయబడ్డ ఏకైక పరిశ్రమ అని రూ.వేలకోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డివిడెడ్ల రూపంలో ఇంతవరకూ ఇచ్చిందని చెప్పారు. 1982లో స్థాపించబడి వేల కుటుంబాల జీవితాలను కాపాడుతోంది. 22వేల ఎకరాల్లో విస్తరించి ఒక వ్యూహాత్మక ప్రభుత్వ రంగ ఆస్తిగా ఉందని తీర్మానం పేర్కొంది. నయా ఉదారవాద విధానాలు ప్రారంభమైన 1991 నుంచి స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ దాడులు పెరుగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ దీన్ని బలహీన పరుస్తూ వస్తున్నాయి. గంగవరం పోర్టు కూడా వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసమే ఏర్పాటు చేయబడినా దీన్ని కార్పొరేట్లకు పాలకులు ఇచ్చేయడంతో స్టీల్‌ప్లాంట్ ఇబ్బందులకు ఇదొక కారణంగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలు అసమర్థంగా ఉన్నాయనే ప్రభుత్వాల వాదనలను తిప్పికొడుతూ 2004 నాటికి రూ.కోట్ల లాభాలను ఆర్జించింది. 7.3 మిలియన్ టన్నుల ప్రణాళికలతో ముందుకెళ్తోంది. 2025 నాటికి స్టీల్‌ప్లాంట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నులు, డివిడెండ్ల రూపంలో రూ.57789 కోట్ల మేర ఇచ్చింది. వేల సంఖ్యలో ఉపాధిని సృష్టించింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2021 జనవరి 27న ఆర్ఐఎన్ఎల్‌ను వ్యూహాత్మక అమ్మకానికి పెట్టింది. కార్మికులను, కార్మిక సంఘాలనూ పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా చేసిన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేంతవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపింది.

CITU
18th ALL INDIA CONFERENCE

ఫిబ్రవరి 12 సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు మహాసభ పిలుపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో అనతలవట్టం ఆనందన్ నగర్

లేబర్‌కోడ్‌ల రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12వ తేది నిర్వహించనున్న య కార్మికసంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మహాసభ పిలుపునిచ్చింది. బుధవారం ప్రారంభమైన మహాసభలో సిఐటియు అధ్యక్షురాలు కె. హేమలత ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. లేబర్‌కోడ్‌ల రద్దుకు పోరాడాలని కార్మికవర్గానికి మహాసభ పిలుపునిచ్చింది. ఈ సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా ఇప్పటికే మద్దతు ఇచ్చిన విషయాన్ని కూడా తీర్మానంలో పేర్కొన్నారు. సమ్మెను విజయవంతం చేయడానికి కార్మికవర్గం పూర్తిస్థాయిలో శక్తి సామర్థ్యాలనింటిని వినియోగించాలని, వనరులను సమీకరించాలని మహాసభ పిలుపునిచ్చింది. సమ్మెపైన మోడీ ప్రభుత్వం అనేకవిధమైన అణచివేత చర్యలకు పాల్పడే అవకాశం ఉందని, అయినా కార్మికవర్గం పట్టుదలతో విజయవంతం చేయాలని కోరింది. ఇప్పటికే సార్వత్రిక సమ్మె జయప్రదానికి 500 పైగా జిల్లాల్లో వేలాది ప్రదేశాల్లో, పని ప్రదేశాలు, పారిశ్రామిక ప్రాంతాలు గ్రామీణ ప్రాంతాలలో భారీ ఎత్తున ప్రదర్శనలు జరిగాయని తీర్మానంలో పేర్కొన్నారు. . పని గంటలు పెద్ద ఎత్తున పెంచుతున్నందున పోరాడితే తప్ప లేబర్‌కోడ్‌లను వెనక్కి కొట్టడం సాధ్యం కాదని తెలిపారు. 'యజమానులకు అనుకూలంగా కార్మిక చట్టాలను పూర్తిగా బలహీనం చేసి కార్మికులను వెట్టి వారిగా మార్చే లేబర్ కోడ్‌లపై దేశ వ్యాప్తంగా తిరుగుబాట్లు రావాలి.' అని తీర్మానంలో పేర్కొన్నారు. లేబర్‌కోడ్‌లపై ప్రచారానికి కేంద్ర ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనంను వృధ్ధా చేస్తూ దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

స్ఫూర్తిని నింపిన అమరుల జ్యోతులు

- మహాసభ ప్రాంగణానికి చేరిక
- అందుకున్న కార్మిక యోధులు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి అనతలవట్టం ఆనందన్ నగర్ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన అరవీరుల జ్యోతులు మహాసభ ప్రాంగణంలో స్ఫూర్తిని నింపాయి. అనకాపల్లి జిల్లా నుంచి అల్లూరి సీతారామరాజు జ్యోతి, శ్రీకాకుళం మందస నుంచి వీర గున్నమ్మ జ్యోతి, నెల్లూరు జిల్లా నుంచి కే పెంచలయ్య జ్యోతులను అక్కడి కార్మికవర్గం తీసుకువచ్చిన సంగతి తెలిసింది. ప్రారంభ స్థానాల నుండి మపసభ ప్రాంగణం వరకు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోరాట కాంతులు వెదజల్లిన ఆ జ్యోతులు బుధవారం ఉదయానికి మహాసభ ప్రాంగణానికి చేరుకున్నాయి. అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామంటూ మహాసభ ప్రతినిధులు చేస్తున్న నినాదాల మధ్య కార్మిక యోధులు అందుకున్నారు. అల్లూరి సీతారామరాజు జ్యోతిని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ స్వీకరించారు. కేడిపేట నుండి వచ్చిన ఈ జ్యోతి వెంట సిఐటియు జిల్లా కార్యదర్శి అరికట్ల రాజు, కెవిపిఎస్ కార్యదర్శి చిరంజీవి, భవనిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, భవన నిర్మాణ కార్మికసంఘం ఉపాధ్యక్షులు శివ తదితరులు ఉన్నారు. నెల్లూరు నుంచి పెంచలయ్య జ్యోతి వెంట ఆయన భార్య కె. దుర్గ, కుమారులు కుమార్ దేవ్, నిఖిల్, సిఐటియు జిల్లా కార్యదర్శి గోగుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. ఈ జ్యోతిని సిఐటియు అధ్యక్షులు కె. హేమలత అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లా మందస వి జి పురం నుంచి తీసుకొచ్చిన వీర గున్నమ్మ జ్యోతి వెంట సిఐటియు జిల్లా కార్యదర్శి తేజేశ్వరరావు, నాయకులు నాగేశ్వరరావు, దిలీప్‌కుమార్ తదితరులు ఉన్నారు. ఈ జ్యోతిని డబ్ల్యుఎఫ్‌టియు ప్రధాన కార్యదర్శి పాంబిస్ కిరిట్సిస్ అందుకున్నారు.

అల్లూరి సీతారామరాజు జ్యోతి

పెంచలయ్య జ్యోతి

వీరగున్నమ్మ జ్యోతి

మహాసభలో ప్రసంగిస్తున్న ఆహ్వాన సంఘ అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు

ప్రైవేటీకరణపై పోరులో వేగుచుక్క విశాఖ!

- ఆహ్వాన సంఘ అధ్యక్షులు సిహెచ్.నరసింగరావు స్వాగతోపన్యాసం

అనతలవట్టం ఆనందన్ నగర్ - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రైవేటీకరణపై పోరులో విశాఖ ఓ వేగు చుక్కగా నిలుస్తుందని సిఐటియు పద్దెనిమిదవ అఖిల భారత మహాసభ ఆహ్వాన సంఘ అధ్యక్షులు సిహెచ్ నరసింగ రావు అన్నారు. బుధవారం ఉదయం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో ప్రారంభమైన సిఐటియు మహాసభలో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం , తూర్పు తీరానికి ముఖద్వారమైన విశాఖ నగరానికి దేశ నలుమూలల నుంచి విచ్చేసిన కార్మికోద్యమ ప్రతినిధులకు స్వాగతం.. సుస్వాగతమన్నారు. ప్రతిష్టాత్మకమైన పలు ప్రభుత్వ రంగ సంస్థలకు నిలయం, తూర్పు తీర ముఖద్వారమైన విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద నగరమన్నారు. కార్మికవర్గ ఉద్యమాలతో పాటు స్వాతంత్ర్య పోరాటపు ఘన వారసత్వాన్ని సిఐటియు ముందుకు తీసుకెళ్తుందని ఆయన ఉద్ఘాటించారు. 1923-24లో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శక్తివంతమైన బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన నేల ఇది. విశాఖపట్నానికే గర్వకారణంగా నిలిచిన పోర్ట్, ఉక్కు ఫ్యాక్టరీ వంటివి కేంద్ర ప్రభుత్వ సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలతో ప్రమాదపుటంచునకు నెట్టబడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ రంగ సంస్థలైన షిప్‌యార్డ్, స్టీల్‌ప్లాంట్, డిసిఐ, బిహెచ్‌పివి, హెచ్‌పిసిఎల్, విశాఖ పోర్టు వంటి సంస్థల్లో కార్మికవర్గం సిఐటియు బ్యానర్ కింద రాజీలేని పోరాటం సాగిస్తోందన్నారు. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించి ఏడాదిపాటు ఇబ్బందులకు గురిచేసిందని, అయినా పట్టువదలని విక్రమార్కునిలా సిఐటియు 1200 మబంది ఉద్యోగులను అధికారులను ఏకం చేసి పోరాడి ప్రైవేటీకరణ నిలుపుదల చేయగలిగిందన్నారు. దేశంలోని మేజర్ పోర్టుల భాగస్వామ్యంతో నిర్వహించుకునేలా సిఐటియు చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడానికి 2021 నుంచి కేంద్రం ప్రయత్నిస్తోందని, కాంట్రాక్టు కార్మికులను తొలగిస్తోందని. పర్మినెంట్ కార్మికులను విఆర్ఎస్ పై ఇంటి పంపిస్తూ, అనేక వేధింపులకు పాల్పడుతోందన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా కార్మికులు ఎదురొడ్డి పోరాడుతున్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సవాళ్లు ఉపాధి సమస్యలు స్టీల్‌ప్లాంట్‌లో తీవ్రమౌతున్నాయన్నారు. విశాఖ షిప్‌యార్డును రక్షించడంలో ఆనాడు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ హోదాలో సీతారాం ఏచూరి చేసిన కృషిని ఆయన కొనియాడారు.

అయిదు రోజుల పాటు జరిగే సిఐటియు అఖిలభారత మహాసభ భవిష్యత్ పోరాటాలకు మార్గనిర్దేశం చేయడంలో కీలక భూమిక వహించాలని, ప్రతినిధుల చర్చలు ఆ దిశలో సాగాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూడా అయిన సిహెచ్ నరసింగరావు ఆకాంక్షించారు. విశాఖలో డిసెంబర్ నెలలో పెట్టుబడిదారుల సమ్మిట్‌ను ఏర్పాటు చేసిన కూటమి ప్రభుత్వం రూ.లక్షల కోట్లు పెట్టుబడులొస్తాయంటూ ప్రకృతి వనరులు, భూములను కార్పొరేట్లకు కారుచౌకగా దోచిపెట్టాలని చూస్తోంది. వీటిపైనా సిఐటియు పోరాడుతుందని ఆయన చెప్పారు.

పని గంటలు పెంచినారు కార్మికుడా.. ఇది తగదంటూ నినదించు శ్రామికుడా..

శ్రామిక ఉత్సవ్‌లో ఆకట్టుకుంటున్న సాంస్కృతిక ప్రదర్శనలు

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68